సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 247

గురువారం 28-11-2019



'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

కొత్త శిఖరాలకు సూచీలు

199 పాయింట్లతో 41,021కు సెన్సెక్స్. రికార్డ్ స్థాయిల్లో ముగింపు -బిజినెస్‌లో

స్వర్ణ సురేఖ...

ఆసియా ఆర్చరీ పోటీల్లో వసిడి పతకం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కృత్రిమ మేధపై మార్గదర్శనం చేయండి

- రాష్ట్రాన్ని కోరిన నీతి ఆయోగ్
- త్వరలో దేశవ్యాప్తంగా 5 చోట్ల కోర్ సెంటర్లు
- మరో 20 చోట్ల ఇక్టయ్ కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో కొత్తగా వాడుకలోకి వస్తున్న నూతన సాంకేతికత కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)కు సంబంధించి జాతీయ స్థాయిలో పరిశోధనలకు తెలంగాణ మార్గనిర్దేశనం చేయనుంది. ఏఐ పరిశోధనలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించే బాధ్యతను కేంద్రం 2017లో నీతి ఆయోగ్‌కు అప్పగించింది. 'ఏఐ ఫర్ ఆల్'పేరిట నీతిఆయోగ్ గతేడాది నివేదిక విడుదల చేసింది. వివిధ రంగాల్లో ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఐరావత్ అనే ఐటీ ప్లాట్‌ఫారంతో పాటు ఏఐ రంగంలో పరిశోధన, అభివృద్ధి కోసం రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. దేశంలో 5 సెంటర్స్ ఆఫ్ రీసెర్చ్ ఎక్సలెన్స్ (కోర్), 20 ఇంటర్నేషనల్ సెంటర్స్ ఫర్ మిగతా 3వ పేజీలో ▶

ఫోన్ పట్టు.. పాఠం నేర్పు!

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

చదువులో వెనకబడిన విద్యార్థులకు త్వరలోనే ఫోన్ ద్వారా ప్రత్యేక బోధన అందించనున్నారు. ఇప్పటివరకు ప్రత్యేక శిక్షకుల ఆధ్వర్యంలో మాత్రమే ట్యూషన్లు చెప్పేవారు. కానీ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా టెలీ టీచర్స్ ఆధ్వర్యంలో ఫోన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో

- ఫోన్ ద్వారా విద్యార్థులకు బోధన
- త్వరలో ప్రవేశపెట్టనున్న విద్యా శాఖ
- మహారాష్ట్ర తర్వాత మన రాష్ట్రంలోనే..

పేద, మధ్య తరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. దీంతో వారు తరగతి గదుల్లో మాత్రమే విద్య నేర్చుకున్నారు. వసతి గృహాల్లో ట్యూటర్ ఉండటంతో అక్కడి విద్యార్థుల సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోగలుగుతారు. కానీ అనేక మంది విద్యార్థులు బిడియం, మొహమాటం కారణంగా తరగతి గదుల్లో తమ సందేహాలను మిగతా 3వ పేజీలో ▶

భవితవ్యం తేలేది నేడే

కేబినెట్ భేటీలో ఆర్టీసీపై కీలక నిర్ణయం తీసుకోనున్న సర్కారు

- కార్మికులను విధుల్లోకి చేర్చుకుంటే షరతుల విధింపు దాదాపు ఖాయం!
- ప్రైవేటీకరణ యోచనపై ఆచితూచి నిర్ణయించే అవకాశం
- ఒకవేళ ప్రైవేటీకరణ నోటిఫికేషన్ వెలువడితే కార్మికులను సగానికి తగ్గించాల్సిన పరిస్థితి
- వీఆర్ఎస్ ఇవ్వాలంటే రూ. 5 వేల కోట్లు అవసరమన్న అధికారులు
- సమ్మె కేసును లేబర్ కోర్టుకు బదిలీ చేయడంపైనా జరగనున్న చర్చ
- ఏటా చార్జీల పెంపుపై రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటుపై కూడా...

సాక్షి, హైదరాబాద్: దేశంలో మెరుగైన ప్రజా రవాణా సంస్థల్లో ఒకటిగా కొనసాగుతున్న తెలంగాణ ఆర్టీసీ భవితవ్యంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. గురు, శుక్రవారాల్లో నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీకి కొత్త రూపు ఇవ్వనుంది. 52 రోజులపాటు కొనసాగిన సమ్మె, 30 మందికిపైగా కార్మికుల మృతి, తాత్కాలిక సిబ్బంది బస్సులు నడుపుతున్న సమయంలో జరిగిన ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు మరణించడం వంటి పరిణామాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుండటం, పార్లమెంటులోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరేందుకు ఎదురుచూస్తున్నందున వారి భవితవ్యాన్ని తేల్చకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుండటంతో రెండు రోజులపాటైనా సరే మంత్రివర్గ భేటీ నిర్వహించి ఈ విషయాన్ని తేల్చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కేబినెట్ భేటీ కొనసాగుతుందని, ఈ భేటీలో ఆర్టీసీ అంశం పూర్తిగా మిగతా 2లో ▶

ఇస్రో విజయ విహారం

5 లో

శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్‌ఎల్వీ సీ47 రాకెట్. ప్రయోగం విజయవంతం కావడంతో యువత కేరింతలు

మేం రాజీనామా చేస్తాం.. ఆర్టీసీని అలాగే ఉంచండి

ప్రభుత్వాన్ని కోరిన కార్మిక జేఏసీ నేత థామస్‌రెడ్డి 2 లో

9లోగా 'అయోధ్య' రివ్యూ పిటిషన్

ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ప్రకటన -5లో

గవర్నర్ కోశ్యారీతో ఉద్ధవ్ ఠాక్రే దంపతులు

ఎన్సీపీకి డిప్యూటీ సీఎం.. కాంగ్రెస్‌కు స్పీకర్

- మహారాష్ట్ర సీఎంగా నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న ఉద్ధవ్ ఠాక్రే
- హాజరవనున్న సోనియా, మమత, కేజ్రీవాల్, స్టాలిన్!
- మోదీకీ ఆహ్వానం

- వివరాలు 5లో

రక్షణ భూముల బదలాయింపుపై కదలిక

- 151 ఎకరాలకు రక్షణ శాఖ ఇప్పటికే ఆమోదం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే తరువాయి..
- నిబంధనలకు అంగీకరిస్తే 'స్కైవే'లకు రూట్ క్లియర్

- వివరాలు 4లో

జబ్బుల మాటున ఇన్ఫెక్షన్లు!

- దేశంలో ఎక్కువగా ఇన్ఫెక్షన్ల ద్వారానే రోగాలు
- ఆ తర్వాతి స్థానం గాయాలదే..
- గుండె జబ్బులకన్నా పేగు సంబంధిత రోగాలే అధికం
- కేన్సర్ వైద్యానికి కనీసం రూ. 61 వేల పైనే.. గుండె జబ్బులకు రూ. 36 వేలు
- నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ సర్వేలో వెల్లడి

- వివరాలు 3లో

తెలంగాణ ప్రభుత్వం తన వాటా ఇవ్వకనే..

- బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం వల్లే రైల్వే ప్రాజెక్టుల్లో జాప్యం
- రాష్ట్రంలో రైల్వే లైన్ల నిర్మాణంపై మంత్రి పీయూష్ గోయల్

సాక్షి, న్యూఢిల్లీ: మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైను ప్రాజెక్టు, అక్కన్నపేట–మెదక్ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా నిధులు కేటాయించాల్సి ఉందని, అవి జమ చేయకపోవడం వల్లే రాష్ట్ర ప్రాజెక్టుల్లో పురోగతి లేదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అనుముల రేవంత్‌రెడ్డి అడిగిన పలు ప్రశ్నలకు ఆయన బుధవారం లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. తెలంగాణలో జరుగుతున్న మొత్తం 13 ప్రాజెక్టుల్లో 3 ప్రాజెక్టులు కాస్ట్ షేరింగ్ పద్ధతిలో అమలుచేస్తున్నామని, ఈ రెండు ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం, భద్రాచలం–సత్తుపల్లి లైన్‌కు సింగరేణి సంస్థ నిర్మాణ వ్యయంలో కొంత వాటా భరిస్తున్నాయని వివరించారు. మనోహరాబాద్–కొత్తపల్లి లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. 307 కోట్లు భరించాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ. 60 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, ఇప్పటివరకు అయిన ఖర్చుకుగాను మరో రూ. 71.61 కోట్లు జమ చేయాల్సి ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జమ చేయని పక్షంలో బిల్లులు చెల్లించడం ఆలస్యమవుతుందని, ప్రాజెక్టు పురోగతిపై ప్రభావం చూపుతుందని వివరించారు. అలాగే అక్కన్నపేట–మెదక్ లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. 105.38 కోట్లు భరించాల్సి ఉందని, ఇప్పటివరకు రూ. 50.41 కోట్ల ఖర్చుకు గాను కేవలం రూ. 21.15 కోట్లు మాత్రమే జమ చేసిందని వివరించారు. అలాగే భద్రాచలం–సత్తుపల్లి ప్రాజెక్టుకు సింగరేణి సంస్థ రూ. 619 కోట్లకుగాను, ఇంకా రూ. 463 కోట్లు జమ చేయాల్సి ఉందని వివరించారు. సింగరేణి సంస్థ చెల్లించకపోవడం వల్ల ప్రాజెక్టు పురోగతి దెబ్బతిందని వివరించారు. ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం తమ వాటా నిధులను చెల్లించేందుకు ఎలాంటి హామీ ఇవ్వలేదని వివరించారు.

తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తి పోస్టుల ఖాళీలు 11

సాక్షి, న్యూఢిల్లీ: నవంబర్ 20 నాటికి తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తి పోస్టుల ఖాళీలు 11, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తి పోస్టుల ఖాళీలు 22 ఉన్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. లోక్‌సభ సభ్యుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టుసహా అన్ని రాష్ట్రాల హైకోర్టుల్లో 1,079 న్యాయమూర్తి పోస్టులకుగాను 421 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌పై జీహెచ్ఎంసీ బృందం పరిశీలన

- మేయర్ బొంతు రామ్మోహన్ నేతృత్వంలో అధికారుల బృందం ఢిల్లీ పర్యటన



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్, మున్సిపల్ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, నిర్మాణ వ్యర్థాల సేకరణకు ఉపయోగిస్తున్న పోర్టబుల్ కంప్యాక్టర్లను జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. న్యూఢిల్లీలో ఘన వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించేందుకు ఏర్పాటు చేసిన పోర్టబుల్ కంప్యాక్టర్ల పనితీరును పరిశీలించారు. విద్యుత్ ఉత్పాదన ప్లాంట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలను జీహెచ్ఎంసీ అధికారులు అడిగి తెలుసుకున్నారు. బొంతు రామ్మోహన్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, కమిషనర్ డి.ఎస్.లోకేశ్ కుమార్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విశ్వజిత్ కంపాటి, స్పెషల్ కమిషనర్ సుజాత గుప్తా తదితరులు పరిశీలన బృందంలో ఉన్నారు.

బడులు తగ్గించి బార్లు పెంచుతున్నారు

- జనవరి నుంచి టీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం



కె.లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం బడుల సంఖ్యను తగ్గించి బార్ల సంఖ్య పెంచుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. నాణ్యమైన విద్య అందరికీ అందినప్పుడే దేశ ప్రగతికి బాటలు పడతాయన్నారు. దీన్ని విస్మరించిన టీఆర్ఎస్ ప్రభుత్వం బడులను మూసేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేషనలైజేషన్ పేరుతో ఇప్పటి వరకు రాష్ట్రంలో 4 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించిన ప్రభుత్వం..విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమైందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై జనవరి నుంచి తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి జోక్యం చేసుకోండి

లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన ఎంపీ రేవంత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి కోరారు. బుధవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. 1950 మోటార్ వాహన చట్టం సెక్షన్–ఏ ప్రకారం ఏపీ రోడ్డు రవాణా సంస్థ ఏర్పడిందని, రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన తెలంగాణ ఆర్టీసీకి 10,460 బస్సులు, 49 వేల మంది ఉద్యోగులను కేటాయించారన్నారు. అయితే డిమాండ్ల సాధనకు కార్మికులు సమ్మె చేస్తున్నారని, ఇప్పటివరకు 38 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కరీంనగర్‌లో ఆర్టీసీ డ్రైవర్ బాబు అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ బండి సంజయ్‌పై కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నారని అన్నారు. ఆయన ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినా ఇప్పటివర కు చర్యలు తీసుకోలేదన్నారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరాలని నిర్ణయించారని, అయితే ప్రభుత్వం అనుమతించడం లేదన్నారు. 2014 నుంచి కార్మికులకు చెందిన పీఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారని, 7 వేల మంది కార్మికులకు క్లెయిమ్‌లు జారీ చేయలేదని, కార్మిక చట్టం ప్రకారం దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

బీడీ కార్మికుల పీఎఫ్ కేవైసీ గడువు పెంపు

సాక్షి, న్యూఢిల్లీ: బీడీ కార్మికుల పీఎఫ్ కేవైసీ ఫైలింగ్ గడువును మూడు నెలలు పొడిగించినట్లు బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. కేవైసీ ఫైలింగ్‌కు మొదట ఇచ్చిన నోటీసు ప్రకారం ఈనెల 30వ తేదీతో గడువు ముగియనుందని ఆయన అన్నారు. అయితే బీడీ కార్మికుల్లో వయోధికులు, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండటంతో వారు సకాలంలో కేవైసీ ఫైల్ చేయలేకపోతున్నారని చెప్పారు. దీంతో గడువు పెంచాల్సిందిగా తాను బుధవారం ఢిల్లీలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌ను కలసి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీంతో కేంద్ర మంత్రి కేవైసీ ఫైలింగ్ గడువును మరో 3 నెలలు పెంచారని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 లక్షల మంది కార్మికులకు వెసులుబాటు కలుగుతుందని వివరించారు.

ఆర్టీసీ డిపోల వద్ద రెండో రోజూ అదే సీన్

కార్మికులను అడ్డుకున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: సమ్మె విరమించిన నేపథ్యంలో విధుల్లో చేరేందుకు పెద్ద సంఖ్యలో కార్మికులు డిపోల వద్దకు చేరుకుంటున్నారు. మంగళవారం ఉదయం తొలి డ్యూటీకి వస్తే అధికారులు నిరాకరించడంతో వెనుదిరిగిన కార్మికులు.. బుధవారం మళ్లీ వచ్చారు. పోలీసులు అడ్డుకున్నా, అరెస్టు చేసినా భయపడకుండా బుధవారం 6 గంటలకే సంబంధిత డిపోల వద్దకు చేరుకోవాలన్న జేఏసీ నేతల పిలుపుతో సూర్యోదయం కంటే ముందే వారు డిపోల వద్దకు చేరుకున్నారు. అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలున్న నేపథ్యంలో అప్పటికే పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చిన పోలీసులు కార్మికులను డిపోలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. సమ్మె విరమించినా తమను ఎందుకు అనుమతించడంలేదని వారితో వాగ్వాదానికి దిగారు. 97 డిపోల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది. కొన్ని ప్రాంతాల్లో కార్మికులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమ్మె విరమించినా విధుల్లోకి తీసుకోకపోవడం చట్ట విరుద్ధమని పేర్కొంటూ ఇదే పరిస్థితి పునరావృతమైతే గురువారం కార్మికశాఖ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయనున్నట్లు కార్మికులు తెలిపారు. మరోవైపు విధుల్లో చేరేందుకు పెద్ద సంఖ్యలో కార్మికులు డిపోల ముందు ఆందోళన చేస్తున్నా అధికారులు మాత్రం తాత్కాలిక సిబ్బందితో యథాప్రకారం బస్సులు నడిపించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 73 శాతం బస్సులు తిప్పినట్లు వారు పేర్కొన్నారు. 1,907 అద్దె బస్సులు సహా మొత్తం 6,564 బస్సులు తిప్పినట్లు తెలిపారు. 4,657 మంది తాత్కాలిక డ్రైవర్లు, 6,564 మంది తాత్కాలిక కండక్టర్లు విధులకు హాజరైనట్లు పేర్కొన్నారు. 6,488 బస్సుల్లో టిమ్ యంత్రాలు వాడారని, 68 బస్సుల్లో పాత పద్ధతిలో టికెట్లు జారీ చేశారని వెల్లడించారు.

• ఉప రాష్ట్రపతిని కలసిన మంత్రి కేటీఆర్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ బుధవారం సాయంత్రం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు ఉదయం మేఘాలయ సీఎం సీకే సంగ్మాను కూడా కేటీఆర్ కలుసుకున్నారు. ఈ భేటీపై సీకే సంగ్మా సామాజిక మాధ్యమంలో.. 'నా ప్రియమైన స్నేహితుడు కేటీ రామారావును కలుసుకోవడం గొప్పగా ఉంది' అంటూ పంచుకున్నారు. సంగ్మాతో చిన్న సమావేశమే అయినా అద్భుతంగా జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు.

భవితవ్యం తేలేది నేడే

▶ మొదటి పేజీ తరువాయి

తేలని పక్షంలో శుక్రవారం కూడా సమావేశం కొనసాగ నుందని అధికార వర్గాలు వెల్లడించాయి. కార్మికులు మంచివారేనని, ఆర్టీసీలో పనిచేస్తున్న అధికారులూ కష్టపడే అధికార వర్గాలు వెల్లడించాయి. కార్మికులు మంచివారేనని, ఆర్టీసీలో పనిచేస్తున్న అధికారులూ కష్టపడే తత్వమున్నవారేనని, కానీ కార్మిక సంఘాల నేతలే వారిని చెడగొడుతున్నారంటూ ముఖ్యమంత్రి గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కార్మిక సంఘాల నేతల వల్లే ఆర్టీసీ పాడైందన్న తరహాలో మాట్లాడారు. ఇప్పుడు స్వయంగా జేఏసీ నేతలే సమ్మె విరమించి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరినా అది సాధ్యం కాదంటూ ఎండీ ప్రకటించడంతో గత రెండు రోజులుగా కార్మికులు తెల్లవారక ముందే డిపోల వద్దకు చేరుకొని పడిగాపులు కాస్తున్నారు. వారిని విధుల్లోకి తీసుకోకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో వారిని విధుల్లోకి తీసుకోవాలంటూ సీఎంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం మంత్రివర్గ భేటీలో తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి మదిలో ఏ నిర్ణయముందనే విషయంలో మంత్రులు, అధికారులకూ స్పష్టత లేదు. కావాల్సిన సమాచారాన్ని కేబినెట్ భేటీ నాటికి సిద్ధం చేయాలంటూ ముఖ్యమంత్రి మంగళవారం అధికారులను ఆదేశించడంతో వారు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆ పనిలోనే తలమునకలయ్యారు.

పర్మిట్లపై వేచి చూసే ధోరణి?: ప్రస్తుతం ఉన్న రూపుతో ఆర్టీసీని నడపడం సాధ్యం కాదని, సగం బస్సులను తొలగించి వాటి స్థానంలో ప్రైవేటు బస్సులకు పర్మిట్లు ఇస్తామని సీఎం ఇప్పటికే పేర్కొనడం తెలిసిందే. 5,100 ప్రైవేటు బస్సులకు రూట్ల పర్మిట్లు ఇవ్వాలని గత కేబినెట్ భేటీలో చేసిన తీర్మానానికి హైకోర్టు కూడా అభ్యంతరం చెప్పకపోవడంతో ఇక నోటిఫికేషన్ వెలువడటమే తరువాయి అనే పరిస్థితి నెలకొంది. గురువారం దీనిపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఒకవేళ ముందుగా అనుకున్నట్లుగా దీన్ని అమలు చేయాలని నిర్ణయిస్తే రవాణాశాఖ వెంటనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించి రవాణాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఈ విషయంలో ఇప్పటికిప్పుడు కాకుండా కొంతకాలం తర్వాతే ముందుకు వెళ్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని కొందరు సీఎం ముందు వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై కేబినెట్‌లో లోతైన చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే హైకోర్టు సూచన మేరకు కార్మికుల సమ్మెకు సంబంధించిన కేసును లేబర్ కోర్టుకు బదిలీ చేసే అంశంపైనా ఈ భేటీలో చర్చించనున్నారు.

ఆస్తులమ్మితే తప్పు

ఆర్టీసీ అధీనంలో పెద్ద మొత్తంలో ఖాళీ భూములున్నాయి. వాటిల్లో చాలా వరకు ప్రధాన ప్రాంతాల్లో ఉన్నాయి. వాటిని అమ్మితేగానీ వీఆర్ఎస్ అమలుకు అవసరమయ్యే నిధులు ప్రభుత్వానికి సమకూరవు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌లో చేస్తున్నది ఇలాంటి కసరత్తే. ఆర్టీసీ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో అధికారులు పూర్తి వివరాలను సిద్ధం చేశారు. అయితే గురువారం జరిగే కేబినెట్ భేటీలో దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక టికెట్ల ధరలను ఏటా పెంచేలా ఓ రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటుపైనా కేబినెట్ భేటీలో చర్చించనున్నారు. మరోవైపు కార్మికులను ఒకవేళ విధుల్లోకి చేర్చుకుంటే భవిష్యత్తులో సమ్మెలు, యూనియన్ సభ్యత్వం లేకుండా పకడ్బందీ షరతులు విధించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని ఈ భేటీలో తేలుస్తారా లేదా సమగ్ర నివేదిక అందించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని వేస్తారా అనే విషయం తేలాల్సి ఉంది. అధికారులు మాత్రం ఆర్టీసీకి సంబంధించి.. కార్మికులు, వారి వయసులు, అప్పులు, ఆస్తులు, డిపోలు, వాటి పరిధిలో బస్సులు, వాటి కండిషన్, వేరే రాష్ట్రాల్లో ఆర్టీసీ పరిస్థితి, ఒక్కో బస్సు ఖరీదు వంటి వివరాలతో సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేశారు.

ఒకవేళ 5,100 ప్రైవేటు బస్సులు రంగంలోకి దిగితే ఆర్టీసీ సగానికి సగం కుంచించుకుపోనుంది. ప్రస్తుతం ఉన్న రూట్ల ప్రకారం దాని పరిధిలో 5,300 బస్సులు మాత్రమే మిగులుతాయి.

వీఆర్ఎస్‌కు రూ. 5 వేల కోట్లు కావాలి

49,700 (300 మంది ఇప్పటికే చేరారు) మంది ప్రస్తుత కార్మికుల్లో కనీసం 20 వేల మంది 'అదనం'గా మిగిలిపోతారు. వారిని కచ్చితంగా వీఆర్ఎస్ ద్వారానో, సీఆర్ఎస్ (కంపల్సరీ రిటైర్మెంట్) ద్వారానో తప్పించాల్సి ఉంటుంది. దీని పరిధిలోకి 50 ఏళ్లు పైబడిన వారిని తెచ్చే అవకాశం ఉంది. దీన్ని అమలు చేయాలంటే కనీసం రూ. 5 వేల కోట్లు అవసరమని అధికారులు లెక్కలేశారు. ఇంత మొత్తం భరించడం ప్రభుత్వానికి తలకుమించిన భారంగా మారనుంది. అయితే వచ్చే నాలుగైదేళ్లలో భారీ సంఖ్యలో కార్మికులు రిటైర్ అవుతుండటంతో ఒకవేళ అప్పటివరకు ఈ ప్రక్రియ ఆగితే ప్రభుత్వానికి వీఆర్ఎస్ బాధ ఉండదు.

మూడో ఈఎంసీని మంజూరు చేయండి

కేంద్ర మంత్రికి కేటీఆర్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో దూసుకుపోతున్న రాష్ట్రానికి మరింత ఊతమిచ్చేలా మూడో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ని మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి కేటీఆర్ కోరారు. ఈ మేరకు ఐటీ, ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న పురోగతిని వివరిస్తూ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు కేటీఆర్ బుధవారం లేఖ రాశారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రెండు పార్కుల్లో 910 ఎకరాల విస్తీర్ణంలో దేశం లోనే అతి పెద్ద ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నా యని కేటీఆర్ పేర్కొన్నారు.

దివ్యాంగుల కోసం 'జవాబు' యూట్యూబ్ చానల్

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల కోసం ఓ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన యూట్యూబ్ చానల్ లోగోను రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం ఆవిష్కరించారు. దివ్యాంగుల హక్కుల కోసం పోరాడిన జావెద్ అబిదీ జ్ఞాపకార్థం ఈ చానల్ పేరును జవాబు అని పెట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

'కార్మికులను చేర్చుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలపై దాఖలైన పిల్‌ను సవరిస్తూ హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలైంది. కార్మికులు సమ్మె చేస్తున్న సమయంలో ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు వేసిన ఈ పిల్‌లో సమ్మె చేస్తున్న యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. యూనియన్ సమ్మె విరమించడంతో విధుల్లో చేరేందుకు వెళ్తున్న కార్మికులను అడ్డుకోకుండా వెంటనే విధుల్లో చేర్చుకునేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ బుధవారం పిల్‌ను సవరించారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

హైదరాబాద్: గత కొంత కాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న మెహిదీపట్నం డిపో ఆర్టీసీ డ్రైవర్ పి.వెంకట్రాజ్యం(35) బుధవారం హార్ట్ ఎటాక్‌తో మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 15 రోజుల క్రితం కాచిగూడలోని ప్రతిమ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. వెంకట్రాజ్యం స్వస్థలం వరంగల్ జిల్లా కమలాపురం మండలం భీంపల్లి గ్రామం. సమ్మె విరమించినా కూడా విధులకు హాజరుకానివ్వకుండా కేసీఆర్ ఆంక్షలు విధించడంతో హార్ట్ ఎటాక్‌కు గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

డిగ్రీ పరీక్షల తేదీల్లో మార్పు

హైదరాబాద్: ఓయూ పరిధిలో డిసెంబర్ 15, 22 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ (ఇయర్‌వైజ్ ఓల్డ్ బ్యాచ్) రెగ్యులర్, దూరవిద్యా పరీక్షల తేదీలను మార్చినట్లు కంట్రోలర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ బుధవారం తెలిపారు. వచ్చే నెల 15న జరిగే పరీక్షను 18కి, 22న జరిగే పరీక్షను 23కు మార్చామన్నారు. డిసెంబర్ 8న జరిగే పరీక్ష యథావిధిగా జరుగుతుందన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్యాయత్నం

మెదక్‌జోన్: రెండునెలలుగా జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ ఆర్టీసీ కార్మికుడు బుధవారం సాయంత్రం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. బాన్సువాడకు చెందిన మైసయ్య 15 ఏళ్లుగా మెదక్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో జీతం రాక పిల్లల స్కూల్‌ఫీజులు చెల్లించకపోవడం, ఇంటి అద్దెసైతం కట్టలేకపోవటంతో ఆందోళనకు గురైన మైసయ్య బుధవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన మైసయ్య భార్య ఇరుగు పొరుగు వారి సహాయంతో భర్తను మెదక్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. పరిస్థితి విషమించటంతో మైసయ్యను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. మెదక్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేం రాజీనామా చేస్తాం.. ఆర్టీసీని అలాగే ఉంచండి

ప్రభుత్వాన్ని కోరిన కార్మిక నేత థామస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

కార్మిక నేతలపై కోపాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అమాయక కార్మికులపై చూపడం సరికాదని పేర్కొంటున్న జేఏసీ నేతలు కీలక ప్రకటన చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. తాము రాజీనామాలు చేసి తప్పుకుంటామని, అప్పుడు ఆర్టీసీని ఉన్నది ఉన్నట్లుగా నిర్వహించాలని పేర్కొననున్నట్లు తెలిసింది. దీనిపై బుధవారం జరిగిన సమావేశంలో చర్చించినట్లు సమాచారం. 'చాలా సందర్భాల్లో ముఖ్యమంత్రి కార్మిక సంఘాల నేతలు సమస్యలు సృష్టిస్తున్నారని మాట్లాడారు. ఆయనకు మాపై అంత కోపం ఉంది. దాన్ని అమాయక కార్మికులపై చూపి వారిని విధుల్లోకి తీసుకోకుండా ఆవేదనకు గురి చేయడం సరికాదు. నేను రాజీనామా చేసి తప్పుకునేందుకు సిద్ధం. మిగతా మా జేఏసీ నేతలు కూడా సిద్ధంగా ఉన్నారు. ఆర్టీసీని పాత పద్ధతిలోనే కొనసాగించేందుకు ప్రభుత్వం సిద్ధం కావాలి. గురువారం కేబినెట్ భేటీలో దీనిపై నిర్ణయం తీసుకోవాలి' అని జేఏసీ కో–కన్వీనర్ థామస్‌రెడ్డి అన్నారు.

కార్మిక శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

సమ్మె విరమించినా విధుల్లోకి తీసుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదనతో ఉన్నందున వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల జేఏసీ మరోసారి ప్రభుత్వాన్ని కోరింది. సమ్మె విరమించినా విధుల్లోకి తీసుకోకపోవడం చట్ట ప్రకారం సరైన చర్య కాదన్న విషయాన్ని గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి తెలుసుకోవాలని సూచించింది. ఈ మేరకు కార్మిక శాఖ కమిషనర్‌కు జేఏసీ ఫిర్యాదు చేసింది. మరోవైపు అదే ఫిర్యాదు కాపీలను గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాల్లో అందజేయాలని జేఏసీ నేతలు సూచించారు. ఆ కార్యాలయాలు లేని ప్రాంతాల్లో సేవ్ ఆర్టీసీ పేరుతో ప్రధాన కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని పేర్కొన్నారు.

కేంద్రం అలా అనొద్దు...

ఆర్టీసీలో 33 శాతం కేంద్రం వాటా ఉన్నప్పుడు, ఆర్టీసీ నష్టాలతో తమకు సంబంధం లేదని కేంద్రం అనడం భావ్యం కాదని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. 50 వేల కోట్ల అప్పు ఉన్న ఎయిర్ ఇండియా, రూ.90 వేల కోట్ల అప్పుల్లో ఉన్న బీఎస్ఎన్ఎల్‌కు పునరుజ్జీవన ప్యాకేజీ ఇచ్చినప్పుడు 33 శాతం వాటా ఉన్న ఆర్టీసీకి కనీసం రూ.వేయి కోట్లన్నా ఇవ్వాలని కోరారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా నిధులు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మీరు తీయడం కాదు.. నేనే రాజీనామా చేస్తున్నా

- డిపో వద్దకు కూడా రానివ్వడం లేదు
- చుట్టూ బారికేడ్లు.., వెళితే కేసులు పెడుతున్నారు
- అందుకే ఆవేదనతో నేనే రాజీనామా చేస్తున్నా
- సీఎం కేసీఆర్‌కు సూర్యాపేట డిపో కండక్టర్ లేఖ

సాక్షిప్రతినిధి, సూర్యాపేట: 'ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మీ వైఖరితో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాను. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చేయలేను. మమ్మల్ని డిపో వద్దకు కూడా రానివ్వడం లేదు. బస్టాండ్, డిపో చుట్టూ బారికేడ్లు పెట్టారు. లోపలికి వెళ్తే మాపై కేసులు పెడుతున్నారు. దీంతో ఆవేదన చెందా. మీరు ఉద్యోగం నుంచి తీయడం కాదు.. నేనే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నా'అని సోషల్ మీడియా వేదికగా సూర్యాపేట డిపోకు చెందిన కండక్టర్ లునావత్ కృష్ణానాయక్ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశాడు. కృష్ణానాయక్‌ది సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం సూర్యానాయక్ తండా. ఇతను సోషల్ మీడియాలో పోస్టు చేసిన లేఖ బుధవారం వైరల్ అయింది. కృష్ణానాయక్ 2009 నుంచి కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. తమ సమ్మెతో ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరిస్తుందని అనుకున్నాడు. అయితే సమ్మె విరమించినా కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడంతో మానసిక ఆందోళనకు గురై సీఎం కేసీఆర్‌కు సోషల్ మీడియాలో లేఖ పోస్టు చేశాడు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఇటు కార్మికులు, అటు రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చసాగింది. సీఎం కేసీఆర్‌కు రాసిన ఆ లేఖలో.. 'తెలంగాణ రాష్ట్రంలో గౌరవంతో ఉద్యోగం చేద్దామనుకున్నా.. ఆత్మగౌరవంతో బతుకుదాం అనుకున్నా. కానీ మీలాంటి గొప్ప మనిషి ఉన్న ఈ రాష్ట్రంలో ఎందుకు పుట్టాను అనే మానసిక వేదనకు గురై ఈ నిర్ణయం తీసుకున్నా'అని ప్రారంభించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర ఇబ్బందులను అందులో ప్రస్తావించాడు. 'ఆర్టీసీ కార్మికులు ఏం తప్పు చేశారని.. మహిళలని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించడం, అరెస్టులు చేయడం ఏంటి'అని ప్రశ్నించాడు. '1,200 మంది తెలంగాణ అమరులు ప్రాణత్యాగాలు చేసింది ఇందుకా? 20 మంది ఆర్టీసీ కార్మికులు ప్రాణాలు కోల్పోయినా చలించకపోవడం సీఎం మోసకారి తీరుకు నిదర్శనం'అని ఆ లేఖలో పేర్కొన్నాడు.

మీ మాయమాటలు కార్మిక లోకం తెలుసుకుంది..

'మాట తప్పడం, మాయమాటలు చెప్పి మోసం చేయడం సీఎంకు తెలుసునని కార్మిక లోకం లేట్‌గా తెలుసుకుంది.. మీరు ఉద్యోగంలోంచి తీసేయడం కాదు.. నేనే నా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నాను'అని లేఖలో కృష్ణానాయక్ పేర్కొన్నాడు. ఒక్కటి మాత్రం నిజమని, ఆర్టీసీ అక్కాచెల్లెళ్ల ఉసురు కచ్చితంగా తగులుతుందని, ఒక మోసకారి, ఒక మాటకారి, ఒక మానవత్వం లేని, ఒక నిరంకుశ ప్రభుత్వంలో నా ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగిగా పనిచేయలేనన్నాడు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నానని, సంస్థ నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని లేఖలో కోరాడు. తన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో సంతోషంగా ఉండేందుకు నెల నెలా పింఛన్ ఇవ్వాలన్నాడు. తన పేరుమీద సెంటు భూమి లేదని, మూడు ఎకరాల పొలం, అలాగే తన పిల్లలకి ప్రభుత్వ పాఠశాలలో చదువు, ఉండడానికి డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలన్నాడు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని కోరాడు.

సోషల్ మీడియాలో పోస్టు చేసింది నిజమే..

'సాక్షి'తో కృష్ణానాయక్

నేను రాజీనామా లేఖను సోషల్ మీడియాలోనే పోస్ట్ చేశాను. మమ్మల్ని డిపో వద్దకు రానివ్వడం లేదు. ఏళ్లుగా కష్టపడి పనిచేసిన సంస్థలోకి రానివ్వకపోతే.. ఇంత నిరంకుశత్వమా అని ఆవేదనకు గురయ్యా. చుట్టూ బారికేడ్లు, డిపోకు వెళితే కేసులు పెడుతున్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. సోషల్ మీడియాతో అందరికీ తెలవాలని సీఎంకు లేఖ రాశా. మేనేజర్ కలిస్తే రాజీనామా కచ్చితంగా ఇస్తా.. వెనక్కు పోను.

ఇదండీ జగత్



ఈ రోజు డిప్యూటీ సీఎంగా పదవిని చేపట్టి తనే ఎత్తేసుకుంటాడట సార్!!

epaper.sakshi.com

జబ్బుల మాటున ఇన్ఫెక్షన్లు!

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కువ జబ్బులు ఇన్ఫెక్షన్ల ద్వారానే వస్తున్నాయని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) వెల్లడించింది. గతేడాది జూన్ వరకు నిర్వహించిన సర్వే వివరాలను ఎన్ఎస్ఓ అధికారికంగా తాజాగా ప్రకటించింది. ఈ సర్వే ప్రకారం దేశంలో ఎక్కువ జబ్బులు ఇన్ఫెక్షన్ల ద్వారానే వస్తున్నాయని తేలింది. ఇన్పేషెంట్లుగా ఆసుపత్రుల్లో చేరుతున్న వారిలో 31.4 శాతం మంది ఇన్ఫెక్షన్ సంబంధిత రోగాలతోనే వస్తున్నారని వెల్లడైంది. ఇన్ఫెక్షన్ల తర్వాత ఎక్కువ మంది గాయాలతో వస్తున్నారని, ఆ తర్వాతి స్థానాల్లో పేగు, గుండె సంబంధిత రోగులు ఉన్నారని సర్వే వెల్లడించింది. అయితే ఇన్ఫెక్షన్ల బారినపడుతున్న వారిలో పురుషులకన్నా మహిళలే ఎక్కువని సర్వే తేల్చింది. సర్వే గణాంకాలను పరిశీలిస్తే పట్టణ ప్రాంతాల్లో 31.4 మంది మగవారు, 31.8 శాతం మంది మహిళలు ఇన్ఫెక్షన్ సంబంధిత జబ్బులతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 31.3 శాతం మంది పురుషులు, 31.4% మంది మహిళలు ఇన్ఫెక్షన్ జబ్బులకు గురవుతున్నారని తేలింది.

కేన్సర్‌కే అత్యధిక ఖర్చు...

ఖర్చుల విషయానికి వస్తే అన్నింటికన్నా కేన్సర్ చికిత్స కోసం ఎక్కువ ఖర్చవుతోందని సర్వే వెల్లడించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన రోగులు ఇచ్చిన సమాచారం ప్రకారం సగటున ప్రతి కేన్సర్ రోగికి కనీసం రూ. 61,216 ఖర్చవుతోందని సర్వే తేల్చింది. ఆ తర్వాత గుండె జబ్బులకు ఎక్కువ ఖర్చవుతుండగా రోగాల సంఖ్యలో ఎక్కువగా ఉన్న ఇన్ఫెక్షన్ సంబంధిత వ్యాధులకు అతితక్కువ ఖర్చుతో వైద్యం అందుతోందని వెల్లడించింది.

దేశంలో ఎక్కువగా ఇన్ఫెక్షన్ల ద్వారానే రోగాలు

- ఆ తర్వాతి స్థానం గాయాలదే.... గుండె జబ్బులు 9 శాతమే
- గుండె జబ్బులకన్నా పేగు సంబంధిత రోగాలే అధికం
- సగటున ఒక్కో ఇన్ఫెక్షన్ చికిత్సకు రూ. 9 వేల ఖర్చు
- కేన్సర్ వైద్యానికి కనీసం రూ. 61 వేల పైనే.. గుండె జబ్బులకు రూ. 36 వేలు
- నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ సర్వేలో వెల్లడి



ఎన్ఎస్ఓ అధ్యయనంలో వెల్లడైన గణాంకాలు (శాతాల్లో)

రోగ కారణం	పురుషులు	మహిళలు	సగటు
ఇన్ఫెక్షన్లు	31.3	31.6	31.4
గాయాలు	15.3	6.8	11.2
పేగు సంబంధిత వ్యాధులు	8.7	11.2	9.9
గుండె సంబంధిత	10.1	8.1	9.1
మూత్ర సంబంధిత	5.4	6.5	5.9
మానసిక, నరాల సంబంధిత	6.3	5.1	5.7
ఎముకల సంబంధిత	4.0	4.8	4.4
శ్వాస సంబంధిత	4.5	3.9	4.2
కంటి జబ్బులు	3.2	4.0	3.6
ఉదర సంబంధిత	0.7	0.4	3.5
ఇతర రోగాలు	10.5	11.6	11.1

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగటున ఖర్చు (రూ.లలో)

జబ్బు	ప్రభుత్వ ఆసుపత్రుల్లో	ప్రైవేటు ఆసుపత్రుల్లో	నగటున ఖర్చు (రూ.లలో)
కేన్సర్	22,520	93,305	61,216
మానసిక వ్యాధులు	7,235	41,239	26,843
గుండె జబ్బులు	6,635	54,970	36,001
ఎముక సంబంధిత	5,716	46,365	32,066
మూత్ర సంబంధిత	5,345	33,409	24,770
పేగు సంబంధిత	3,847	29,870	19,821
శ్వాస సంబంధిత	3,346	24,049	13,905
కంటి జబ్బులు	2,605	18,767	10,912
ఇన్ఫెక్షన్లు	2,054	15,208	9,064

మిలీనియల్స్ టాప్

ఆన్‌లైన్ వ్యవహారాల్లో వారిదే హవా..

- నమ్మకమైన సైట్లలో బ్యాంకు వివరాలు భద్రపరిచేందుకూ సై
- వ్యక్తిగత సమాచారం పంచుకోవడమూ ఓకే
- 'నార్టన్' డిజిటల్ వెల్‌నెస్ సర్వే వెల్లడి

ఆన్‌లైన్ మోసాల గురించి మనం తరచూ వింటుంటాం. అయినా సరే.. షాపింగ్ యాప్ లేదా వెబ్‌సైట్ తెరిచి కొనుగోళ్లు మాత్రం ఆపం. బిల్లులు కట్టేందుకూ, బ్యాంకు లావాదేవీలు నడిపేందుకు అస్సలు వెనుకాడం. ఇంటిపట్టున ఉంటూ పనులన్నీ చక్కబెట్టే వెసులుబాటు, సౌకర్యం ఉండటం, సమయం ఆదా అవుతోందన్నది దీనికి కారణం. ఇలాంటి లాభాలన్నీ ఉన్నాయని ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ఖాతాల్లో డబ్బులు ఖాళీ అయిపోవచ్చు. మీకు సంబంధించిన సున్నితమైన సమాచారం ఇతరులకు చేరనూ వచ్చు. ఇంతకీ దేశంలో పురుషులు, మహిళలు, ఈతరం, వెనుకటి తరం ఆ ముందు తరాల ఆన్‌లైన్ షాపింగ్, బ్యాంకింగ్ వ్యవహారాల తీరుతెన్నులెలా ఉన్నాయి? ఇంటర్నెట్ భద్రత సంస్థ ఈ విషయాన్ని కనుక్కునేందుకు డిజిటల్ వెల్‌నెస్ సర్వే ఒకటి నిర్వహించింది. 'ఆన్‌లైన్' మిలీనియల్స్ (25- 34 మధ్య వయస్కులు) టాప్‌లో ఉన్నారు.

83 శాతం ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో ఆర్థిక మోసాలు, సమాచార చోరీ అన్నవి రెండు పెద్ద ప్రమాదాలని తెలిసిన వారు



ఆన్‌లైన్ వ్యవహారంతో లాభాలేమిటి?



షాపింగ్, బ్యాంకింగ్ సేవల వినియోగంలో రెండో తరగతి నగరాల వాటానే ఎక్కువ





భద్రత విషయంలో మహిళలు, జనరేషన్ ఎక్స్ బిందాస్



ఇవీ జాగ్రత్తలు...

- వేర్వేరు వెబ్‌సైట్లకు వేర్వేరు పాస్‌వర్డ్‌లు వాడటం మేలు. అంకెలు, గుర్తులు, అక్షరాలు కలిసి పాస్‌పర్డ్ ఉండాలి.
- సైబర్ నేరగాళ్లు ఎక్కువగా దృష్టి పెట్టేది సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లోపాలపైనే. కాబట్టి సాఫ్ట్‌వేర్ లోపాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలి.
- షాపింగ్ వెబ్‌సైట్ 'హెచ్‌టీటీపీఎస్'తో మొదలవుతోందా? లేదా చూసుకోండి. బ్రౌజర్ బార్‌లో ఒకవైపు తాళం కప్ప వేసిన గుర్తు అది కూడా పచ్చ రంగులో ఉంటే ఆయా వెబ్‌సైట్ల సమాచారం ఎన్‌క్రిప్షన్ (రహస్య సంకేతాలతో కూడిన భాష)ను ఉపయోగిస్తుందని అర్థం. ఇలాంటి వెబ్‌సైట్లలోకి చొరబడటం హ్యాకర్లకు కష్టం.
- గుర్తుతెలియని వ్యక్తులు/కంపెనీల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకపోవడం మంచిది. ఇలాంటివి మిమ్మల్ని ఏదో ఒక వెబ్‌సైట్‌కు తీసుకెళ్లి వ్యక్తిగత వివరాలు రాబట్టుకునే చాన్స్ ఉంది.
- ఫేక్ వెబ్‌సైట్ల విషయంలో జాగ్రత్తగా ఉండండి. వెబ్‌సైట్ యూఆర్ఎల్‌లో చిన్న చిన్న మార్పులు చేయడం ద్వారా ఫేక్ వెబ్‌సైట్లను సృష్టిస్తుంటారు హ్యాకర్లు. ఇంటర్నెట్ సెక్యూరిటీ కోసం పూర్తిస్థాయి సూట్‌ను వాడటం మేలు. ఇందుకు వెచ్చించే మొత్తం మీకు మాల్‌వేర్, ర్యాన్‌సమ్ వేర్, వైరస్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.

సర్వే నిర్వహణ ఇలా... దేశం మొత్తమ్మీద సుమారు 1,572 మందిని నార్టన్ లైఫ్‌లాక్ సంస్థ సర్వే చేసింది. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్‌ను ఉపయోగించే వారు, 18 ఏళ్లకంటే ఎక్కువ వయసున్న వారిని ఎంపిక చేసుకున్నారు. ఈ ఏడాది జూలై 8 - 16 తేదీల్లో జరిగిన ఈ సర్వేలో విద్యార్హతలు, ఆదాయం అంశాల ఆధారంగా విభజించిన ఇళ్లలోని వ్యక్తులను ప్రశ్నించారు.

రవాణాకు అడ్డంకులు

ప్రభుత్వానికి ఎరువుల కంపెనీల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: గంగవరం, విశాఖ పోర్టుల నుంచి ఎరువుల రవాణాకు రేక్‌లు అందుబాటులో ఉండటం లేదని ఎరువుల కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో పోర్టుల నుంచి తెలంగాణకు యూరియా సహా ఇతరత్రా ఎరువుల సరఫరాకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి బుధవారం కంపెనీల ప్రతినిధులు, మార్క్‌ఫెడ్ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు తమ సమస్యలను ప్రస్తావించారు. గత ఖరీఫ్‌లో ఇలాగే రేక్ పాయింట్ల వద్ద సమస్యల కారణంగా యూరియా రవాణా ఆలస్యమైందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. రబీకి ఎరువుల కొరత రానీయకుండా పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని, దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. వచ్చే నెల 20లోపు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరి యా బఫర్ స్టాక్‌గా ఏర్పాటు చేసుకోవాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతాంగానికి సరిపడా యూరియా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎండీ భాస్కరాచారి, జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

ఫాస్టగా 'ఫాస్టాగ్'..

- రాష్ట్రవ్యాప్తంగా వారంలో 7 వేల ట్యాగ్‌ల అమ్మకం
- అధికంగా టోల్‌ప్లాజాల్లోనే కొన్న వాహనదారులు

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులపై టోల్‌గేట్ల వద్ద నగదు రహిత చెల్లింపుల్లో భాగంగా ఏర్పాటవుతున్న ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు వ్యవస్థపై వాహనదారుల్లో అవగాహన వేగంగా పెరుగుతోంది. డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ వ్యవస్థలో భాగంగా వాహనాల ముందు అద్దానికి అమర్చే ఫాస్టాగ్‌ల విక్రయం ఒక్కసారిగా జోరందుకుంది. సరిగ్గా వారం రోజుల క్రితం తెలంగాణలో కేవలం 3,500 ట్యాగ్‌లు మాత్రమే అమ్మకం కాగా, ప్రస్తుతం వాటి సంఖ్య పదిన్నర వేలకు చేరుకుంది. దేశవ్యాప్తంగా ఈ వారం రోజుల్లోనే ఎక్కువ ట్యాగ్‌లు అమ్ముడుపోవటంతో చాలా ప్రాంతాల్లో వాటికి కొరత ఏర్పడింది. కొన్ని చోట్ల ట్యాగ్‌లు అందుబాటులో లేవన్న సమాధానం వస్తుండటంతో వాహనదారులు బ్యాంకులు, టోల్‌ప్లాజాల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణలో కూడా ఈ వారం రోజుల్లోనే ఏకంగా 7 వేల ట్యాగ్‌లు అమ్ముడు కావటంతో ఇక్కడా కొరత ఏర్పడే పరిస్థితి వచ్చేది. కానీ, నేషనల్ హైవే అథారిటీ ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ ఒకేసారి పెద్ద మొత్తంలో ట్యాగ్‌లకు ఇండెంట్ పెట్టి తెప్పించారు. వాటి అమ్మకాలు పెరిగే సమయంలో అదనంగా 15 వేల ట్యాగ్‌లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రాష్ట్రంలో వాటికి కొరత లేకుండా పోయింది. ప్రస్తుతం జాతీయ రహదారులపై 17 ప్రాంతాల్లో ఉన్న టోల్‌ప్లాజాల్లో ప్రతిచోటా.. ఒక్కోవైపు 5 చొప్పున 10 కౌంటర్లు ఏర్పాటుచేసి అమ్ముతున్నారు. బ్యాంకుల్లో నేరుగా విక్రయం, ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకోవటంతో పోలిస్తే.. టోల్‌ప్లాజాల్లోనే ఎక్కువగా అమ్మకం అవుతున్నాయి. అన్ని టోల్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ టోల్ వసూలుకు సంబంధించిన యంత్రపరికరాల ఏర్పాటు దాదాపు పూర్తయింది. నాలుగు టోల్ కేంద్రాల్లో పనులు తుదిదశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

పొగమంచు కురిస్తే ఇబ్బందేనా..?

చలికాలంలో ఉదయం సాయంత్రం వేళ పొగమంచు కురుస్తుంటుంది. దాని తీవ్రత ఎక్కువగా ఉంటే ఫాస్టాగ్‌ల నుంచి టోల్ మినహాయింపు ప్రక్రియ మందగించే పరిస్థితి ఉండనుంది. దీనికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ అధికారులకు కొన్ని ఫిర్యాదులు అందాయి. పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, సెన్సార్లకు అడ్డుగా వచ్చి ట్యాగ్‌ను వేగంగా రీడ్ చేయలేదని తెలుస్తోంది. దీనివల్ల రుసుమును మినహాయించుకోవటంలో జాప్యం జరిగే పరిస్థితి ఉంటుందని సమాచారం. అయితే రాష్ట్రంలో ఆ సమస్య ఉత్పన్నం కాదని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ పేర్కొంటున్నారు. ఉత్తర భారతదేశంలో పొగమంచు దట్టంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో సమస్య ఉత్పన్న మయ్యేందుకు అవకాశం ఉండొచ్చన్నారు.

'సగమే వసూలు'నిబంధనకు తూట్లు..

వాహనం టోల్‌ప్లాజా దాటేప్పుడు తిరుగు ప్రయాణానికి కూడా ఒకేసారి టోల్ చెల్లించే వారుంటారు. వాహనం 24 గంటలలోపు తిరిగొస్తే, రెండోసారి సగం రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధనపై అవగాహన లేక టోకెన్ పద్ధతి చెల్లింపు విధానంలో.. మొత్తం రుసుము చెల్లిస్తున్నారు. అవగాహన ఉన్నవారు ప్రశ్నించి మరీ సగమే చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఫాస్టాగ్ విధానం పూర్తిగా ఆటోమేటిక్ చెల్లింపు వ్యవస్థే అయినందున ఆ సమస్య ఉత్పన్నం కాకూడదు. అయితే కొన్ని సంస్థలు, బ్యాంకులిచ్చే ట్యాగ్‌ల్లో లోపాల వల్ల పూర్తి మొత్తం కట్ అవుతోందంటూ లారీ యజమానుల సంఘం ఫిర్యాదు చేసింది. అలాంటి పరిస్థితి లేకుండా చూస్తామని, ఎక్కడైనా లోపం జరిగితే ఆ మొత్తాన్ని వాహనదారుడికి తిరిగి చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. నెల రోజులుగా ప్రయోగాత్మకంగా కొన్ని లేన్లకే ఇది పరిమితమై ఉన్నందున, పూర్తిస్థాయి వ్యవస్థ ఏర్పాటైతే ఇలాంటి లోపాలపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఫోన్ పట్టు.. పాఠం నేర్పు!

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులు, ట్యూటర్‌లను అడగలేక పోతున్నారు. సందేహాలు అడిగితే ఉపా ధ్యాయులు, తోటి విద్యార్థులు ఏమను కుంటారోనన్న ఆలోచనతో అనేకమంది విద్యార్థులు తమ సందేహాలను అడగ కుండా చదువులో వెనుకబడి పోతున్నారు. అయితే టెలీ టీచర్స్ ద్వారా తమకు వచ్చిన సందేహాలను ఫోన్ ద్వారా అడగొచ్చు కాబట్టి విద్యా ర్థులకు భయం ఉండదనే ఆలోచనతో రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రిటైర్డ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు ఖాళీ సమయాల్లో బోధించే ఆసక్తి ఉన్నవారి ద్వారా ఈ టెలీ ట్యూషన్లు నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తోంది. టెలీ టీచర్స్ పద్ధతి ప్రస్తుతం మహారాష్ట్రలో అమల్లో ఉంది.

ప్రత్యేక సమయం..

ఈ టెలీ ట్యూషన్‌కు సాయంత్రం ప్రత్యేకంగా సమయం కేటాయించడం ద్వారా అటు ట్యూటర్ (టెలీటీచర్స్)కు, ఇటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. దీంతో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పాఠశాల విద్యార్థులకు సబ్జెక్ట్‌లకు సంబంధించిన టెలీ ట్యూటర్ ఫోన్ నంబర్‌ను ఇవ్వడం ద్వారా విద్యార్థులు వారికి కేటాయించిన సమయంలో ఫోన్ ద్వారా సందేహాలు నివృత్తి చేసుకునే వీలు కలుగుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. టెలీటీచర్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు అధికంగా లబ్ధి చేకూరుతుంది.

ఉత్తమ ఫలితాలకు దోహదం: జనార్దన్‌రెడ్డి

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు త్వరలోనే టెలీ ట్యూషన్ అందుబాటులోకి తెస్తాం. ఇందుకోసం కసరత్తు చేస్తున్నాం. భయపడే, మొహమాటపడే విద్యార్థులు పరోక్షంగా తమ పాఠ్యాంశంలోని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. వెనుకబడిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

జాతీయ స్థాయి 'ఛాయ్ ఆఫర్ లేఖ' పోటీలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఛాయ్ ఆఫర్ లేఖ ప్రచారం పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 'ప్రియమైన బాపూ మీరు అమరులు'అనే అంశంపై ఈ లేఖల పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునే వారు ఇంగ్లిష్, హిందీ లేదా ఏదైనా స్థానిక భాషలో తమ చేతిరాతతో రాసి ఆ లేఖలను చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాల్సి ఉంటుందన్నారు. దీనికి వారి పేరు, పుట్టిన తేదీ, పూర్తి వయసు వివరాలు, మొబైల్ నెంబర్, పిన్‌కోడ్‌తో సహా చిరునామాను కూడా జత చేయాల్సి ఉంటుంది. అలాగే ఈ లేఖలను డిసెంబర్ 31 లోపు పంపాలని, ఆ తర్వాత వచ్చిన లేఖలను ఆమోదించరని పేర్కొన్నారు. లేఖను ఏ-4 సైజు కాగితంపైనే రాయాలని, 1,000 పదాలకు మించి ఉండకూడదన్నారు. ఇన్ లాండ్ కార్డ్స్ (ఐఎల్‌సీ) అయితే 500 పదాలకు మించరాదని తెలిపారు. అభ్యర్థులు వారి లేఖలను పోస్ట్ ఆఫీస్ కార్యాలయాల్లో 'లేఖ రచన క్యాంపెయిన్'అని ప్రత్యేకంగా రాసి ఉన్న బాక్సుల్లోనే పోస్ట్ చేయాలని, జిల్లా ప్రధాన కార్యాలయాలు, పెద్ద నగరాలు, గ్రామీణ ప్రాంతాల వారు అయితే లేఖలను బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల్లో పోస్ట్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈ పోటీలో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చని, పోటీలో వచ్చిన మూడు ఉత్తమ లేఖలను ఎంపిక చేసి బహుమతి ప్రదానం చేస్తారని వెల్లడించారు.

8న బీసీ లిటరరీ ఫెస్టివల్

నాంపల్లి: బీసీ రైటర్స్ వింగ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8న బీసీ లిటరరీ ఫెస్టివల్-2019ని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. తెలుగు సాహిత్యంలో బీసీ కులాలు ముఖ్య పాత్రను పోషించాయన్నారు. బుధవారం రాష్ట్ర సమాచార భవన్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో బీసీ లిటరరీ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

కృత్రిమ మేధపై మార్గదర్శనం చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

ట్రాన్స్‌ఫర్మేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఇక్టయ్) ఏర్పాటు చేయాలని నీతిఆయోగ్ నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో కోర్, ఇక్టయ్ ఏర్పాటుకు సంబంధించి మార్గ దర్శకాల కోసం తెలంగాణ ప్రభుత్వంతో నీతి ఆయోగ్ పలుసార్లు సంప్రదింపులు జరిపింది. ఏఐ సాంకేతికతకు సంబంధించి పరిశోధన, అభివృద్ధి రంగాలకు హైదరాబాద్ చిరునామాగా మారుతున్న నేపథ్యం లో ఏఐ రీసెర్చ్ సెంటర్ల మార్గదర్శకాలు ఖరారు చేసే బాధ్యతను తెలంగాణకు అప్పగించింది. ఏఐ రీసెర్చ్ సెంటర్లు ఏ తరహాలో ఉండాలి.. వాటిలో ఏ రకమైన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు జరగా లనే అంశంపై మార్గదర్శకాలు రూపొందించి నీతి ఆయోగ్‌కు సమర్పిస్తామని ఐటీ శాఖ వర్గాలు వెల్లడించాయి.

ఏఐ పరిశోధనలో కోర్, ఇక్టయ్ కీలకం

దేశంలో ప్రస్తుతం ఏఐ సాంకేతికత తీరుతెన్నులను అర్థం చేసుకుని, మరింత పురోగతి సాధించడం లక్ష్యంగా కోర్ సెంటర్లలో పరిశోధన జరుగుతుంది. కోర్ పరిశోధనలో సాధించే ఫలితాల ఆధారంగా ప్రైవేటు రంగం సహకారంతో నూతన ఏఐ అప్లికేషన్ల రూపకల్పనపై ఇక్టయ్‌లు పని చేస్తాయి. కోర్, ఇక్టయ్‌లలో ఏ రకమైన పరి శోధనలు జరగాలనే కోణంలో తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించి నీతి ఆయోగ్‌కు అందిస్తుంది. దేశంలో ఏఐ సాంకేతికతకు రూపునిచ్చేందుకు ఐరావత్ ప్లాట్‌ఫారం రూపకల్పన, పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు రూ.7,500 కోట్లు కేటాయించాలని కేంద్రానికి నీతి ఆయోగ్ ప్రతిపాదనలు సమర్పించింది. మూడేళ్ల పాటు ఈ నిధులను దశలవారీగా విడుదల చేసేం దుకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. 2035 నాటికి భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో ఏఐ వాటా సుమారు రూ.69 లక్షల కోట్లు ఉంటుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది. ఏఐ పరి శోధన, వినియోగంలో అగ్రస్థానంలో ఉన్న చైనా మాత్రం వచ్చే రెండు మూడేళ్లలోనే సుమారు రూ.10 లక్షల కోట్లకు ఏఐ వాటాను చేర్చాలని ప్రయత్నిస్తోంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఇటీవల విరివిగా వినియోగంలోకి వస్తున్న కొత్త సాంకేతికత పేరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.

ఏఐ అంటే..

భవిష్యత్తులో ఏఐ వినియోగం పెరుగుతుందని చెబుతున్న ఐటీ నిపుణులు.. ఇప్పటికే మన నిత్య జీవితంలో ఏఐ వినియోగం ప్రారంభమైందని చెబుతున్నారు. మనుషుల తరహాలో యంత్రాలు ఆలోచించి, సొంతంగా నిర్ణయాలు తీసుకుని, ఆచరించడమే కృత్రిమ మేధస్సు (ఏఐ)గా పేర్కొంటున్నారు. మనుషుల గొంతులు, ముఖాలను కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు గుర్తు పట్టడం, మనం వాటికి ఇచ్చే సవాళ్లను పరిష్కరించడం, ఏదైనా పనిని అప్పగిస్తే ఏఐ సాంకేతికత పూర్తి చేస్తుందన్న మాట.

కృత్రిమ మేధో సంవత్సరంగా 2020

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతల పరిశోధన, అభివృద్ధి రంగాలకు తెలంగాణ చిరునామాగా మారు తోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి కొత్త సాంకే తికతలపై జరిగే పరిశోధన, అభివృద్ధి రంగా ల్లో రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ప్రముఖ ఐటీ కంపెనీలు రాష్ట్రానికి తరలి వస్తున్నా యి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏఐ సాంకేతి కత వినియోగంలో తెలంగాణ ముందం జలో ఉంది. వ్యవసాయం, పట్టణీకరణ, రవాణా, ఆరోగ్య రంగాల్లో కీలక సవాళ్ల పరిష్కారానికి ఏఐ ఐటీ సాంకేతికతను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారంగా భావిస్తోంది. ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2020ని 'ఇయర్ ఆఫ్ ఏఐ'(కృత్రిమ మేధో సంవత్సరం)గా ప్రకటించింది.

epaper.sakshi.com

కార్మికులకు అండగా కాంగ్రెస్: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. ఆర్టీసీ సమ్మెకు సంబంధించి రెండ్రోజుల్లో ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వస్తుందని ఆశి స్తున్నామన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను తీర్చేది, ఆయా ప్రభుత్వ సంస్థల్లోని సంఘాలను ఆదుకునేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రిని ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలో కలసి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరినట్టు చెప్పారు. కుసుమ కుమార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సమస్యపై కాంగ్రెస్ ముఖ్య నాయకులకు జగ్గారెడ్డి రాసిన లేఖపై పార్టీలో చర్చ జరిగినట్టు తెలిపారు. ఆర్టీసీ బలోపేతంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

కలిసేందుకు సమయమివ్వండి

సీఎంకు లెఫ్ట్ నేతల లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కుటుంబాల పరిస్థితి, ఆ సంస్థ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై స్వయంగా కలిసి వివరించేందుకు సమయమివ్వాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో చాడ వెంకట్‌రెడ్డి (సీపీఐ), తమ్మినేని వీరభద్రం (సీపీఎం), సాదినేని వెంకటేశ్వరరావు, పోటు రంగారావు (న్యూడెమోక్రసీ రెండు (గ్రూపులు) కోరారు. ఈ అంశంపై వెంటనే అఖిలపక్ష భేటీని నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. గత 52 రోజులుగా తమ డిమాండ్ల సాధనకు, ప్రజా రవాణా వ్యవస్థ పరిరక్షణ కోసం సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో..

సాక్షి, హైదరాబాద్: ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ ఐదెకరాల స్థలం కేటాయించిన సందర్భంగా బుధవారం వాసవీ సేవా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ ఏర్పాటుచేశారు. మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నిజామాబాద్ (అర్బన్) ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గణేష్‌గుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల పట్ల ముఖ్యమంత్రికి గౌరవం ఉందని, ఏ ప్రభుత్వా లు ఇప్పటివరకు ఆర్యవైశ్యులను పట్టించుకోలేదని అన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ఆర్యవైశ్యులకు ఐదెకరాల స్థలం కేటాయించారని, రాజకీయంగా పదవులు కల్పిస్తూ సహకరిస్తున్నారని కొనియాడారు.

8న 'తెలంగాణ లంబాడీ సభ'

మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గిరిజనులను చైతన్యవంతులను చేసేందుకు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు లంబాడీ తడాఖా రథయాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ వెల్లడించారు. రథయాత్ర పాత 10 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో కొనసాగుతుందని తెలిపారు. డిసెంబర్ 8న లక్షలాదిమంది లంబాడీలతో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో 'తెలంగాణ లంబాడీ మహా సంగ్రామ సభ'ని ర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రథయాత్రను మాజీ ఎంపీ రవీందర్ నాయక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన రిజర్వేషన్ల విషయం పక్కనపెట్టి, లంబాడీ, గోండ్ల మధ్య చిచ్చుపెట్టి రెచ్చగొడుతున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

గవర్నర్ ఆర్టీసీ కార్మికులను అధైర్యపడొద్దన్నారు: ఇందిరా శోభన్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించినట్లు, కార్మికులకు అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడవద్దని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పినట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ అన్నారు. ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఆమె తెలిపారన్నారు. బుధవారం రాజ్‌భవన్‌లో ఇందిరా శోభన్ ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నాయకుల భేటీ సందర్భంగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ పరిణామాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అంశాన్ని కూలంకషంగా గవర్నర్‌కు వివరించగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఇందిరా చెప్పారు.

'వీసీల కోసం 4న ఓయూలో నిరశన'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని కోరుతూ డిసెంబర్ 4న 24 గంటల నిరాహార దీక్షను చేపట్టనున్నట్లు విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ 4 నెలల నుంచి యూనివర్సిటీల్లో వీసీలను నియమించకుండా జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వీసీలు లేనందున యూనివర్సిటీల పాలన అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

పత్రికా ప్రకటన

Rc.No.Acad/III-/Trgs/COE/2511/2019 తేది : 27-11-2019

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న (17) ప్రతిభా కళాశాలల యందు (COE) 2020-2021 విద్యా సం॥నకు గాను ఇంటర్ ప్రథమ సం॥ నందు, MPC, BiPC, MEC & CEC అడ్మిషన్ల కొరకు March 2020 సం॥లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న తెలంగాణ రాష్ట్ర SC, ST, BC, HC, Converted Christian మరియు OC, బాల, బాలికల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి. బోధన ఆంగ్ల మాధ్యమున ఉండును. ఈ ప్రతిభా (COE) కళాశాలలో ప్రవేశం పొందినవారు ఇంటర్‌తో IIT, NIT, NEET, CLAT, CMA పాటు మొదలగు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు చక్కని సదుపాయములు కల్పించబడును. అర్హులైన అభ్యర్థులు http://tswreis.in వెబ్‌సైట్ ద్వారా రూ.100.00 చెల్లించి దరఖాస్తు పూరించి మరియు పూర్తి వివరములు పొందగలరు. దరఖాస్తు ప్రారంభ తేది: 28-11-2019. దరఖాస్తు చేరుటకు చివరి తేది: 20-12-2019. మరిన్ని వివరములకు, సంస్థ వెబ్‌సైట్‌ను మరియు సంస్థ టోల్ ఫ్రీ నం.1800 4254 5678 నంబరుకు సంప్రదించండి.

సం/- డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, IPS., కార్యదర్శి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

DIPR Ro.No.509-PP/CL/ADVT/1/2019-20, Dt:27-11-2019

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

పత్రికా ప్రకటన

Rc.No.3177/OSD/01/2019, తేది : 27-11-2019

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న (17) ప్రతిభా కళాశాలల యందు (COE) 2020-2021 విద్యా సం॥నకు గాను ఇంటర్ ప్రథమ సం॥ నందు, M.P.C, Bi.P.C. అడ్మిషన్ల కొరకు March 2020 సం॥లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన బాల, బాలికల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి. బోధన ఆంగ్ల మాధ్యమున ఉండును. ఈ ప్రతిభా (COE) కళాశాలలో ప్రవేశం పొందినవారు ఇంటర్‌తో IIT, NIT, NEET, CLAT, CMA, పాటు మొదలగు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు చక్కని సదుపాయములు కల్పించబడును. అర్హులైన అభ్యర్థులు http://tgtwgurukulam.telangana.gov.in/ వెబ్‌సైట్ ద్వారా రూ.100.00 చెల్లించి దరఖాస్తు పూరించి మరియు పూర్తి వివరములు పొందగలరు. దరఖాస్తు ప్రారంభ తేది: 28-11-2019. దరఖాస్తు చేరుటకు చివరి తేది: 20-12-2019. మరిన్ని వివరములకు, సంస్థ వెబ్‌సైట్‌ను మరియు సంస్థ టోల్ ఫ్రీ నం.9121174434, 9121333472 నెంబర్లకు సంప్రదించండి.

సం/- డా. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, IPS., కార్యదర్శి (FAC), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

DIPR Ro.No.508-PP/CL/ADVT/1/2019-20, Dt:27-11-2019

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (MJPTBCWREIS)

రూమ్ నం. 206, DSS భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్-500028.

ఫోన్ నం.: 040-24602266, ఫ్యాక్స్: 040-24613377, ఇ-మెయిల్: mjptbcwreis14@gmail.com

టెండరు ప్రకటన

తెలంగాణ రాష్ట్రంలోని MJPTBCWREI సొసైటి ఇన్‌స్టిట్యూషన్ల అన్నింటికి హార్డ్ బౌండ్‌తో సహా ఆక్స్‌ఫర్డ్ కాంపాక్ట్ ఇంగ్లీష్-ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీల సరఫరా కోసం ఓపెన్ టెండరు ద్వారా నమోదిత సంస్థలు/అధీకృత డీలర్లు/పబ్లిషర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూళ్ళను సెక్రటరీ కార్యాలయం, MJPTBCWREI సొసైటీ, 2వ అంతస్తు, DSS భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్-500028 నుండి అన్ని పని రోజులలో ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం. మధ్య 29.11.2019 నుండి పొందవచ్చును. ఇందుకుగాను "Secretary, MJPTBCWREIS, Hyderabad" పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ. 5,000/- (ఐదు వేల రూపాయలు మాత్రమే) చెల్లించాలి. టెండరు దాఖలుకు ఆఖరు తేది: 16.12.2019 మరియు టెండర్లు 16.12.2019న తెరువబడును.

సం/- సెక్రటరీ, MJPTBCWREIS

DIPR.Ro.No. 507-PP/CL/ADVT/1/2019-20, Dt 27.11.2019

8 కొత్త 'ఏకలవ్య' స్కూళ్లు

- ఆన్‌లైన్‌లో అనుమతి కోసం సీబీఎస్ఈకి దరఖాస్తుల సమర్పణ
- ఒక్కో స్కూల్ ఏర్పాటుకు రూ.20 కోట్లు కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన గిరిజన సంక్షేమ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఎనిమిది ఏకలవ్య మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ చర్యలు వేగిరం చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఎనిమిది స్కూళ్లు నిర్వహిస్తుండగా... తాజాగా మరో 8 స్కూళ్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. కేంద్రం అనుమతి ఇస్తే వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. అదేవిధంగా ఈ స్కూళ్లకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని యోచిస్తోంది. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలకు పూర్తిస్థాయి భవనాలున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఈఎంఆర్ స్కూళ్లకు శాశ్వత భవనాలున్నప్పటికీ వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఈఎంఆర్ఎస్‌ల కోసం ప్రత్యేక సొసైటీని ఏర్పాటు చేసిన క్రమంలో రాష్ట్రంలోని ఈఎంఆర్ఎస్‌లకు కూడా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు, వసతులు కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కేంద్రానికి నివేదించింది.

సీబీఎస్ఈ అనుమతితో...

ఏకలవ్య మోడల్ స్కూళ్లను సీబీఎస్ఈ విధానంలో నిర్వహించాలని కేంద్రం సూచించిన క్రమంలో ఇప్పటికే కొనసాగుతున్న ఎనిమిది ఈఎంఆర్ఎస్‌లకు సీబీఎస్ఈ అనుమతులు వచ్చేశాయి. తాజాగా మరో ఎనిమిది స్కూళ్లను ప్రారంభించాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించిన నేపథ్యంలో వాటికి సీబీఎస్ఈ అనుమతుల కోసం అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. తాజాగా వీటికి కూడా అనుమతులు ఇస్తున్నట్లు సీబీఎస్ఈ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు సమాచారం ఇచ్చింది. దీంతో వీటి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఈ స్కూళ్లను నిర్వహించనున్నారు. తొలి ఏడాది 5 నుంచి 7వ తరగతి వరకు ప్రారంభించి ఆ తర్వాత నుంచి ఒక్కో తరగతిని అప్‌గ్రేడ్ చేస్తారు.

వచ్చే ఏడాది సీబీఎస్ఈ సిలబస్‌తో ప్రారంభమయ్యే స్కూళ్లు...

సీరోల్, మరిమడ్ల, గాంధారి, ఎల్లారెడ్డిపేట్, కురవి, బాలానగర్, ఇంద్రవెల్లి, గండుగులపల్లి

సకల సౌకర్యాలతో...

ఈఎంఆర్ఎస్‌లను కేంద్రీయ విద్యాలయాల మాదిరిగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈఎంఆర్ఎస్‌ల నిర్వహణకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఈఎంఆర్ఎస్‌లలో మౌళిక వసతుల కల్పన, శాశ్వత భవన నిర్మాణాలు తదితరాలకు సంబంధించి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కేంద్రానికి ఈ నెల మొదటి వారంలో కొన్ని ప్రతిపాదనలు పంపింది. ఇప్పటికే కొనసాగుతున్న ఈఎంఆర్ఎస్‌లకు ప్రాధాన్యత క్రమంలో నిధులు ఇవ్వాలని కోరుతూ, కొత్త వాటికి సకల సౌకర్యాలు కల్పించాలంటే ఒక్కో ఈఎంఆర్ఎస్‌కు రూ.20 కోట్లు అవసరమని తెలిపింది. ఈ నివేదికపై కేంద్రం నుంచి ఇంకా స్పందన రాలేదు.

నాంపల్లి టేషను కాడ..

హైదరాబాద్ నగరానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేదలు, యాచకులు, నిరాశ్రయులు తల దాచుకునే చోటులేక నాంపల్లి రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం రాత్రి వణికించే చలిలో నిద్రపోతున్న దృశ్యం

వైద్యుల గైర్హాజరుపై మంత్రి ఆగ్రహం

- ఐరిష్, బయోమెట్రిక్ అమలు చేయాలన్న వైద్య మంత్రి ఈటల
- రెండు రోజులపాటు జిల్లా అధికారులతో సుదీర్ఘ సమీక్ష
- రోగుల పట్ల శ్రద్ధగా, మర్యాదగా వ్యవహరించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో 40 శాతం మంది వైద్యులు గైర్హాజర్ అవుతుండటం పట్ల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలా ఉంటే జిల్లా, రాష్ట్ర స్థాయి వైద్యాధికారులు ఏం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య పథకాల అమలు, రోగులకు అందుతున్న చికిత్స తదితర అంశాలపై జిల్లా వైద్యాధికారులు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వివిధ వైద్య విభాగాల అధిపతులతో రెండు రోజులపాటు నిర్వహించిన సమీక్ష బుధవారం ముగిసింది. ఈ సమీక్షకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ యోగితారాణా, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు శాతం ఏమేరకు ఉందన్న విషయాన్ని ఆయన సమీక్షలో నేరుగా వైద్యాధికారులను ప్రశ్నించారు. '50-60 శాతం మాత్రమే హాజరు ఉంటుంది'అని వైద్యాధికారులు చెప్పడంతో మంత్రి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఐరిష్, బయోమెట్రిక్ లేదా కెమెరాల సాయంతో ఆటోమేటిక్ హాజరు వంటి వాటిని అమలుచేయాలని సూచించారు.

అన్నిజిల్లాల్లో పాలియేటివ్ కేర్

పాలియేటివ్ కేర్ సేవలను ప్రస్తుతం 8 జిల్లాల్లో 8 సెంటర్లలో అందజేస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల ద్వారా ఇన్‌పేషంట్లలో 8,447 మందికి, ఓపీలో 10,447 మందికి, ఇంటికి వెళ్లి 28,570 మందికి చికిత్స అందిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యులకు కూడా అలాంటి రోగులను ఎలా చూసుకోవాలన్న దానిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఏప్రిల్ నాటికి అన్ని జిల్లాల్లో పాలియేటివ్ కేర్ యూనిట్లను ప్రారంభిస్తామన్నారు. వయో వృద్ధులకు ఆసరా కార్యక్రమం ద్వారా ప్రతి గురువారం సబ్ సెంటర్లలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది మే నెల నుంచి 33 జిల్లాల్లో 6.85 లక్షల మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. అలాగే 75 ఏజింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మెంటల్ హెల్త్ కార్యక్రమం ద్వారా పైలట్ ప్రాజెక్ట్ కింద 4 జిల్లాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. కొన్ని పీహెచ్‌సీలను పరిశీలించగా, వికారాబాద్ జిల్లాలో 657 మంది, హైదరాబాద్‌లో 504 మంది, సిద్దిపేటలో 299 మంది, కరీంనగర్‌లో 237 మంది మొత్తంగా 1,697 మంది మానసికంగా అనారోగ్యంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఏంచేయాలన్న దానిపై నివేదిక ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీల్లో పని చేస్తున్న సిబ్బంది క్రమబద్ధీకరణకు మంత్రి పలు సూచనలు చేశారు. కొత్త పీహెచ్‌సీలను ఏర్పాటు చేయబోమని, ఉన్న వాటిని తొలగించబోమని మంత్రి స్పష్టం చేశారు. కంటి వెలుగు కార్యక్రమం కింద ఇంకా పంపిణీ చేయని కళ్లజోళ్లను తక్షణమే అందజేయాలన్నారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ ప్రోగ్రామ్ కింద ఇప్పటికే 4 జిల్లా ఆసుపత్రులు అవార్డులు పొందాయని, మరో 19 ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 104 సామాజిక ఆరోగ్య కేంద్రాల (సీహెచ్‌సీ)ను కూడా అలాగే అభివృద్ధి చేయాలని కోరారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగుల పట్ల చూపే శ్రద్ధ, మర్యాద వంటివి మెరుగుపరిచినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఆసుపత్రులకు అవసరమైన సదుపాయాలు తెలియజేస్తే వెంటనే అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ జిల్లా వైద్యాధికారులను మంత్రి సత్కరించారు. రెండ్రోజుల సుదీర్ఘ సమీక్ష గతంలో ఎవరూ నిర్వహించలేదని పలువురు వైద్యాధికారులు మంత్రిని ప్రశంసించారు.

డిసెంబర్ 18న మాలల పోరుగర్జన సభ

హైదరాబాద్: ఢిల్లీలో మాలల పోరుగర్జన సభను డిసెంబరు 18వ తేదీన నిర్వహించననట్లు తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసల రాంమూర్తి తెలిపారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ మాల మహానాడు ముఖ్య నేతల రాష్ట్ర సమావేశం జరిగింది. అనంతరం ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలనే కుట్రలను తిప్పికొట్టేందుకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పోరుగర్జన సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'బీజేపీలో చేరతాననడం తప్పుడు ప్రచారం'

సాక్షి, హైదరాబాద్: తాను బీజేపీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి ఖండించారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని, బీజేపీలో చేరాల్సిన అవసరం లేదన్నారు. టీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందేనన్నారు. గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీలా వ్యవహరిస్తున్న ఆ పార్టీల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతికి సంబంధించి రుజువులున్నాయని చెబుతున్న బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ వాటిపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు.

రక్షణ భూముల బదలాయింపుపై కదలిక

- 151 ఎకరాలకు రక్షణ శాఖ ఇప్పటికే ఆమోదం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే తరువాయి..
- నిబంధనలకు అంగీకరిస్తే 'స్కైవే'లకు రూట్ క్లియర్



సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానం

సాక్షి, హైదరాబాద్ : కంటోన్మెంట్ భూముల బదలాయింపులో మళ్లీ కదలిక వచ్చింది. కీలకమైన పోలో, జింఖానా మైదానాలతో పాటు స్కైవే, రోడ్డు విస్తరణలకు అవసరమైన భూములను బదలాయించేందుకు ఇప్పటికే పచ్చజెండా ఊపిన రక్షణ శాఖ.. ఇందుకు సంబంధించిన నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడమే తరువాయి అని చెబుతోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆరా తీయడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా రాష్ట్ర రహదారుల విస్తరణ, స్కైవేల నిర్మాణాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి 151.726 ఎకరాల భూమిని బదలాయించడానికి రక్షణ శాఖ 2017, ఆగస్టులోనే అనుమతులు ఇచ్చింది. సెక్రటేరియట్ నిర్మాణం కోసం 61.032 ఎకరాల పోలో, జింఖానా మైదానాలు, ఎస్ఆర్‌డీపీలో భాగంగా 90.694 ఎకరాల బదలాయింపునకు ఆమోదం తెలిపింది. అప్పట్లో రాజీవ్ రహదారికి మార్కింగ్ కూడా పూర్తి చేశారు. అయితే, జింఖానా, పోలో మైదానాల్లో సెక్రటేరియట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళనలు జరిగాయి. కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతానికి సెక్రటేరియట్ తరలింపుపై వెనక్కి తగ్గింది. అప్పట్నుంచి ఈ భూములతో పాటు ఎస్ఆర్‌డీపీకి అవసరమైన భూముల బదలాయింపుపై స్తబ్ధత నెలకొంది.

ప్రభుత్వం ఆరాతో మళ్లీ తెరపైకి..!

తాజాగా భూ బదలాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి రక్షణ మంత్రిత్వ శాఖ వద్ద ఆరా తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో రక్షణ శాఖ.. దీనిపై సమగ్ర సమాచారాన్ని అందజేయాలని కంటోన్మెంట్ అధికారులను కోరింది. భూముల బదలాయింపునకు సంబంధించి గతంలో పేర్కొన్న నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంటే ఒకట్రెండు నెలల్లోనే ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని గతంలో భూ బదలాయింపు కమిటీలో కీలకంగా పనిచేసిన ఓ అధికారి వెల్లడించారు. రక్షణ భూముల బదలాయింపు ప్రతిపాదనలన్నింటినీ కలపడం వల్ల ఇబ్బందులు వస్తున్నట్టు గుర్తించిన అధికారులు.. ఇకపై ఒక్కో ప్రతిపాదనను వేర్వేరుగానే పరిగణించాలని భావించినట్లు తెలుస్తోంది.

ఈ నిబంధనలే కీలకం..

- జింఖానా, పోలో మైదానాలను క్రీడలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించుకోవాలంటే ప్రధాన మంత్రి కార్యాలయ అనుమతి పొందాలి.
- కంటోన్మెంట్ ఆధీనంలోని భూముల్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయిస్తున్నందున ఏటా కంటోన్మెంట్‌కు నిర్ణీత మొత్తంలో సర్వీసుచార్జీ చెల్లించాలి.
- 'గాఫ్ రోడ్డు'కు ప్రత్యామ్నాయంగా 6 లేన్ల రోడ్డు నిర్మాణానికి 7.58 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కబ్జాకు గురైన 148 ఎకరాల రక్షణ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించడంపై ఇంకా నిర్ణయించాల్సి ఉంది.
- 151 ఎకరాల రక్షణ భూములకు బదులుగా ఇవ్వడానికి జవహర్‌నగర్‌లోని 560 ఎకరాల రాష్ట్ర ప్రభుత్వ భూముల గుర్తింపు.

రక్షణ శాఖ అనుమతిచ్చిన భూములివే

- జీఎల్ఆర్ సర్వే నంబర్ 708లోని 37.565 ఎకరాల పోలో మైదానం. ఇది పూర్తిగా మిలటరీ ఆధీనంలోని ఏ-1 కేటగిరీ స్థలం.
- జీఎల్ఆర్ సర్వే నంబర్ 712లోని 23.467 ఎకరాల జింఖానా మైదానం. ఇది కంటోన్మెంట్ బోర్డు ఆధీనంలోని 'సీ'కేటగిరీ స్థలం.
- ప్యారడైజ్ నుంచి సుచిత్ర సర్కిల్ వరకు ఎన్‌హెచ్-44 (నాగ్‌పూర్ హైవే), ప్యాట్నీ నుంచి హకీంపేట వరకు రాజీవ్ రహదారి మార్గాల్లో ప్రతిపాదిత స్కైవేల నిర్మాణం, ఇతర రోడ్ల విస్తరణకు 90.694 ఎకరాలు.

సీఓఈ కాలేజీల్లో అడ్మిషన్లు షురూ

- 2020-21 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు
- జేఈఈ, ఎంసెట్, నీట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- డిసెంబర్ 20తో ముగియనున్న దరఖాస్తుల ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: గురుకుల సొసైటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియకు తెరలేచింది. జేఈఈ, నీట్, ఎయిమ్స్, ఎంసెట్, క్లాట్, సీఏ-సీపీటీ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే ఈ కాలేజీల్లో 2020-21 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశాయి. ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై డిసెంబర్ 20తో ముగియనుంది. రాత పరీక్ష ద్వారా అర్హులను గుర్తించనున్నారు.

పదో తరగతి చదివే వారికే..

సీఓఈ కాలేజీల్లో ప్రవేశాలకు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు ఏ సొసైటీలో సీటు పొందాలనుకుంటున్నారనే అంశాన్ని పరిశీలించుకుని https://www.tswreis.in, http://www.tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 28 కాలేజీలు, ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో 17 కాలేజీలున్నాయి. ఒక్కో కాలేజీలో 40 సీట్లుంటాయి. మొత్తంగా 1,800 సీట్లకు ప్రవేశాలు చేపట్టే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. నిబంధనలకు అనుగుణంగా నిర్దేశించిన రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని గురుకుల సొసైటీలు పేర్కొంటున్నాయి.

ఒకట్రెండు రోజుల్లో కొత్త డీటీలకు పోస్టింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్లకు ఒకట్రెండు రోజుల్లో పోస్టింగ్‌లిచ్చే అవకాశముంది. గత నెలలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 ఫలితాలు విడుదల చేసింది. ఇందులో 259 మందిని డీటీలుగా ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఇటీవల భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు సమర్పించింది. ఈ అభ్యర్థులకు ఈ వారాంతంలోగా పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి జిల్లాలవారీగా వీరి కేటాయింపు జరగనుంది. హైదరాబాద్ జిల్లాకు మాత్రం కొత్త డీటీలను కేటాయించే అవకాశం లేనట్టేనని తెలుస్తోంది.

67 మంది ఎంపీవోలు కూడా..

గ్రూప్-2 ఫలితాల్లో మండల పంచాయతీ అధికారులు (ఎంపీవో)గా ఎంపికైన 67 మందికి వారం రోజుల్లో పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు తెలిపారు. 27 మంది ఎంపీవోలకు.. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు(ఎంపీడీవో)గా పదోన్నతులు కల్పిస్తున్నారు. ఇందులో ఆరుగురిపై ఉన్న అభియోగాలు నిరూపణ కాకపోవడంతో వారికీ పదోన్నతి ఇస్తుండగా, మిగతా వారికి సీనియారిటీ ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పిస్తున్నారు.

పులి కాదు.. అడవి పిల్లి..

- శంషాబాద్ విమానాశ్రయంలో అడవి పిల్లి సంచారం
- చిరుత అని హడలిపోయిన సిబ్బంది
- అడవి పిల్లి అని తేలడంతో ఊపిరిపీల్చుకున్న వైనం

శంషాబాద్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ అడవి పిల్లి హడలెత్తించింది. తొలుత దానిని చిరుత పులిగా భావించిన ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాలు.. బుధవారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయంలోని డెకత్లాన్ స్టోర్ సమీపంలో ఎయిర్‌పోర్టు సిబ్బందికి అడవి పిల్లి కనిపించింది. దూరం నుంచి చూడటంతో అది అచ్చం పులిలాగే కనిపించడంతో వారు హడలిపోయారు. దీంతో అటవీశాఖ అధికారులు మూడు గంటల పాటు ముమ్మరంగా గాలించారు. చివరకు అది చిరుత కాదని అడవి పిల్లి అని తేల్చారు. విషయాన్ని ఎయిర్‌పోర్టు అధికారులకు వివరించడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. అడవి పిల్లిని బంధించాల్సిన అవసరం లేదని అటవీ అధికారులు తెలిపారు. అది సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని చెప్పారు.

చిరుత వచ్చిందేమో..!

శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలోని కందుకూరు, ఆమనగల్లు, కడ్తాల్ తదితర ప్రాంతాల్లో ఇటీవల చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో నిజంగా అది ఇక్కడికి వచ్చి ఉండవచ్చని తొలుత సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎయిర్‌పోర్టుకు సమీపంలో రషీద్‌గూడ తదితర ప్రాంతాల్లో అటవీ ప్రాంతం దట్టంగా ఉండటంతో అటవీశాఖ అధికారులు కూడా మొదట చిరుతగానే భావించారు. చివరకు అడవి పిల్లి అని తేల్చారు. విమానాశ్రయంలోని రన్‌వేపైకి గతంలో భారీ కొండ చిలువ కూడా వచ్చింది.

ఎన్సీపీకి డిప్యూటీ సీఎం.. కాంగ్రెస్‌కు స్పీకర్

కూటమి నేతలతో భేటీ తర్వాత అభిమానులకు ఉద్ధవ్ ఠాక్రే అభివాదం

మహారాష్ట్ర సీఎంగా నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న ఉద్ధవ్ ఠాక్రే

- హాజరవనున్న సోనియా, మమత, కేజ్రీవాల్, స్టాలిన్!
- మోదీకీ ఆహ్వానం

సాక్షి, ముంబై/న్యూఢిల్లీ

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే(59) నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శివాజీ పార్క్ గ్రౌండ్‌లో గురువారం సాయంత్రం 6.40 గంటలకు సేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌ల కూటమి 'మహారాష్ట్ర వికాస్ అఘాడి' తరఫున ఆయన సీఎంగా ప్రమాణం చేస్తారు. కొత్త ప్రభుత్వంలో ఎన్సీపీకి ఉప ముఖ్యమంత్రి పదవి, కాంగ్రెస్‌కు స్పీకర్ పదవి లభించనున్నట్లు ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ బుధవారం రాత్రి వెల్లడించారు. ఉద్ధవ్‌తో పాటు మూడు పార్టీలకు చెందిన ఒకరిద్దరు ముఖ్యులూ ప్రమాణం చేస్తారు. ఉద్ధవ్ ప్రభుత్వంలో ఒకే ఉప ముఖ్యమంత్రి ఉంటారని స్పష్టం చేశారు. కాగా, ముంబైలోని వైబీ చవాన్ సెంటర్‌లో బుధవారం కూటమి ముఖ్య నేతలు కీలక చర్చలు జరిపారు. మంత్రి మండలిలో ఒక్కో పార్టీకి లభించే ప్రాతినిధ్యంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ తదితరులు చర్చల్లో పాలుపంచుకున్నారు. ఆ తరువాత వారితో కాంగ్రెస్ మహారాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖర్గే కలిశారు. శివసేనకు సీఎం సహా 15, ఎన్సీపీకి డిప్యూటీ సీఎం సహా 15, కాంగ్రెస్‌కు స్పీకర్ కాకుండా 13 మంత్రి పదవులు ఇవ్వాలనే సూత్రప్రాయ అంగీకారానికి వచ్చినట్లు సేన వర్గాలు తెలిపాయి. అంతకుముందు, ఉదయం గవర్నర్ భగత్ కోశ్యారీని ఉద్ధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, 20 ఏళ్ల తరువాత శివసేన నేత సీఎం అవుతున్నారు. మహారాష్ట్రలో శివసేన తరఫున తొలి ముఖ్యమంత్రిగా 1995లో మనోహర్ జోషి బాధ్యతలు చేపట్టగా, 1999లో నారాయణ రాణె శివసేన తరఫున సీఎం అయ్యారు.

ప్రమాణ స్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు

మహారాష్ట్రలో తొలిసారి ఠాక్రే కుటుంబ సభ్యుడు ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తుండటంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శివాజీ పార్క్‌లో నేటి సాయంత్రం అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు, శివసేన కార్యకర్తలు భారీగా తరలివస్తారని భావిస్తున్నారు. వేదికపైననే 100 మంది కూర్చునేలా భారీ వేదికను శివాజీ పార్క్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్నారు. మైదానంలో 70 వేల కుర్చీలు వేస్తున్నారు.కాంగ్రెస్ చీఫ్ సోనియాను ఉద్ధవ్ కొడుకు ఆదిత్య ఆహ్వానించారు. సోదరుడు, మహారాష్ట్ర నవనిర్మాణసేన (ఎమ్మెన్నెస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేను ఉద్ధవ్ స్వయంగా ఆహ్వానించారు. కార్యక్రమానికి సోనియా గాంధీతో పాటు పశ్చిమబెంగాల్, ఢిల్లీ, రాజస్తాన్ సీఎంలు, డీఎంకే చీఫ్ స్టాలిన్ తదితరులు హాజరయ్యే అవకాశముందని తెలిపాయి. ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ అమిత్, బీజేపీ అగ్రనేత అద్వానీలను శివసేన ఆహ్వానించిందని సమాచారం. ప్రమాణ స్వీకారానికి మహారాష్ట్రకు చెందిన 400 మంది రైతులను శివసేన ఆహ్వానించింది. వారిలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబ సభ్యులు ఉన్నారు.

అజిత్‌కు డిప్యూటీ సీఎం?

అజిత్ పవార్‌కి ఇచ్చే పదవిపై రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. ఎన్సీపీ శాసనసభా పక్ష నేతగా అజిత్‌ను మరోసారి ఎన్నుకుంటారని, ఉప ముఖ్యమంత్రి పదవీ రావొచ్చని తెలుస్తోంది.

భద్రతపై హైకోర్టు ఆందోళన

ప్రమాణ కార్యక్రమాన్ని శివాజీ పార్క్‌లో జరపడాన్ని బొంబాయి హైకోర్టు తప్పుబట్టింది. ప్రమాణస్వీకారంపై తాము స్పందించడం లేదని, కేవలం శివాజీ పార్క్ వంటి బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల తలెత్తే భద్రతాపరమైన సమస్యలపైనే ఆందోళన వ్యక్తం చేస్తున్నామని జస్టిస్ ధర్మాధికారి, జస్టిస్ చాగ్లాల బెంచ్ బుధవారం వ్యాఖ్యానించింది. వీకామ్ ట్రస్ట్ అనే ఎన్జీవో వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది.

అసెంబ్లీ వద్ద సోదరుడు అజిత్‌ను ఆత్మీయంగా పలకరిస్తున్న సుప్రియా సూలే.

ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ మనవడైన ఎమ్మెల్యే రోహిత్ పవార్‌తో మాట్లాడుతున్న బాల్ ఠాక్రే మనవడు, ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే

అజిత్‌కు సుప్రియా ఆత్మీయ ఆహ్వానం

మహారాష్ట్ర నూతన ఎమ్మెల్యేలు బుధవారం ఉదయం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. 285 ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ కాళీదాస్ కొలంబ్కర్ ప్రమాణం చేయించారు. ఈ ప్రత్యేక సమావేశాలకు వచ్చిన అజిత్ పవార్‌కు అనూహ్యమైన రీతిలో ఆత్మీయ ఆహ్వానం లభించింది. ఆయన సోదరి, లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలే, అజిత్ పవార్‌కు ఎదురై నవ్వుతూ పలకరించి, ఆత్మీయంగా హత్తుకున్నారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కుమార్తె అయిన సుప్రియా సూలే విధాన సభ ముఖద్వారం దగ్గరే నిల్చొని తమ పార్టీ ఎమ్మెల్యేలందరికీ స్వాగతం పలికారు.

ఎన్సీపీ వెంటే..

బీజేపీకి మద్దతునివ్వడం ద్వారా నాలుగు రోజుల పాటు డిప్యూటీ సీఎంగా కొనసాగి ఫ్యామిలీ సెంటిమెంట్‌తో వెనక్కి తగ్గిన అజిత్ పవార్ తాను ఎన్సీపీలోనే ఉన్నానని చెప్పారు. మహారాష్ట్ర ఎమ్మెల్యేగా బుధవారం ప్రమాణం చేశాక ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రస్తుతానికి నేను కొత్తగా చెప్పడానికేమీ లేదు. సమయమొచ్చినపుడు చెప్తాను. నేను ఎన్సీపీలోనే ఉన్నాను. ఎన్సీపీలోనే కొనసాగుతాను. ఇందులో ఎలాంటి అయోమయానికి తావు లేదు' అని చెప్పారు. ఇకపై పార్టీ ఆదేశాల మేరకే నడుచుకుంటానని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చాకే తాను నిర్ణయం మార్చుకొని, ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశానని అజిత్ పవార్ చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వంలో అజిత్ పవార్ ప్రముఖ పాత్ర పోషిస్తారని, ఆయనకు సముచిత స్థానమే లభిస్తుందని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ చెప్పారు. ఇప్పుడు మహారాష్ట్రలో అధికారం చేపట్టనున్న శివసేన భవిష్యత్తులో కేంద్రంలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశముందని రౌత్ వ్యాఖ్యానించారు. గత నెల రోజులుగా శివసేన తరఫున వ్యూహకర్తగా, మీడియా ప్రతినిధిగా వ్యవహరించిన రౌత్.. ఇకపై తాను పార్టీ పత్రిక 'సామ్నా' పనుల్లో నిమగ్నమవుతానన్నారు.

రాజకీయ ఉద్యమాలకు ఊతమిచ్చిన నేల

మరాఠాయోధుడు ఛత్రపతి గుర్తుగా శివాజీ పార్కు

రాజకీయ ఉద్దండులెందరినో పరిచయం చేసిన వేదికది. దేశం గర్వించదగ్గ క్రీడాకారుల ఆశలకూ, ఆకాంక్షలకూ ఊతమిచ్చిన క్రీడాప్రాంగణమది. యోధుడు ఛత్రపతి శివాజీ చరిత్రను అనునిత్యం గుర్తుచేసే మరాఠాల పోరాటాలకు పురిటిగడ్డ కూడా అదే ప్రాంతం. అన్నింటికన్నా ముఖ్యంగా ఉద్ధవ్ ఠాక్రే తండ్రి బాల్ ఠాక్రే అంతిమ సంస్కారాలకు వేదికగా నిలిచింది. ఠాక్రే వంశం నుంచి తొలిసారి ముఖ్యమంత్రి అవుతోన్న ఉద్ధవ్ ఠాక్రే నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

సిటీలోనే అతిపెద్ద పార్కు

ముంబైలోని దాదర్ ప్రాంతంలోని శివాజీ పార్కు సిటీలోనే అతిపెద్ద పార్కు. ఎన్నో రాజకీయ, సామాజిక ఉద్యమాలకు ఊతమిచ్చిన పార్కు వైశాల్యం దాదాపు 28 ఎకరాలు. ఈ పార్కు క్రికెట్ క్రీడాకారులకు భవిష్యత్తుపై ఆశలు రేకెత్తించింది. 1927 వరకు బ్రిటిష్ ఇండియాలో 1925లో ప్రారంభించిన ఈ పార్కు అనంతర కాలంలో ముంబైలోని ఎన్నో స్వాతంత్ర్యోద్యమాలకు కేంద్రబిందువైంది. 1947 స్వాతంత్ర్య కాలం నుంచి సంయుక్త మహారాష్ట్ర చాల్‌వాల్ (మహారాష్ట్ర ఏకీకరణ) ఉద్యమానికి ఇదే పార్కు వేదికయ్యింది. ప్రముఖ పాత్రికేయులు, నాటకరచయిత, కవి, సామాజిక నేత ఆచార్య ప్రహ్లద్ కేశవ్ అత్రే నాయకత్వంలో జరిగిన ఈ ఉద్యమం 1960 మహారాష్ట్ర రాష్ట్ర ఏర్పాటుకి దారితీసింది. ఆ తరువాత శివసేన నడిపిన ఎన్నో రాజకీయ ఉద్యమాలు ఈ వేదికగా ప్రారంభించారు.

మహిమా పార్కు

ముంబై మున్సిపల్ కార్పొరేషన్ బ్రిటిష్ కాలంలో ఈ పార్కుని ఏర్పాటు చేశారు. 1927 వరకు ఈ పార్కుని మహిమా పార్కుగా పిలిచేవారు. మున్సిపల్ కౌన్సిలర్ అవంతీ గోఖలే ఆదేశాల మేరకు ఛత్రపతి శివాజీ పేరుని పెట్టారు. పార్కులోపలి వైశాల్యం 1.17 కిలోమీటర్లు. మొత్తం మైదానం 112,937 చదరపు మీటర్లు. ఈ ప్రాంగణంలో టెన్నిస్ కోర్టు, వ్యాయామశాల, పిల్లల, వృద్ధుల పార్కులు, లైబ్రరీలు ఉన్నాయి.

సైలెన్స్ జోన్‌గా ప్రకటించిన కోర్టు

నిత్యం రాజకీయ కార్యకలాపాలకు వేదికగా ఉన్న ఈ పార్కు వల్ల ధ్వని కాలుష్యం ఎక్కువైందంటూ స్థానికులు 2009లో కోర్టుకి వెళ్లారు. దీంతో మే, 2010లో బాంబే హైకోర్టు ఈ ప్రాంగణాన్ని సైలెంట్ జోన్‌గా ప్రకటించింది.

ఎస్పీజీ చట్ట సవరణకు ఓకే

షా వ్యాఖ్యల్ని నిరసిస్తూ కాంగ్రెస్ వాకౌట్



న్యూఢిల్లీ: కాంగ్రెస్, ఇతర విపక్షాల నిరసనల మధ్య స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) సవరణ బిల్లుకు లోక్‌సభ బుధవారం ఆమోద ముద్ర వేసింది. ఈ సవరణ బిల్లు ప్రకారం ఇకపై ప్రధాన మంత్రి, ఆయన కుటుంబ సభ్యులకు ఎస్పీజీ కమాండోల రక్షణ ఉంటుంది. మాజీ ప్రధానులు, వారితో పాటు ఒకే ఇంట్లో నివాసం ఉండే కుటుంబసభ్యులకు ఆ ప్రధాని పదవీ కాలం ముగిసిన అయిదేళ్ల వరకు ఎస్పీజీ రక్షణ కల్పిస్తారు. సోమవారం ఈ బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్ రెడ్డి లోక్‌సభలో ప్రవేశపెడితే బుధవారం ఈ సవరణ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమాధానమిస్తూ బ్లాక్ క్యాట్ కమాండోలు ఉదాసీనంగా వ్యవహరించకుండా, వారి సమర్థత పెంచడం కోసమే ఎస్పీజీ చట్టానికి సవరణలు చేశామని చెప్పారు. తొలిరోజుల్లో ఏ ఉద్దేశంతో ఎస్పీజీ చట్టాన్ని తీసుకువచ్చారో దానినే పునరుద్ధరించామని వెల్లడించారు. ఇతర దేశాల్లో కూడా అత్యంత కట్టుదిట్టమైన భద్రత కేవలం దేశాధిపతులకు మాత్రమే ఉంటుందని షా గుర్తు చేశారు.

గాంధీ కుటుంబం భద్రతను మార్చాం

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆమె పిల్లలు రాహుల్, ప్రియాంకలకు భద్రతను తొలగించలేదని, జెడ్ ప్లస్ కేటగిరీకి భద్రతను మార్చామని అమిత్ షా చెప్పారు. వాస్తవానికి ఇప్పుడే గాంధీ కుటుంబానికి భద్రత మరింత పెరిగిందని అన్నారు. అత్యంత ఆధునిక భద్రతా వ్యవస్థ, అంబులెన్స్‌తో గాంధీ కుటుంబానికి భద్రత కల్పిస్తున్నట్టుగా స్పష్టం చేశారు. మాజీ ప్రధానులు చంద్రశేఖర్, ఐకె గుజ్రాల్, మన్మోహన్ సింగ్‌లకు ఎస్పీజీ భద్రత తొలగించినప్పుడు ఎవరూ ఎందుకు మాట్లాడలేదని, ఇప్పుడు ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ గతంలో చేసినట్టుగా ప్రతీకారంతో తాము ఈ బిల్లు తీసుకురాలేదని షా అన్నారు. వీఐపీలందరికీ వారి ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు ఆధారంగానే భద్రతను కల్పిస్తున్నామని అన్నారు. ప్రధాన మంత్రికి భద్రత కల్పించే స్థాయిలో అందరికీ కల్పించలేమని చెప్పారు. షా వ్యాఖ్యల్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది. ఇతర విపక్షాలు కూడా కొన్ని సవరణలు ప్రతిపాదించాయి. వాటిని తిరస్కరించిన సభ మూజువాణి ఓటుతో బిల్లుని ఆమోదించింది.

క్లుప్తంగా...

28 ఏళ్లలో 53 బదిలీలు

న్యూఢిల్లీ: హరియాణా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ముఖ్య కార్యదర్శి అశోక్ ఖేమ్కా మళ్లీ ట్రాన్స్‌ఫర్ అయ్యారు. అదేంటి ట్రాన్స్‌ఫర్ అయితే అందులో విశేషం ఏముంది అనుకుంటున్నారా? ఆయన ఎన్నిసార్లు ట్రాన్స్‌ఫర్ అయింది తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. 1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అశోక్ తన 28 ఏళ్ల సర్వీసు కాలంలో ఏకంగా 53 సార్లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. హరియాణా ప్రభుత్వం తాజాగా ఆయన్ను ఆర్కైవ్స్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆఖరిసారిగా క్రీడలు, యువజన వ్యవహారాల విభాగంలో 15 నెలలపాటు పనిచేశాక ఆయన మార్చిలో ట్రాన్స్‌ఫర్ అయ్యారు. 'మళ్లీ ట్రాన్స్‌ఫర్ అయ్యాను. రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్న మరుసటి రోజే సుప్రీంకోర్టు ఆదేశాలు, నియమాలు మరోసారి ఉల్లంఘనకు గురయ్యాయి. సర్వీసులో ఆఖరు దశకు చేరుకున్నాను. నిజాయితీకి దక్కిన గౌరవం ఇది'అని బుధవారం అశోక్ ట్వీట్‌చేశారు.

15వ ఫైనాన్స్ కమిషన్ పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: 15వ ఫైనాన్స్ కమిషన్ పదవీ కాలాన్ని కేంద్ర కేబినెట్ పొడిగించింది. కమిషన్ పదవీ కాలాన్ని 2020 అక్టోబర్ 30 వరకు పొడిగిస్తున్నట్లు బుధవారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. 2019 అక్టోబర్ వరకు ఉన్న కమిషన్ పదవీ కాలాన్ని తొలుత 2019 నవంబర్ 30 వరకు పొడిగించారు. అనంతరం దీనిని మరోమారు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పన్నులు, ఇతర వనరుల విభజనపై ఫైనాన్స్ కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి నివేదికను అందించేందుకు విధించిన గడువును 2020 అక్టోబర్ 30 వరకు పొడిగించింది. ఇక 2021–22 నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంశాలను సైతం తుది నివేదికలో పొందుపరచాలని పేర్కొంది.

ఇలాంటి పొత్తులకు సిద్ధం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: బీజేపీని అడ్డుకునేందుకు మహారాష్ట్ర తరహాలో దేశంలో ఎక్కడైనా ఆచరణాత్మక పొత్తులకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పేర్కొంది. ఈ దిశగా బీజేపీయేతర అన్ని పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చింది. సైద్ధాంతిక విబేధాలున్నప్పటికీ మహారాష్ట్రలో శివసేనతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. విపక్షాలనే కాకుండా, మిత్రపక్షాలను కూడా అణచేయాలని బీజేపీ చూస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజీవ్ గౌడ ఆరోపించారు. 'దేశ రాజకీయ చిత్రపటం మారుతోంది. బీజేపీ పాలిత రాష్ట్రంలో కాలు పెట్టకుండానే ఇప్పుడు కశ్మీర్ నుంచి కన్యాకుమారికి వెళ్లవచ్చు. మహారాష్ట్రలో వేర్వేరు శక్తులు కలిసి ఒక ఆచరణాత్మక కూటమిగా ఏర్పడటం చూశాం. త్వరలో ఇలాంటివి మరిన్ని చూడనున్నాం' అన్నారు.

గాడ్సే దేశభక్తుడు: ప్రజ్ఞా

గాంధీజీని కాల్చి చంపిన నాథూరామ్ గాడ్సేను 'దేశభక్తుడు'గా పేర్కొంటూ బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేయడంతో విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మహాత్మా గాంధీని ఎందుకు చంపాడనే దానిపై గాడ్సే చేసిన ప్రకటనను డీఎంకే సభ్యుడు రాజా ప్రస్తావిస్తుండగా.. ప్రజ్ఞా ఠాకూర్ అడ్డుతగిలారు. ఒక దేశభక్తుడిని మీరు ఉదాహరణగా చెప్పనక్కర్లేదు అని అన్నారు. రాజా మాటలకు ప్రజ్ఞా ఠాకూర్ అడ్డుతగలడంతో విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. గాడ్సేపై ప్రజ్ఞా ఠాకూర్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని మరో కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు.

సమ్మెపై 14 రోజులు ముందే చెప్పాలి

సమ్మెకు వెళ్లే కార్మికులు 14 రోజుల ముందే నోటీసు ఇవ్వడాన్ని తప్పనిసరి చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఈ మేరకు కార్మిక మంత్రి సంతోష్ గంగ్వార్ బుధవారం రాజ్యసభకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త కార్మిక చట్టంలో ఇది భాగమని, దీనిపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో మంత్రిత్వ శాఖ సంప్రదింపులు జరుపుతోందని గంగ్వార్ అన్నారు. కార్మిక చట్టాలలో ప్రభుత్వం సంస్కరణలు తీసుకువస్తోందని పేర్కొన్న మంత్రి, అందులో భాగంగా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మిళితం చేస్తున్నామని వెల్లడించారు. 2016లో జరిపిన ఒక సర్వే ప్రకారం దేశంలో 10 కోట్ల మంది వలస కార్మికులు ఉన్నారని, ఇది గ్రామిక శక్తిలో 20 శాతం ఉందని తెలిపారు.

'వైద్య బిల్లు'లో యోగా, నేచురోపతిని చేర్చండి

న్యూఢిల్లీ: యోగా, నేచురోపతి (ప్రకృతి సిద్ధ)లను 'నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ బిల్లు'లో చేర్చాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. ఈమేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమంపై నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 115వ నివేదికను రాజ్యసభకు సమర్పించింది. బిల్లులోని క్లాజ్ ప్రకారం యోగా, నేచురోపతిలకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదించింది. భారతీయ వైద్య వ్యవస్థలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూషన్లలో ప్రవేశాల కోసం కామన్ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ అండ్ కామన్ కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. అలాగే కామన్ ఫైనల్ ఇయర్ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎగ్జామినేషన్‌గా పిలిచే నేషనల్ ఎగ్జిట్ టెస్ట్‌ను నిర్వహించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. దీని ద్వారా మెడికల్ ప్రాక్టీషనర్‌గా పనిచేయడానికి లైసెన్స్ లభిస్తుంది.

9లోగా 'అయోధ్య' రివ్యూ పిటిషన్

ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ప్రకటన

లక్నో: అయోధ్యలోని వివాదాస్పద బాబ్రీ మసీదు– రామ జన్మభూమి కేసులో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై డిసెంబర్ 9లోపు రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ది ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) బుధవారం ప్రకటించింది. సుప్రీంతీర్పును సమీక్షించబోమని సున్నీ వక్ఫ్ బోర్డు మంగళవారం ప్రకటించిన నేపథ్యంలో బుధవారం ఏఐఎంపీఎల్‌బీ తాజాగా ఈ ప్రకటన చేయడం గమనార్హం. నవంబరు 17న జరిగిన బోర్డు సమావేశంలోనే రివ్యూ పిటిషన్‌పై తీర్మానించామని, సమీక్ష కోరేందుకు తమకు డిసెంబరు 9వరకు సమయం ఉందని ఏఐఎంపీఎల్‌బీ కార్యదర్శి జఫర్యాబ్ జిలానీ తెలిపారు. రివ్యూ పిటిషన్ దాఖలు చేసేందుకు అవకాశమున్న ముస్లిం వర్గాలను అయోధ్య పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని, కేసుల్లో ఇరికించి జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని జిలానీ ఆరోపించారు. అయోధ్య పోలీసుల తీరును పిటిషన్‌లో తాము సుప్రీంకోర్టుకు నివేదిస్తామని అన్నారు. ఇదిలా ఉండగా.. మసీదు నిర్మాణానికి ప్రభుత్వమిచ్చే ఐదెకరాల స్థలాన్ని సున్నీ వక్ఫ్‌బోర్డు నిరాకరిస్తే దాన్ని తమకు ఇవ్వాల్సిందిగా కోరతామని ఉత్తరప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు బుధవారం తెలిపింది. అయితే ఆ స్థలాన్ని తాము మసీదు నిర్మాణానికి కాకుండా ఆసుపత్రిని నిర్మించేందుకు వినియోగిస్తామని ఉత్తరప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ వసీమ్ రిజ్వీ తెలిపారు. అయోధ్య తీర్పుకు సంబంధించి రివ్యూ పిటిషన్ ముసాయిదా తయారైందని ప్రముఖ ముస్లిం సంస్థలు తెలిపాయి. డిసెంబరు 3 లేదా 4 తేదీల్లో జమాయత్ ఉలేమా ఏ హింద్ సంస్థ సుప్రీం కోర్టులో దాఖలు చేసే అవకాశం ఉంది.

అతి చిన్న క్యారెక్టర్

యానిమేషన్ షార్ట్ ఫిల్మ్‌లో కనిపించనున్న ప్రపంచంలోనే అతిచిన్న యానిమేటెడ్ పాత్ర ఇది. దీని ఎత్తు కేవలం 0.3 మిల్లీమీటర్లు. ఈ ఫొటోను డారోవాన్ ప్రోడ్ మంగళవారం విడుదల చేశారు. స్టాప్ మోషన్ యానిమేషన్ చిత్రం 'స్టార్‌డస్ట్ ఒడిస్సీ'లో ఈ పాత్ర కనిపించనుంది. ఫెమ్‌టో-ఎస్టీ ఇన్‌స్టిట్యూట్ ఈ క్యారెక్టర్‌ను సృష్టించింది.

500 మంది భారతీయులకు గూగుల్ హెచ్చరికలు

న్యూఢిల్లీ: టెక్నాలజీ దిగ్గజం గూగుల్ ప్రపంచవ్యాప్తంగా పలువురు యూజర్లకు జూలై నుంచి సెప్టెంబర్ మధ్య 12 వేల హెచ్చరికలను పంపింది. అందులో 500 మంది భారతీయులూ ఉన్నారు. ప్రభుత్వ మద్దతు ఉన్న హ్యాకర్ల దాడికి గురయ్యే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించింది. వాట్సాప్ వీడియో కాలింగ్‌లోని లోపం ద్వారా పెగాసస్ సాఫ్ట్‌వేర్‌సాయంతో పలు దేశాల ప్రభుత్వాలు మానవ హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టుల సమాచారం హ్యాక్ చేస్తున్నారన్న నేపథ్యంలో ఈ వార్తలు రావడం గమనార్హం. దాదాపు 50 దేశాలకు చెందిన ప్రభుత్వ మద్దతుదారులైన హ్యాకర్లు 270 మందిని టార్గెట్ చేసినట్లు గూగుల్ తెలిపింది.

ఇస్రో విజయ విహారం

- పీఎస్ఎల్వీ సీ47 రాకెట్ ప్రయోగం సక్సెస్
- 26.50 నిమిషాల్లో 14 ఉపగ్రహాలు వేర్వేరు కక్ష్యల్లోకి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరోసారి జయ కేతనం ఎగురవేసింది. విజయాల పరంపరను కొనసాగిస్తూ షార్ నుంచి 74వ ప్రయోగాన్ని బుధవారం విజయవంతంగా ముగించింది. నెల్లూరు జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి బుధవారం ఉదయం 9.28 గంటలకు పీఎస్ఎల్వీ సీ47 రాకెట్ ద్వారా 1625 కిలోల బరువు కలిగిన కార్టోశాట్–3 ఉపగ్రహంతో పాటు అమెరికాకు చెందిన మరో 13 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రవేశపెట్టింది. 14 ఉపగ్రహాలను భూమికి 509 కిలోమీటర్లు ఎత్తులోని వృత్తాకార సూర్యానువర్తన ధ్రువకక్ష్య (సర్క్యులర్ సన్ సింక్రోనస్ ఆర్బిట్)లో వివిధ దశల్లో ఉపగ్రహాలను ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగ విజయంతో ఈ ఏడాది అయిదు ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించినట్లయింది. ప్రయోగానంతరం ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ బృందాన్ని ఆలింగనం చేసుకోగా, శాస్త్రవేత్తలు తమ సంతోషాన్ని ఒకరితో ఒకరు పంచుకున్నారు. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు చెబుతూ ట్వీట్ చేశారు.

వచ్చే మార్చిలోపే 13 మిషన్ల ప్రయోగం

2020 ఏడాది మార్చి 31లోపు 13 మిషన్లను ప్రయోగించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఇస్రో చైర్మన్ శివన్ తెలిపారు. ఇందులో ఆరు లాంచింగ్ వెహికల్స్, 7 ఉపగ్రహ ప్రయోగాలు ఉంటాయని తెలిపారు. రాబోయే నాలుగు నెలలు ఇస్రో కుటుంబం తీరికలేకుండా పనిచేయాల్సి ఉంటుందన్నారు. షార్ నుంచి 74 ప్రయోగాలు చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను 49సార్లు ప్రయోగించగా 47సార్లు సక్సెస్ అయ్యింది. పీఎస్ ఎల్వీ ఎక్సెల్ స్ట్రాపాన్ బూస్టర్లతో 21 ప్రయోగమిది. ఈ ఏడాది 5వ ప్రయోగం కావడం విశేషం. కార్టోశాట్ ఉపగ్రహాల సిరీస్‌లో ఈ ప్రయోగం తొమ్మిదవది.

మనదేశ ఖ్యాతి మరింత పైకి: జగన్

సాక్షి, అమరావతి: పీఎస్ఎల్వీ సీ47 రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. భూతల మ్యాపింగ్, ఛాయాచిత్రాలను మరింత అత్యాధునికంగా తీసి సమాచారాన్ని పంపే ఈ ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచంలోనే మన దేశ ఖ్యాతిని శాస్త్రవేత్తలు అగ్రభాగాన నిలిపారని జగన్ ప్రశంసించారు. ఈ ప్రయోగాలను విజయవంతం చేయడం ద్వారా ఇస్రో మరో మైలురాయిని చేరుకుని దేశానికి గర్వకారణంగా నిలిచిందని ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు.

కేసీఆర్ అభినందనలు..

సాక్షి, హైదరాబాద్: పీఎస్ఎల్వీ సీ47 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలను తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అభినందించారు. భారతీయ శాస్త్రవేత్తల నైపుణ్యం, కృషికి ప్రస్తుత విజయం తార్కాణంగా నిలుస్తుందన్నారు.

దేశీయ అవసరాలకే కార్టోశాట్-3

దేశీయ భౌగోళిక అవసరాల కోసం ఇస్రో కార్టోశాట్ సిరీస్ ఉపగ్రహ ప్రయోగాలను వరుసగా నిర్వహిస్తోంది. కార్టోశాట్ సిరీస్‌లో ఇప్పటికే ఎనిమిది ఉపగ్రహాలను పంపించగా, ఇది తొమ్మిదవది. కార్టోశాట్–3 థర్డ్ జనరేషన్ ఉపగ్రహం కావడం విశేషం. గతంలో ప్రయోగించిన కార్టోశాట్ ఉపగ్రహాల కంటే ఈ ఉపగ్రహం అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఈ ఉపగ్రహంలో అమర్చిన ప్రాంకోమాటిక్ మల్టీ స్పెక్ట్రల్ కెమెరాలు అత్యంత శక్తిమంతమైనవి. దీనిద్వారా పట్టణ, గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు, సముద్ర తీర ప్రాంతాల నిర్వహణ, రహదారుల పర్యవేక్షణ, నీటి పంపిణీ, భూ వినియోగంపై మ్యాప్‌లు తయారు చేయడం, విపత్తులను విస్తృతిని అంచనా వేసే పరిజ్ఞానం, వ్యవసాయ సంబంధితమైన సమాచారం అందుబాటులోకి వస్తుంది. ప్రత్యేకించి నిఘాలో సైనిక అవసరాలకు ఉపయోగపడడమే కాకుండా సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దోహదపడుతోంది. ఈ ఉపగ్రహం అయిదేళ్లపాటు సేవలు అందిస్తుంది.

సాక్షి
గురువారం, నవంబర్, 28

చైనాకు హాంకాంగ్ షాక్

జన చేతనను విస్మరిస్తే ఏమవుతుందో చైనా పాలకులకు అర్థమై ఉండాలి. ఆదివారం హాంకాంగ్ పరిధిలోని 18 జిల్లా పాలకమండళ్ల నుంచి 452 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో చైనా అనుకూల ప్రతినిధులు ఘోర పరాజయం చవిచూశారు. మొత్తం 17 మండళ్ల ప్రజాస్వామ్య అనుకూలవాదుల చేజిక్కించుకోవడంతోపాటు 452 స్థానాల్లో 390వారికి లభించాయి. ఇది దాదాపు 90 శాతం. చైనా అనుకూలురకు దక్కినవి కేవలం 59 స్థానాలు మాత్రమే. సహజంగానే ఈ ఫలితాలు బీజింగ్‌ను దిగ్భ్రాంతి పరిచాయి. సాధారణంగా అయితే ఈ ఎన్నికలకు పెద్దగా ప్రాముఖ్యం ఉండేది కాదు. ఎందుకంటే ఈ మండళ్లకు ఉండే అధికారాలు చాలా పరిమితమైనవి. చెత్త తొలగింపు, బస్సు రూట్లు సదుపాయం, పర్యావరణంవంటి పౌరుల అవసరాలను పర్యవేక్షించి చర్యలు తీసుకోవడానికి మాత్రమే వీటికి అధికారాలుంటాయి. కానీ ఆర్నెల్లక్రితం చిన్నగా మొదలై, చూస్తుండగానే కార్చిచ్చులా వ్యాపించిన ప్రజాస్వామ్య ఉద్యమం కారణంగా ఈ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. హాంకాంగ్ ప్రజల మనోభీష్టం వ్యక్తమయ్యేది కేవలం ఈ ఎన్నికల ద్వారా మాత్రమే. పైగా హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కారీ లామ్ ఈ ఎన్నికలు తన పాలనకు రిఫరెండం అని ముందే చెప్పారు. ఫలితాలు వెలువడ్డాక సైతం ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తామని, లోపాలను సవరించుకుంటామని అన్నారు. కానీ ఆమెను ఆ పదవిలో కూర్చోబెట్టిన చైనా పాలకులకు మాత్రం ఈ ఫలితాలు కంటగింపుగా మారాయి. దీన్నుంచి గుణపాఠం నేర్చుకోవడం మాని, ఉద్యమకారులపై నిందలేస్తున్నారు. ప్రభుత్వ అనుకూల మీడియా అమెరికా రాజకీయ నాయకులపై ఆరోపణలు చేస్తున్నది. హాంకాంగ్‌లో కల్లోలం సృష్టించడమే వారి ఉద్దేశమని అంటున్నది. బ్రిటన్‌కున్న 150 ఏళ్ల లీజు ముగిసి 1997 జూలై 1న హాంకాంగ్ తిరిగి చైనాకు దఖలు పడినప్పుడు అప్పటి చైనా నాయకుడు డెంగ్ జియావో పెంగ్ ఇచ్చిన హామీ బహుశా చైనా నేతలు మర్చిపోయి ఉండొచ్చు. హాంకాంగ్‌లో ఇప్పుడున్న విధానాలన్నీ యధాతథంగా సాగుతాయని, తాము 'ఒకే దేశం–రెండు వ్యవస్థలు' అనే విధానానికి కట్టుబడి ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఒప్పందాన్ననుసరించి 2047లో ఆ నగరం పూర్తి స్థాయిలో చైనా పరిధిలోకొస్తుంది. అప్పటి వరకూ హాంకాంగ్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వచ్చే ముప్పేమీ ఉండబోదని డెంగ్ తెలిపారు. ఆయన కన్నా ముందు 1993లో చైనా కమ్యూనిస్టు పార్టీ 'పీపుల్స్ డైలీ'లో రాసిన వ్యాసంలో ఉన్నత స్థాయి నాయకుడొకరు హాంకాంగ్ స్వయంప్రతిపత్తిలో తమ జోక్యం ఉండబోదని చెప్పారు. కానీ 1997 నుంచి ఇప్పటివరకూ సాగిన చరిత్రంతా చూస్తే చైనా ఏ ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదని అర్థమవుతుంది. అక్కడి ప్రజల హక్కులు ఒక్కొక్కటే మింగేస్తూ, ఆ నగరాన్ని గుప్పెట్లో బంధించడానికి అది పావులు కదుపుతూనే ఉంది.

అమెరికా తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో చైనాది ద్వితీయ స్థానం. అది ఎప్పుడో ఒకప్పుడు తమను మించిపోతుందన్న భయం అమెరికాకు ఉంది. ఈ దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే, హాంకాంగ్‌కిచ్చిన వాగ్దానం నెరవేర్చకపోతే ప్రపంచ దేశాల్లో తన విశ్వసనీయత దెబ్బతింటుందని చైనా గ్రహించడం లేదు. ఆర్నెల్లుగా హాంకాంగ్‌ను ఉక్కుపాదంతో అణిచేస్తూ అక్కడి ప్రజలు తిరిగి తనకే పట్టం కడతారని చైనా ఎలా అనుకుందో అంతుబట్టని విషయం. కేవలం గుప్పెడుమంది విదేశీ శక్తుల ప్రోద్బలంతో ఉద్యమం సాగుతున్నదని, దీనికి మెజారిటీ ప్రజల మద్దతు లేదని చెబుతూ వస్తున్న చైనాకు తాజా ఫలితాలు చెంపపెట్టు. కనీసం ఇప్పుడైనా పౌరుల ఆగ్రహావేశాలు ఏ స్థాయిలో ఉన్నాయో అది గుర్తించాలి. నాలుగేళ్లక్రితం జరిగిన ఎన్నికల్లో 14 లక్షలమంది ఓటు హక్కు వినియోగించుకోగా ఈసారి ఆ సంఖ్య 29.5 లక్షలకు చేరుకుంది. మొత్తం 452 స్థానాల్లో ప్రతి ఒక్కచోటా నువ్వా నేనా అన్న రీతిలో హోరాహోరీ పోరు సాగింది. అయితే నగర నిర్వహణ కమిటీలో ఇప్పటికీ చైనా అనుకూల ప్రతినిధులదే పైచేయిగా ఉంటుంది. అందులో ఉండే 1,200 మంది సభ్యుల్లో మండళ్ల నుంచి ఎన్నికైనవారిలో కేవలం 117మందికి మాత్రమే స్థానం లభిస్తుంది. మిగిలినవారంతా రకరకాల కేటగిరీల్లో చైనా ప్రభుత్వం నామినేట్ చేసేవారే ఉంటారు. కనుక 2022లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ పదవికి జరగబోయే ఎన్నికల్లో చైనాదే పైచేయిగా ఉంటుంది. హాంకాంగ్ నగరంపై యధావిధిగా దాని ఆధిపత్యమే కొనసాగుతుంది.

ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైనప్పుడు సకాలంలో దాన్ని గుర్తించాలి. కానీ చైనా అందుకు భిన్నంగా తనకెదురు లేదన్నట్టు వ్యవహరించింది. ఆ ధోరణే ఇప్పుడు హాంకాంగ్ పౌరులను ఏకం చేసింది. హాంకాంగ్‌లో నేరాలు చేసేవారిని చైనాకు తరలించి, అక్కడి చట్టాల ప్రకారం శిక్షించ డానికి వీలిచ్చే బిల్లు తీసుకురావడం ఇప్పుడు హాంకాంగ్‌లో సాగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమానికి మూలం. పైగా ఆ బిల్లు వెనకటి తేదీ నుంచి వర్తించేలా రూపొందించారు. నేరస్తుల అప్పగింత చట్టాన్ని సవరిస్తూ రూపొందించిన ఆ బిల్లు ఆమోదం పొందితే చైనా వ్యతిరేకులందరినీ ఏరిపారేయడం సులభమవుతుంది. అలాంటివారిని చైనా తరలించి అక్కడ అమలవుతున్న చట్టాల కింద కఠిన శిక్షలు విధించడం వీలవుతుంది. కేసుల విచారణ, నేరస్తులకు శిక్షలు వగైరాలన్నీ ఒక తంతుగా సాగే చైనా న్యాయ వ్యవస్థకు ఏమాత్రం విశ్వసనీయత లేదు. కనుకనే ఈ సవరణ బిల్లును అంగీకరించబోమని ఉద్యమ నిర్వాహకులు చెప్పారు. మొదట్లోనే చైనా ఇందుకు అంగీకరించి ఉంటే పరిస్థితి విషమించేది కాదు. కానీ లారీ కామ్ మొండికేయడంతో ఉద్యమం ఉధృతమైంది. చివరకు ఈ బిల్లును వెనక్కి తీసుకుంటున్నామని ఇటీవల ఆమె ప్రకటించినా ఉద్యమం ఆగే సూచనలు కనిపించడం లేదు. పైగా అది హింసాత్మకంగా మారుతోంది. అందుకు తగ్గట్టే పోలీసు బలగాలు కూడా తీవ్రంగా విరుచుకుపడుతున్నాయి. ఈ ఎన్నికలకు పాలనాపరంగా పెద్దగా ప్రాధాన్యత లేకపోయినా, దీనిద్వారా వ్యక్తమైన జనాభీష్టాన్ని గ్రహించడం, అందుకు తగ్గట్టుగా వ్యవహరించడం ముఖ్యమని చైనా గుర్తించాలి.

సుప్రీం తీర్పుపై రాజీ తప్పదా?

విశ్లేషణ



హర్బన్స్ ముఖియా

ఆలయాన్ని ధ్వంసం చేసి ఆ పునాదులపై బాబ్రీ మసీదును నిర్మించారనడానికి చారిత్రక, పురావస్తు ఆధారాలు లేవని తాము భావిస్తున్నప్పటికీ, హిందూ సోదరులు మాత్రం అది రామజన్మ స్థానమేనని నమ్ముతున్నందువల్ల దాన్ని వారికి సంతోషంగా అప్పగిస్తామని ఆనాడు ముస్లిం పక్షం చెప్పి ఉంటే తదనంతర చరిత్రలో ఏం జరిగివుండేది అనేది మన ఊహకు అందదు. అదే జరిగి ఉంటే రామాలయం, బాబ్రీమసీదు వివాదం శాశ్వత ప్రాతిపదికన శాంతియుతంగా ముగిసిపోయి ఉండేది. పైగా 1980ల నుంచి మనం దేశవ్యాప్తంగా చూస్తూ వస్తున్న మతపరమైన ఘర్షణలు తగ్గుముఖం పట్టి ఉండేవని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును కూడా ముస్లిం పక్షం వ్యతిరేకిస్తే హిందుత్వ సంస్థలకు, వారి భావజాలానికి అంతకు మించిన బలం మరొకటి ఉండబోదనే చెప్పాలి.

దశాబ్దాలుగా వివాదాస్పదంగా నలుగుతున్న అయోధ్య, బాబ్రీమసీదు సమస్యపై విచారణను ముగించాక, సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తుది తీర్పుపై పలువురు న్యాయపరమైన విమర్శలు సాగిస్తున్నారు. ప్రత్యేకించి ఈ తీర్పులో కనిపిస్తున్న కొన్ని అతి స్పష్టమైన పరస్పర విరుద్ధమైన, అసంగతమైన అంశాలు విమర్శలకు దారితీస్తున్నాయి. నాలుగు శతాబ్దాలుగా ఉనికిలో ఉంటూ వచ్చిన బాబ్రీమసీదును లేక దాని కొత్త నిర్మాణాన్ని తన మూల స్థానం నుంచి తరలించి అయోధ్యలోని 'కీలకమైన స్థలం'లో అయిదెకరాల విస్తీర్ణంలో నిర్మించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది.

అయితే మనం ఒకసారి 1980లలోకి మళ్లీ అడుగుపెట్టి చూసినట్లయితే సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కొన్ని అంశాలను దాచి ఉంచినట్లు తెలుస్తుంది. రామజన్మభూమి – బాబ్రీ మసీదు వివాదం జాతీయ ఎజెండాగా ఆవిర్భవించడం 1980లలోనే ప్రారంభమైంది. వివాదాస్పదమైన 2.77 ఎకరాల భూమిని తమకు అప్పగించినట్లయితే, బాబ్రీమసీదు మొత్తం నిర్మాణాన్ని చెక్కు చెదరకుండా ప్రస్తుత ప్రాంతానికి మరీ దూరంగా కాకుండా సమీపంలోని మరొక చోటికి సురక్షితంగా తరలిస్తామని ఆనాడు వివాదంలో భాగమై ఉన్న హిందూ పక్షం ప్రతిపాదించింది.

ముస్లింల వ్యతిరేకతతో మూలమలుపు

ఈజిప్టులో అస్వన్ డ్యామ్ కట్టడానికి వీలుగా ఒక పురాతన కట్టడాన్ని 1950లలో మరొక చోటికి సాంకేతిక పరిజ్ఞానంతో విజయవంతంగా తరలించారు. అయోధ్య వివాదంలో హిందూ పక్షం కూడా సరిగ్గా దీన్నే ప్రతిపాదించింది. అయితే మతపరంగా, రాజకీయపరంగా రెండురకాలుగా ముస్లిం పక్షం ఈ తిరస్కరించింది. ఒకప్పుడు అల్లా నివాసస్థలంగా భావించిన భూమిలోంచి ఒక ముక్కను తీసుకోవడం అనే అంశంపై తాము చర్చించలేమని ముస్లిం పక్షం వాదించింది. ఇక రెండోది ఏమిటంటే ఒకసారి హిందూ పక్షం నుంచి వస్తున్న ఈ డిమాండును అంగీకరించినట్లయితే అనేక ఇతర వివాదాస్పద ప్రాంతాల్లోనూ ఇదేరకమైన డిమాండ్లను తీసుకొచ్చే ప్రమాదం ఉంది. ప్రత్యేకించి కాశీ, మధుర ప్రాంతాలు ఈ సమస్య బారిన పడకతప్పదని ముస్లిం పక్షం భావన.

అయితే సుప్రీంకోర్టు ఈ వివాదంపై ఇటీవలే వెలువరించిన తీర్పు... పైన పేర్కొన్న తొలి అంశాన్ని స్పష్టంగా తిరస్కరించింది. పైగా 1991లో తీసుకొచ్చిన ఒక చట్టం రెండో అంశం విషయంలో కూడా తలుపులు మూసివేసింది. అయోధ్య కాకుండా ఇతర ప్రాంతాల్లో మందిర్–మసీదు వంటి వివాదాలు తలెత్తకుండా 1991 నాటి చట్టం అడ్డుకట్టలు వేసింది. అయితే భవిష్యత్తు రాజకీయ మలుపులు, పరిణామాలు దాని మనుగడకు హామీ ఇవ్వలేవు. ప్రస్తుత కేంద్రప్రభుత్వం ఆర్టికల్ 370 కింద కశ్మీర్‌కు ఇచ్చిన పవిత్రమైన హక్కులను కూడా ఒక్క కలంపోటుతో రద్దుచేయగలిగిన స్థితిలో ఉన్నప్పుడు, 1991నాటి చట్టాన్ని దాటి ముందుకెళ్లడానికి ఎంత కాలం పడుతుంది? పైగా 1991 నాటి ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవడంపై భారీ ఎత్తున ప్రజా సమీకరణ చేపట్టడం కేంద్రానికి సాధ్యపడుతుంది కూడా.

రామాలయాన్ని కాదు కదా... మరే దేవాలయాన్ని కూడా బాబ్రీ మసీదు నిర్మాణం కోసం కూల్చివేశారనడానికి ఎలాంటి చారిత్రక, పురావస్తు ఆధారాలు లేనప్పటికీ (నాతో సహా అనేకమంది చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, వాస్తవానికి భారత పురావస్తు శాఖ సర్వే రిపోర్టులో కూడా బాబ్రీమసీదు కోసం రామాలయాన్ని నిర్మూలించలేదనే వాదిస్తూ వచ్చారు. అయితే మసీదు ప్రాంతంలో జరిగిన తవ్వకాల్లో ఇస్లాంకు సంబంధించినది కాకుండా ఇతర చిహ్నాలు కనిపించాయని ఒక సర్వే నివేదించింది. ఇదే సుప్రీంకోర్టు తీర్పునకు గట్టి ప్రాతిపదిక కల్పించింది), హిందూ సోదరులు మాత్రం అయోధ్యలోని వివాదాస్పద ప్రాంతం రామ జన్మస్థలం అని బలంగా నమ్ముతున్నందువల్ల, ఇతర దేవాలయాల విషయంలో అలాంటి డిమాండును చేయబోమన్న ప్రాతిపదికన భారీ స్థాయి రామాలయాన్ని నిర్మించుకోవడానికి గాను వివాదాస్పద స్థలాన్ని హిందువులకు సంతోషంగా అప్పగిస్తామని లేదా కనీసం దానికి సంసిద్ధతను తెలుపుతామని చెబుతూ ఆనాడు ముస్లిం పక్షం తన ముందుకు వచ్చిన ఆ ప్రతిపాదనను ఆమోదించి ఉంటే తదనంతర భారత సామాజిక చరిత్రలో ఏం జరిగి ఉండేది లేక ఏం జరిగి ఉండదు అనేది మన ఊహకు కూడా అంది ఉండదు.

మత ఘర్షణలు దాని ఫలితమే!

అయితే ముస్లిం పక్షం ఆనాడే అలా అంగీకరించి ఉన్నట్లయితే, అయోధ్య రామాలయం, బాబ్రీమసీదు వివాదం శాశ్వత ప్రాతిపదికన శాంతియుతంగా ముగిసిపోయి ఉండేది. అంతేకాకుండా 1980ల నాటి నుంచి మనం దేశవ్యాప్తంగా చూస్తూ వస్తున్న మతపరమైన ఘర్షణలు తగ్గుముఖం పట్టి ఉండేవని ఘంటాపథంగా చెప్పవచ్చు. దీనివల్ల జరిగి ఉండే మరో ముఖ్య ఫలితం ఏదంటే, భారతీయ జనతా పార్టీ కానీ సంఘ్ పరివార్ కానీ ఈనాడు ఇంత ప్రతిష్టను సాధించి ఉండవు. భారత రాజకీయాల్లో, సమాజంలో ఇప్పుడున్నంత ప్రాధాన్యతా శక్తిగా అవి తయారై ఉండవు.

నిజానికి ఆనాడు ముస్లింలు ఆ పని చేసి ఉంటే.. త్యాగాన్ని, సహనాన్ని ప్రబోధించే భారతీయ నీతి సూత్రాలను గౌరవించిన వారుగా వారు ప్రశంసలు అందుకుని ఉండేవారు. ఇతరులకు ఇవ్వడం అనే గుణాన్ని ప్రదర్శించడం ద్వారా ముస్లింలు విజేతలై ఉండేవారు. ఆ రోజు వారు ఆ పని చేసి ఉంటే కనీసం రెండింట్లో ఒకటైనా మంచి ఫలితాన్ని తీసుకుని వచ్చి ఉండేది. కానీ ఇప్పుడు అందుకు అవకాశమే లేకుండా పోయింది. చరిత్రను మలుపు తిప్పే శిఖరాలవైపు గొప్ప దార్శనికత కలిగిన నాయకులు మాత్రమే తమ సామాజిక వర్గాలను నడిపించగలరు.

కానీ ఇప్పుడు సుప్రీంకోర్టు సరిగా కానీ తప్పుగా కానీ రాజీకి సంబంధించి మతపరమైన, రాజకీయపరమైన భూమికలను తోసిపుచ్చడమే కాకుండా తనుకు తానుగా మరొక రాజీ మార్గాన్ని ప్రతిపాదించింది. బాబ్రీమసీదును కూల్చివేయడం చట్టవిరుద్ధం అని నొక్కిచెబుతూ, అయోధ్య పట్టణంలోనే మసీదుకోసం కీలక ప్రాంతంలో అయిదు ఎకరాల స్థలం ఇవ్వాలన్నది సుప్రీంకోర్టు సూచించిన కొత్త రాజీ. అయితే ముస్లిం కమ్యూనిటీ నాయకత్వం ఈ రాజీ ప్రతిపాదనను ఆమోదించవచ్చు, లేక తిరస్కరించవచ్చు అని కూడా సుప్రీంకోర్టు సూచించింది.

ఒక మతాన్ని వేరుచేయడం ప్రమాదకరం

ఆ ప్రకారంగానే అయోధ్య వివాదం విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు సమీక్ష కోరనున్నట్లు తెలిపింది. ఇది దాని రాజ్యాంగ హక్కు కూడా. కానీ అదే సమయంలో సుప్రీంకోర్టు అయోధ్య కేసులో ముస్లిం పక్షానికి ప్రతిపాదించిన అయిదు ఎకరాల భూమిని ముస్లిం లాబోర్డు తిరస్కరించడానికి కూడా వీలుంది.

అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు భారతదేశంలోని ముస్లింలందరికీ ఏకైక సంరక్షక వ్యవస్థగా తన్ను తాను ప్రకటించుకుంటున్నట్లు కనిపిస్తుంది. పైగా షరియత్ వ్యవస్థపై దాని అజమాయిషీ అనేది భారత రాజ్యాంగం నుంచి దానికి ఒక విధమైన స్వతంత్రతను కలిగించింది. అందుకే షా బానో కేసు వంటి అంశాల్లో ఇది ముస్లిం కమ్యూనిటీపై భారం మోపింది. దేశంలో హిందుత్వ భావనలు అసాధారణంగా పెరిగిపోవడానికి కూడా ఇదే మూలం అని కూడా చెప్పాలి. 'ముస్లిం'లు సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకించడం కంటే హిందుత్వ సంస్థలకు, వారి భావజాలానికి మించిన బలం మరొకటి ఉండబోదనే చెప్పాలి. వీరి భావజాలానికి కీలకమైన అంశం ఏదంటే ముస్లిం కమ్యూనిటీని ఇతరుల నుంచి వేరుపర్చడమే. హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు ఈ దేశంలో క్రియాశీలకమైన పరిష్కారం కాని శత్రుత్వంగా మారిపోయాయి.

ఈ సందర్భంలో సుప్రీంకోర్టు ప్రతిపాదించిన కొత్త రాజీ మార్గాన్ని ముస్లింలు తిరస్కరించడం అంటే మేము వర్సెస్ వారు అనే ప్రస్తుతం బలపడిన భావాన్ని మరింతగా పెంచి పోషించడానికే ఉపయోగపడుతుంది. ఈ మేము వర్సెస్ వారు భావజాలం వల్ల బాధితులైనవారు ఉభయపక్షాల్లోనూ ఉంటున్నారు. కానీ ఇలాంటి ప్రతి సందర్భంలోనూ ఒక పక్షమే అధిక మూల్యాన్ని చెల్లిస్తూ వచ్చిందని తప్పక గమనించాలి.

వ్యాసకర్త ప్రొఫెసర్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

హేళన



"ఎలక్షన్ల ముందు పసుపు–కుంకుమ పేరుతో రూ. పది వేలు పంపిణీ చేసి ఐదు కోట్ల మందిని అవమానించింది తమరే కదా బాబు గారూ? ఇన్‌సైడర్ ట్రేడింగుతో అమరావతి ప్రకటన చేయడం ప్రజలను మోసగించడం కాదా? ఇసుక తుఫాన్‌లో గిర్రున తిరిగి పడ్డాక ఇంగ్లిష్ మీడియంపై గుండెలు బాదుకున్నాడు. ప్రజలు ఛీత్కరించేసరికి అసలు ఇంగ్లిష్ మీడియం ఆలోచనే తనదని యూటర్న్ తీసుకున్నాడు. బతుకంతా అవకాశవాదం, మ్యానిప్యులేషన్లే. పాతాళంలోకి జారిపోయిన మిమ్మల్ని ధర్మాడి సత్యం కూడా బయటకు లాగలేరు"

– విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

కృతజ్ఞతలు

"పార్లమెంటరీ ప్యానెల్ సభ్యురాలైన ప్రజ్ఞా ఠాకూర్.. గాంధీని హత్య చేసిన గాడ్సేని దేశభక్తుడని పార్లమెంటులోనే ప్రకటించారు. హేమంత కర్కరేని మరోసారి తూలనాడటానికి ముంబై ఉగ్రదాడుల ఘటనను వాడుకోనందుకు ఆమెకు కృతజ్ఞతలు చెప్పాల్సిందే"

– బర్ఖా దత్, సీనియర్ జర్నలిస్టు

ప్రత్యేకత

"పార్లమెంట్ ప్రవేశం దగ్గర ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆయన కళ్లు మూసుకుని ఉంటాడు. అదే మంచిది. అందుకే తన హంతకులను పొగిడే ప్రజ్ఞాలాంటివారు లోపలికి వెళ్లడాన్ని ఆయన చూడలేడు"

– మేఘనాథ్, కాలమిస్ట్

ఆశ

"న్యాయమూర్తి లోయ హత్య కేసును మహారాష్ట్రలోని కొత్త ప్రభుత్వం తిరిగి తెరుస్తుందా? బీమా కోరేగావ్ బాధితులకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తారా?"

– జేమ్స్ విల్సన్, సివిల్ ఇంజినీర్

శాంతి

"మొదట మసీదు తరఫున వాదించే లాయర్ రాజీవ్ ధావన్ రాముని జన్మస్థలాన్ని గుర్తించే మ్యాపును చించిపారేశారు. కానీ హిందువులు నిరసన తెలుపలేదు. హిందువులే శాంతికి విఘాతం కలిగిస్తున్నారని ఆయన అంటున్నారు. అయినా, హిందువులు తీవ్ర నిరసనలేమీ వ్యక్తం చేయలేదు. ఎందుకంటే హిందువులు శాంతికాముకులు"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

క్షమ

"దేశం మహాత్మాగాంధీ 150వ జయంతిని జరుపుకుంటుంటే, బీజేపీ ఎంపీ, ఉగ్రవాద ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్ఞాఠాకూర్ మాత్రం నిండు పార్లమెంట్‌లో గాడ్సేను అమరుడని కీర్తిస్తుంది. ప్రజ్ఞాపై చర్యలు తీసుకోవడంలో ప్రధాని మోదీ చూపిస్తున్న అలసత్వం గాడ్సే పాపపు చర్యను సమర్థిస్తున్నట్టు చెప్పకనే చెబుతోంది. దేశం మిమ్మల్ని క్షమించదు"

– రణదీప్ సింగ్ సూర్జేవాలా, కాంగ్రెస్ నేత

కలత



"ప్లీజ్.. ప్లీజ్.. ప్లీజ్. గాడ్సే పట్ల ప్రజ్ఞా ఠాకూర్ ప్రేమను చూసి కలత చెందకండి. గాడ్సే ఒక ఉగ్రవాది. ప్రజ్ఞా ఒక ఉగ్రవాదం కేసులో నిందితురాలు. గురుశిష్య పరంపరను ఆమె అలా కొనసాగిస్తోంది"

– గౌరవ్ గుప్తా, ఇంజినీర్

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి శు.విదియ రా.7.03 వరకు తదుపరి తదియ, నక్షత్రం జ్యేష్ఠ ఉ.9.05 వరకు, తదుపరి మూల వర్జ్యం సా.5.09 నుంచి 6.46 వరకు, దుర్ముహూర్తం ఉ.9.56 నుంచి 10.40 వరకు, తదుపరి ప.2.50 నుంచి 4.25 వరకు అమృతఘడియలు... రా.2.50 నుంచి 4.23 వరకు.

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

బడుగులకు ఇంగ్లిష్ కావాలి

సందర్భం

వసంత నాగేశ్వరరావు

ఇంగ్లిష్ భాషను నేర్చుకోవటం అంటే, తెలుగు భాషను వదిలేయమని అర్థం కాదు. ఇంగ్లిష్‌లో మాట్లాడటం అంటే, తెలుగులో మాట్లాడొద్దు అని ఆదేశించటమూ కాదు. తెలుగు కావాల్సిందే. కానీ ఇంగ్లిష్ కూడా తప్పనిసరిగా కావాలి. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో బోధన అత్యంత అవసరం. సమాజం ఆధునికత వైపు పరిగెడుతున్నప్పుడు, సరళీకరణ విధానాలు చేతివేళ్ళ సందుల్లోకి వచ్చి చేరుతున్నప్పుడు, స్వదేశంలోకి విదేశీ భాషలు వస్తున్నప్పుడు, ఇంగ్లిష్ భాషలో విశ్వవ్యాపిత గుర్తింపు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నప్పుడు మాతృభాషకు భంగం కలుగకుండానే ఇంగ్లిష్ భాషను నేర్చుకోవడంలో తప్పేంటి. మాతృభాషా ప్రేమికులు, తెలుగు భాషాభిమానులు, శతసహస్రావధానులు, తెలుగు పీఠాధిపతులు ఇంగ్లిష్ విద్య పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేయటం సహజమే. కానీ వారి పిల్లలు ఏ భాషలో చదువుతున్నారో తెలియపర్చాలి. ఇంగ్లిష్ భాషను వంట పట్టించుకోకుండా రాణిస్తున్నారో లేదో తెలియజేయాలి. అన్ని రంగాలలోవలే ప్రభుత్వ సెక్టారు తగ్గి, ప్రయివేట్ సెక్టారు వృద్ధి చెందుతున్న యుగం ఇది. అరచేతిలో ఆధునికతను గట్టిగా పట్టుకొని బతికేస్తున్న కాలం యిది. ఒకరి ఇష్టాయిష్టాలతో పనిలేకుండానే వ్యవస్థలన్నీ ఇంటి గుమ్మాల్లోకి వచ్చేశాయి. పగలు రేయి తేడా లేకుండా ఆధునిక వ్యవస్థల్లో సమస్త జనులు బతకక తప్పటం లేదు. ఆ వ్యవస్థలను అధ్యయనం చేయకుండా, అలాంటి వ్యవస్థలతో పోటీ పడకుండా విద్యావ్యవస్థల మనుగడ సాధ్యమా అలాంటి పోటీ తత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఆంగ్లమాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనాలు లేవా?

సర్కారు బడులంటే బడుగుల బడులు అని అర్థం. ప్రయివేట్ స్కూళ్ళు అంటే బడుగులు కానివారి, పై వర్గాలకు చెందినవారి పాఠశాలలు అని అర్థం. ఇప్పటి వరకూ సర్కారీ బడుల్లో తెలుగు భాషే ప్రామాణికం. ప్రయివేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమమే ప్రామాణికం. అంటే బడుగులు కాని పైవర్గాలకు చెందినవారి బిడ్డలు ఇంగ్లిష్‌లో విద్యాభ్యాసం చేస్తుంటే, బడుగుల పిల్లలు మాత్రమే తెలుగు భాషలో విద్యనభ్యసిస్తున్నారన్న విషయం కాదనని వారు లేరు. అయితే, సమాజంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు, గుర్తింపు ఏ భాషలో ఉన్నాయి స్వదేశీ ప్రమాణాలు, విదేశీ ప్రయాణాలు, స్వదేశీ విదేశీ కొలువులు ఏ భాషా ప్రాతిపదికన మెండైన అవకాశాలు దొరుకుతున్నాయి తెలుగు ఒక్కటే నేర్చుకోవటం వల్ల దేశ, విదేశాలలో అవకాశాలు నేటి తరానికి వస్తాయా పోనీ, తెలుగు భాషాసంయుక్త రాష్ట్రాలలో ప్రభుత్వ పాలన అంతా తెలుగులోనే నడుస్తుందా ప్రభుత్వాలు యిచ్చే జీవోలు, సర్కులర్లు, ఆదేశాలు తెలుగులోనే ఇస్తున్నారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరు, కోర్టు తీర్పులు, వాదోపవాదాలు తెలుగు మాధ్యమంలోనే జరుగుతున్నాయా, తెలుగు భాషలోకి మనకి తెలియకుండానే ఇంగ్లిష్ భాష పరకాయ ప్రవేశం చేయలేదా అచ్చమైన తెలుగు పదాలకు స్వస్తి చెప్పి ఇంగ్లిష్ మాటలను మనం మాట్లాడటం లేదా ప్రతి గ్రామంలోనూ, మండల కేంద్రాలలోనూ ప్రభుత్వ పాఠశాలలు ఒకటో లేదా రెండో ఉంటే, ఇంగ్లిష్ స్కూళ్లు, కాన్వెంట్లు పదుల సంఖ్యలో ఉంటున్న మాట నిజం కాదా ఏమాత్రం ఆర్థిక పరిస్థితి సహకరించిన క్రింది కులాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు సైతం ఇంగ్లిష్ మీడియం వైపు వెళ్ళటం లేదా, ఇంగ్లిష్ పాఠశాలల్లో చేరటం లేదా అలాంటప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ భాషను ప్రవేశపెడితే వచ్చే ఇబ్బందులు ఏమిటి, ప్రయోజనం ఎవరికి, ప్రమాదం ఎవరికి. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు, ఇంగ్లిష్ మాధ్యమ బోధనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను కట్టుదిట్టంగా అమలుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీనిని డిమాండ్ చేయటంలో ఏ తప్పు లేదు. ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడమే తప్పుగా, దీనివల్ల తెలుగు భాషకు ప్రమాదం వాటిల్లుతుందని వ్యాఖ్యానాలు చేయటం, అధైర్యపడటం అర్థరహితం. తెలుగు భాషా బోధన గూర్చి బలంగా మాట్లాడుతున్న తెలుగు భాషా ప్రేమికులు ముందుగా సర్కారు బడుల్లో ఆంగ్లమాధ్యమం వద్దు అని ప్రశ్నించే ముందు, అత్యధికంగా ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను నిలిపివేయాలని డిమాండ్ చేయవచ్చు కదా లేదా ఉద్యమించవచ్చు కదా లేదా ప్రభుత్వానికి వినతులు సమర్పించవచ్చు కదా పై వర్గాలవారి పిల్లలకు నిలయంగా ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధనను ప్రశ్నించకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోని బడుగుల పిల్లలకు ఇంగ్లిష్ బోధనను ప్రశ్నించటం వెనుక మతలబు ఏమిటి? ఇది సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధం కాదా! నిజానికి సర్కారు బడుల్లో ఇంగ్లిష్ బోధనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎప్పుడో జరగాల్సి ఉంది. అలా జరిగి ఉండి ఉంటే, ప్రభుత్వ పాఠశాలలు సైతం ఇప్పటికే ప్రయివేట్ పాఠశాలలతో పోటీపడి ఉండేవి. అలా జరగనందునే ఇంగ్లిష్ భాషపై కొంతమందికే 'పేటెంట్ రైట్స్' వచ్చాయి. ఇప్పటికైనా ఏపీలో వైయస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధనకు జీవో తీసుకు రావటం అభినందనీయం. రాష్ట్ర కేబినెట్ కూడా ఆమోద ముద్ర వేసింది. ఈ పరిణామాలతో రాష్ట్రంలోని అన్ని విపక్ష పార్టీలు 'తెలుగు ఉద్ధారకులు'గా ముందుకు వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధన ప్రవేశపెట్టడాన్ని మతమార్పిడులతోను, క్రిష్టియన్ మతవ్యాప్తితోను ముడిపెట్టి ప్రభుత్వంపై నిందలు వేయటం ఏమాత్రం సరియైనది కాదు. అలాంటప్పుడు ప్రయివేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధన క్రిష్టియన్ మతవ్యాప్తికి దోహదపడుతుందని ఒప్పుకోవాలి కూడా. ఈ చర్య వల్ల నష్టమేదైనా జరిగితే ఇంగ్లిష్ పాఠశాలలకే. ప్రయివేట్ పాఠశాలల్తో పోటీతత్వం పెరిగి ప్రభుత్వ పాఠశాలలు కూడా వృద్ధి చెందుతాయి. విద్యార్థులు రాక పాఠశాలలు మూతపడే దయనీయ దుస్థితి తొలగిపోతుంది. ఏదైనా ఒక కొత్త విధానం తీసుకువచ్చినప్పుడు సందేహాలు, అసంతృప్తులు వస్తుంటాయి. కానీ నింపాదిగా, క్షుణ్ణంగా, హేతుబద్ధంగా ఆలోచన చేస్తే, రాజకీయ కోణాలను విడనాడితే, కొత్త విధాన సత్సంకల్ప ప్రయోజనం అర్థమవుతుంది. ఏమైనా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధనను పై వర్గాలవారు తప్ప, క్రింది కులాలకు చెందినవారు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థినీ విద్యార్థులు వ్యతిరేకించటంలేదు అనే సత్యాన్ని మరచిపోవద్దు. ఆంగ్ల విద్యపై రాద్ధాంతం చేసేవారంతా వారి వారి ఇళ్ళలో, దైనందిన కార్యక్రమాల్లో ఇంగ్లిష్‌ను నేర్చుకున్న వాళ్ళే అన్న సంగతి మరువవద్దు.



వ్యాసకర్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోమ్ శాఖామాత్యులు । మొబైల్ : 99494 11779

స్వభావం

ప్రతి మనిషికీ తనదైన స్వభావం ఒకటి ఉంటుంది. ఆ స్వభావం ద్వారానే సమాజంలో గుర్తింపు వస్తుంది. ఫలానా వ్యక్తి మొండి ఘటం అని, ఎవరు చెప్పినా మాట వినే రకం కాదని అంటుంటాం. మరొకరిని మెతక స్వభావమని, ఎవరు అలా చెబితే అలా చేస్తాడని, సొంత ఆలోచనే ఉండదనీ అంటుంటాం. ఇలాంటివి ఆ వ్యక్తుల స్వభావాన్ని తెలియజేస్తాయి. బాల్యంలో పిల్లలపై తల్లిదండ్రుల స్వభావం, ప్రభావం ఉంటుంది. ఎదిగేకొద్దీ తన చుట్టూ ఉన్న సామాజిక వాతావరణం నుంచి కొన్ని లక్షణాలు వస్తాయి. పెద్దయ్యేకొద్దీ గురువుల నుంచి తెలుసుకున్న విషయాలతో, తన ప్రయత్నంతో వ్యక్తి కొన్ని విశిష్ట లక్షణాలను పెంపొందించుకుంటాడు. దీన్నే వ్యక్తిత్వం అంటాం.

మనిషి ఎప్పటికప్పుడు తన వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకుంటూ ఉండాలి. తనను తాను విమర్శించుకుంటూ ఉండాలి. తనలోకి తాను తొంగి చూసుకోవాలి. తన స్వభావం ఎదుటి మనసును బాధపెడుతోందా, తన మాటలవల్ల, చేతలవల్ల ఇతరులకు సంతోషం కలుగుతోందా లేక విచారం కలుగుతోందా అని తనతో తాను భాషించుకోవాలి. పెద్దలెవరైనా తనలోని లోపాలను చెప్పినప్పుడు అహంతో నిర్లక్ష్యంగా ప్రవర్తించరాదు.



జ్యోతిర్మయం

మహా భారతంలో యుద్ధం వల్ల వచ్చే నష్టాలను చెబుతూ, యుద్ధం వద్దని, సంధి చేసుకొమ్మని భీష్మ, ద్రోణాదులు, శ్రీకృష్ణుడు వంటి పెద్దలు ఎంత చెప్పినా దుర్యోధనుడు తన అహంపూరిత స్వభావాన్ని మార్చు కోలేదు. ద్రౌపది కృష్ణుడితో అందరూ చెప్పేకొద్దీ దుర్యోధనుని దురహంకారం మరింత ఎక్కువవుతుంది కానీ అతను మారడు అంటుంది కూడా. ఫలితం, యుద్ధం జరిగింది. అంతులేని జన నష్టం జరిగింది. దుర్యోధనుడు ఘోర మరణం పాలయ్యాడు. వ్యక్తి స్వభావం మంచిదైతే నలుగురూ దగ్గరకు చేరతారు, గౌరవిస్తారు. తమకంటే పెద్దవారి, విద్యావంతుల స్వభావాన్ని ఆదర్శంగా తీసుకోవటం, తమలోని చెడు లక్షణాలను గుర్తించి మార్చుకోవటానికి ప్రయత్నించటం ఆత్మన్యూనత ఎన్నటికీ కాదు. మంచిమాట తీరు, చెరగని చిరునవ్వు, సహాయ గుణం, శ్రమ తత్వం, నిజాయితీ, చేసే పనిలో అంకితభావం ఉత్తమ స్వభావానికి లక్షణాలవుతాయి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 28-11-2019

అన్నిటికి స్త్రీలే కారణం - కె.భాగ్యరాజా

'కరుత్తుగళై పదివు సెయ్' చిత్రం ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో భాగ్యరాజ్ వివాదాస్పద వ్యాఖ్యలు

దిగ్భ్రాంతికర ప్రేలాపనలు

పురుషులు పెట్టుకునే వివాహేతర సంబంధాల కన్నా, స్త్రీలు పెట్టుకునే వివాహేతర సంబంధాలు భయంకరమైన పరిస్థితులకు దారి తీస్తాయని, ఆఖరికి.. పిల్లలు, భర్త ప్రాణాలను సైతం అలాంటి మహిళలు ఫణంగా పెడతారని తమిళ దర్శక దిగ్గజం కె.భాగ్యరాజ్ అనడంపై ఇప్పుడు పెద్ద వివాదమే రాజుకుంది. అభ్యంతరకరమైన అతడి వ్యాఖ్యలపై మహిళాలోకం మండిపడుతోంది.

యావద్దేశాన్ని షాక్‌కి గురిచేసిన ఘటన ఒకటి ఈ ఏడాది ఫిబ్రవరిలో తమిళనాడులోని పొల్లాచ్చిలో బయటపడింది. ఇప్పుడు మళ్లీ దేశం మొత్తాన్నీ దిగ్భ్రాంతికి, ఆగ్రహావేశాలకు లోను చేసిన ఘటన ఒకటి నిన్న అదే తమిళనాడులోనే జరిగింది! రెండిటికీ ఉన్న సంబంధం.. 'కరుత్తు గళై పదివు సెయ్' అనే తమిళ సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్.

ఈ సినిమా కథకు మూలం పొల్లాచ్చి ఘటన. ఒక గ్యాంగ్ గత రెండేళ్లుగా ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా అమాయకులైన స్కూలు బాలికల్నీ, కాలేజీ అమ్మాయిల్నీ, మహిళా టీచర్‌లనీ వలపన్ని బ్లాక్‌మెయిల్ చేస్తూ లోబరుచుకోవడం పొల్లాచ్చి ఘటన అయితే, మంగళవారం చెన్నైలోని ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో ఒకప్పటి దర్శక దిగ్గజం కె. భాగ్యరాజ్.. మహిళలపై తీవ్రమైన ఆరోపణలు చేయడం తాజా ఘటన. ''అసలు ఇలాంటి నేరాలు మహిళల వల్లే జరుగుతున్నాయి'' అని ఆయన అన్నారు! స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియా అకౌంట్‌లు అందుబాటులోకి వచ్చాక పెరిగిన అక్రమ సంబంధాలకు, అవినీతి వ్యవహారాలకు మహిళలే ప్రధాన కారణం అని కూడా భాగ్యరాజ్ అన్నారు. అంతేకాదు, పురుషులు పెట్టుకునే వివాహేతర సంబంధాల కన్నా, స్త్రీలు పెట్టుకునే వివాహేతర సంబంధాలు భయంకరమైన పరిస్థితులకు దారి తీస్తాయని, ఆఖరికి.. పిల్లలు, భర్త ప్రాణాలను సైతం అలాంటి మహిళలు ఫణంగా పెడతారని అన్నారు! దీనిపై ఇప్పుడు పెద్ద వివాదమే రాజుకుంది.

నిజానికి అది ఆడియో ఫంక్షన్‌లా లేదు. పని కట్టుకుని మహిళల్ని దూషించడానికి భాగ్యరాజా ఈ ఆడియో ఫంక్షన్‌ను అడ్డుపెట్టుకున్నారా అనే సందేహం కలిగించేలా ఆయన కామెంట్స్ చేశారు. ఒక తమిళ సామెతను కూడా ఈ సందర్భంగా చెప్పారు. ''ఊసి ఇదమ్ కుడుకామ నూల్ నొనాదు'' (సూది కనుక సందు ఇవ్వకపోతే దారం అందులోకి దూరలేదు) అన్నారు. ''ఆడవాళ్లు చనువిస్తేనే మగవాళ్లు చొరవ చూపుతారు. అలాంటప్పుడు మగవాళ్లనెందుకు తప్పు పడతాం? పురుషుడు తప్పు చేస్తే ఆ తప్పు అతడితోనే ఉండిపోతుంది. స్త్రీ తప్పు చేస్తే అది కుటుంబం మొత్తానికీ చుట్టుకుంటుంది.ఉదాహరణకు మగాడు 'చిన్నింటి' కోసం ఏదైనా చెయ్యనివ్వండి, ఎంతైనా ఖర్చుపెట్టనివ్వండి, తన భార్యకు ఏ కష్టమూ రానివ్వడు. ఏ ఇబ్బందీ కలిగించడు. అదే స్త్రీ ఒక అనైతిక సంబంధం పెట్టుకుంటే బిడ్డల్నీ, భర్తనీ చంపేస్తుంది'' అని తీవ్రాతి తీవ్రమైన విమర్శలతో మహిళల్ని భాగ్యరాజ్ కించపరిచారు. 20 నిమిషాల తన ప్రసంగం మొత్తం మహిళల నైతికతను శంకించేందుకు ప్రోత్సహించేలా మాత్రమే సాగింది.

''తండ్రి తన కూతురికి ఆమె భ్రద్రత కోసం సెల్‌ఫోన్ కొనిస్తాడు. కూతురు ఆ సెల్‌ఫోన్‌తో చాటింగ్ చేస్తూ తనే స్వయంగా ప్రమాదంలోకి కూరుకుపోతుంది'' అని ప్రసంగాన్ని ముగించారు. ఆడియో ఫంక్షన్‌లో భాగ్యరాజ్ మాట్లాడిన ప్రతి మాటకూ చప్పట్ల వర్షం కురిసింది. అయితే కొన్ని గంటల తర్వాత దేశవ్యాప్తంగా అతడిపై తిట్లు, చీత్కారాల వడగండ్లు మొదలయ్యాయి. భాగ్యరాజ్ ఉద్దేశాలు జీర్ణం చేసుకోడానికి అంత టైమ్ పట్టిందంటే అతడెంతగా ఒళ్లు మరిచి మాట్లాడాడో అర్థం చేసుకోవచ్చు.

అన్నిటికన్నా దారుణాతిదారుణమైన మాట.. స్త్రీలే తమపై అఘాయిత్యానికి పురుషుల్ని ప్రేరేపిస్తారట!! భాగ్యరాజ్ తమిళంలో అన్న ఈ మాటలన్నీ సోషల్ మీడియాలో అన్ని భాషల్లోకీ నెమ్మది నెమ్మదిగా తర్జుమా అవుతున్న కొద్దీ ఆగ్రహ జ్వాలలు అన్నివైపుల నుంచి ఆయన్ని చుట్టుముట్టడం ప్రారంభమైంది.

ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇప్పటికే తమిళనాడు మహిళా కమిషన్‌కు ఒక లేఖ రాశారు. ''అతడి పురుషాహంకార, స్త్రీద్వేష వ్యాఖ్యలపై, ఆమోదయోగ్యం కాని అతడి ధోరణిపై తక్షణం చర్య తీసుకోవాలి'' అని పద్మ ఆ లేఖలో కోరారు. ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద కూడా భాగ్యరాజ్ కామెంట్లపై ఆవేదన వ్యక్తం చేశారు. ''అసలు ఇలాంటి కామెంట్ల వల్లే అమ్మాయిలు చనిపోతున్నారు'' అని ఆమె ట్వీట్ చేశారు.

సినీ దర్శకుడు, నటుడు, రచయిత, సంగీత దర్శకుడు, నిర్మాత అయిన కృష్ణస్వామి భాగ్యరాజ్‌కు మహిళల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన తీసిన 'ముంధనై ముడిచ్చు', 'చిన్నవీడు' వంటి చిత్రాలలో ఔన్నత్యం గల మహిళల పాత్రలు కనిపిస్తాయి. అలాంటిది 66 ఏళ్ల వయసులో భాగ్యరాజ్ ఇలా ఎందుకు మాట్లాడినట్లు?! దానికి ఎవరూ సమాధానం చెప్పలేరు. ఒక్క భాగ్యరాజ్ తప్ప. అయితే అతడు నోరు విప్పాలని ఎవరూ అనుకోవడం లేదు.

చెప్పి చెప్పి అలసిపోయాం

''రేప్ జరగడానికి కారణం స్త్రీలే' అని స్త్రీలను నిందించడం మానేయమని పెద్ద స్థాయిలో ఉన్నవాళ్లకు చెప్పి అలసిపోయాం. 'నూది అనుమతిస్తేనే, దారం లోపలకి వచ్చింది' అనే తరహాలో మాట్లాడటం దయచేసి మానేయండి ప్లీజ్. ఈ ఆలోచనా విధానం వల్ల చాలామంది అమ్మాయిలు చనిపోతున్నారు. ఇండస్ట్రీలో ఉన్న పెద్దవాళ్లే రేప్‌కి కారణం స్త్రీలు అంటున్నారు'' అని గాయని చిన్మయి ట్వీట్ చేశారు. భాగ్యరాజా మాట్లాడిన వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేసి, తన అభిప్రాయాన్ని ఆమె వెలిబుచ్చారు. అలాగే భాగ్యరాజా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ట్వీట్ చేసిన కొందరి ట్వీట్లను కూడా చిన్మయి రీట్వీట్ చేశారు.

చిన్మయి
గాయని

మనువాద ప్రతినిధి

అతను ఈ రకమైన కామెంట్ చేయడం అవగాహన లేమి. మాతృ పరంపరను గుర్తించిన ద్రవిడ సంస్కృతిని అర్థం చేసుకోనితనం. అతను మనువాద, పితృస్వామ్య ప్రతినిధిగా మాట్లాడుతున్నాడు. కట్నంకోసం పురుషులు వివాహేతర సంబంధాలు పెట్టుకోవడం, కట్నం కోసం ఆడవాళ్లను చంపడం గురించి ఎందుకు మాట్లాడరు? నేరం ఎవరు చేసినా నేరమే! ఆడవాళ్ల మీద మగవాళ్లు వ్యవస్థీకృతంగా చేస్తున్న దారుణాలు, హింస గురించి ఎందుకు మాట్లాడరు? సెల్‌ఫోన్లు తప్పు అయితే మొత్తానికే తీసిపారేయండి అంతే కాని అది ఆడవాళ్ల దగ్గరుంటే తప్పు.. మగవాళ్ల దగ్గరుంటే కాదా?

- దేవి, సామాజిక కార్యకర్త

తప్పు వాళ్లది కాదు

స్త్రీలు, పురుషులతో సమానంగా హక్కులు పొందడం, అన్ని రంగాల్లో వాళ్ల సమస్థాయిలో ఉండడం మగవాళ్లకు మింగుడుపడ్డంలేదు. తప్పు వాళ్లది కాదు.. మనువాద సంస్కృతిలో పుట్టి పెరిగి.. దాన్నే జీర్ణించుకున్నారు కాబట్టి ఇలాంటి మాటలే మాట్లాడ్తారు. మనువాద సంస్కృతి ప్రభావం వల్ల స్త్రీ ఎదుగుదల పరిస్థితులు వాళ్లకు అర్థం కావు.అర్థమయ్యేలా చేయాల్సిన పాలక, పోలీస్, న్యాయ వ్యవస్థలూ తమ పాత్ర సరిగ్గా పోషించట్లేదు.సెల్‌ఫోన్.. అందరికీ అందుబాటులో ఉండే కమ్యూనికేషన్ టూల్. పెరిగిన అవసరాల్లో అది అందరికీ అత్యంత అవసరం. దానికి, స్త్రీల ప్రవర్తనకు లింక్ పెట్టడమేంటి? ఆయన అజ్ఞానం, అహంకారం బయటపడ్డం తప్ప ఇంకేం లేదు. ఈ దుస్థితి పోవాలంటే సమాజంలో సమూలమైన మార్పు రావాలి. స్త్రీ, పురుష సమానత్వం గురించి రాజ్యాంగం చెప్పిన విషయాలను.. అసలు ఆ మాటకొస్తే రాజ్యాంగం కచ్చితంగా అమలయ్యేలా చూస్తే చాలు.. ఇలాంటి అభిప్రాయాలు, మాటలు వినిపించవు.

- గెడ్డం ఝాన్సీ
నేషనల్ కన్వీనర్, దళిత స్త్రీ శక్తి

సీరియస్‌గా తీసుకోవాలి

భాగ్యరాజ్ ఒక ఫిలిం డైరెక్టర్‌గా కాదు.. ఒక ఖాప్ పంచాయత్ లీడర్ కన్నా దిగజారి చాలా చవకబారుగా మాట్లాడాడు. గతంలో కొందరు రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆందోళనకు, ఉద్రిక్తతకు దారితీసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. దేశంలోని మహిళలంతా సీరియస్‌గా తీసుకోవాలి. పెద్ద ఎత్తున నిరసన లేవదీయాలి. పవర్‌ఫుల్ మీడియాలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నాడంటే అతని బుర్రలో బూజుంది. ఈ మనిషి ఎలాంటి సినిమాలు తీస్తాడు? ఏమైనా చెప్పాలనుకుంటే మగపిల్లలకు చెప్పాలి కాని ఆడవాళ్ల మీద ఈ బూజు పట్టిన అభిప్రాయాలేంటి? మహిళల గురించి పనికిమాలిన మాటలు మాట్లాడే ఈ మనిషి ఆధునిక సమాజంలో ఉండదగ్గ వ్యక్తి కాదు.. నేలబారుగా వెనక్కి పాక్కుంటూ వెళ్లాలి. వదిలిపెట్టకూడదు. అక్కడున్న మహిళలంతా అతని మీద కేసులు పెట్టాలి. ఇదివరకు ఇక్కడా చలపతిరావు ఇలాగే మాట్లాడితే కేసులు పెట్టి ముప్పుతిప్పలు పెట్టాం. ఎన్నో ఆకాంక్షలతో బయటకు వస్తున్న స్త్రీలను మళ్లీ నాలుగ్గోడల మధ్యకు నెట్టే కుట్ర తప్ప ఇంకోటి కాదు ఇది. కాబట్టి దేశంలోని మహిళలంతా దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి.. అన్ని మీడియమ్స్ ద్వారా.. అన్ని పద్ధతుల్లో నిరసన తెలియజేయాలి.

- కొండవీటి సత్యవతి, భూమిక పత్రిక ఎడిటర్

భాగ్యరాజ్ చూపిన స్త్రీలు

కె.భాగ్యరాజ్ తన గురువు కె.భారతీరాజా తీసిన 'ఎర్రగులాబీలు' సినిమాకు కథ అందించాడు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యింది. స్త్రీల వంచన వల్ల మోసపోయిన మగవారు ఆ స్త్రీల మీద పగ తీర్చుకోవడానికి 'సైకో'లుగా మారే కథ ఇది. తమిళనాడులో 1960ల నాటి సైకో కిల్లర్ రమణ్ రాఘవ్‌ను ఈ కథకు ఇన్‌స్పిరేషన్‌గా తీసుకున్నారు. ఎర్రగులాబీలలో ఒక సవతి తల్లి, కాలేజీ అమ్మాయి, గృహిణి మగవారిని వంచించడం కనిపిస్తుంది. భాగ్యరాజ్ తీసిన మరో ముఖ్యమైన సినిమా 'అంద ఏళు నాట్కల్' (ఆ ఏడు రోజులు) స్త్రీ హృదయానికి, సంప్రదాయానికి మధ్య జరిగే సంఘర్షణను చూపిస్తుంది. ఈ సినిమాలో తను ప్రేమించిన అబ్బాయిని చేసుకునే వీలు లేక అంబిక మరో వ్యక్తిని వివాహం చేసుకుంటుంది. కానీ ఆ పెళ్లి నుంచి బయటపడాలనుందని తన ప్రియుణ్ణి పెళ్లి చేసుకోవాలని ఉందని శోభన నాడే భర్తకు చెబుతుంది. ఆ భర్త ఆ ప్రియుణ్ణి వెతుకుతాడు. కానీ ఆ ప్రియుడు ఆమెను వివాహం చేసుకోవడానికి అంగీకరించడు. ఆమె పట్ల తనకు చాలా ప్రేమ ఉన్నా భారతీయ సంప్రదాయంలో తాళికి చాలా విలువ ఉందని, ఒకసారి తాళి కట్టించుకున్న స్త్రీ మరొకరి సొంతం కాజాలదని చెప్పి వెళ్లిపోతాడు. ఈ సినిమా తెలుగులో 'రాధా కల్యాణం'గా రీమేక్ అయ్యింది. ఈ సినిమాయే ఆ తర్వాత 'మౌనరాగం', 'హమ్ దిల్ దే చుకే సనమ్' సినిమాలకు ఆధారం అయ్యింది. 'చిన్న వీడ్' సినిమా 'స్త్రీ సహనాన్ని' చూపిస్తుంది. ఇందులో హీరోగా వేసిన భాగ్యరాజ్ పెళ్లయిన తర్వాత తన భార్య స్థూలకాయంతో ఉందని మరొకరితో సంబంధం పెట్టుకుంటాడు. ఈ సంగతి భార్యకు తెలుస్తుంది. అయితే ఆమె అతనితో ఘర్షణకు దిగకుండా, అతనితో వేరు పడకుండా ఎంతో ఓపికగా ఉండి మనసు మార్చుకుంటుంది. ఈ సినిమాయే కమలహాసన్ 'సతీ లీలావతి'గా, నిన్న మొన్న అల్లరి నరేశ్ 'కితకితలు'గా వచ్చింది. భాగ్యరాజ్ తీసిన 'ముందానై ముడిచ్చు' సినిమా తెలుగులో 'మూడుముళ్లు'గా వచ్చింది. ఇందులో భార్య చనిపోయి ఒక బిడ్డకు తండ్రిగా ఉన్న చంద్రమోహన్ ఒక పల్లెటూళ్లో స్కూల్ టీచర్‌గా పని చేస్తుంటాడు. రెండో పెళ్లి చేసుకుంటే ఆ వచ్చిన భార్య సవతి తల్లిగా తన బిడ్డను ఏ బాధలు పెడుతుందోనని పెళ్లే చేసుకోనంటాడు. కానీ అతని మీద ప్రేమ పెంచుకున్న ఆ ఊరి అమ్మాయి రాధిక అతన్ని ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని చివరకు అతని కోసం పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసుకోవడానికి కూడా సిద్ధమై పోతుంది. ఆమెను హాస్పిటల్‌లో నిస్సహాయ స్థితిలో చూసిగానీ ఆమె ప్రేమను నమ్మడు చంద్రమోహన్. 'చిన్నరాజా' సినిమాలో సవతితల్లి ఆస్తి కోసం భర్త నడుములు విరిగేలా చేస్తుంది. సవతి కొడుకును ఉత్త వెంగళాయిగా పెంచుతుంది. చివరకు పాలలో విషం కలిపి అతడి వారసుణ్ణే చంపాలనుకుంటుంది. ఆ సంగతి తెలిసినా సవతి తల్లి మీద నమ్మకంతో ఆమె క్షేదుటే ఆ పాలు తాగుతాడు భాగ్యరాజ్. అతను చావుబతుకుల్లోకి వెళితే తప్ప ఆ సవతి తల్లిలో పరివర్తన రాదు. ఈ సినిమా తెలుగులో 'అబ్బాయిగారు'గా వచ్చింది. 'సుందరకాండ' సినిమాలో కేన్సర్ ఉన్న అమ్మాయి సుమంగళిగా చనిపోవాలని అనుకుంటుంది. వివాహితుడైన ప్పటికీ లెక్చరర్‌ను పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. ఆమె చనిపోతుందని తెలిసి ఆ లెక్చరర్ భార్య ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోమని భర్తతో చెబుతుంది. అయితే ఈలోపే ఆ అమ్మాయి మరణిస్తుంది.

భాగ్యరాజ్ సినిమాలలో హీరోను హీరోయిన్లు యథాతథంగా స్వీకరించాల్సిన స్థితి ఉంటుంది. అతడి 'డార్లింగ్ డార్లింగ్'లో హీరోయిన్ శ్రీమంతురాలు, హీరో వాచ్‌మన్ కొడుకు. ఆమెకు అతని మీద ఏ అభిప్రాయమూ లేకపోయినా చిన్నప్పటి నుంచి ఆమెను ఆరాధిస్తున్న హీరో తన ఆరాధనను తెలిసేలా చేసి పెళ్లి చేసుకుంటాడు. 'రాస కుట్టి' సినిమాలో హీరో పల్లెల్లో అల్లరి చిల్లరగా తిరుగుతూ డాక్టర్ గెటప్‌లో, లాయర్ గెటప్‌లో ఫొటోలు దిగి కాలక్షేపం చేస్తుంటాడు. అతడు విద్యాధికుడు అని నమ్మిన హీరోయిన్ చివరకు ఆ మోసం తెలిసి నిరాకరిస్తుంది. కానీ హీరో ఇలాంటి షోకిల్లారాయుడైనా హీరోయిన్ చివరకు అతణ్ణే పెళ్లి చేసుకోక తప్పని విధంగా హీరో క్యారెక్టర్ ఆ తర్వాత తీర్చిదిద్దబడుతుంది. ఈ సినిమా హిందీలో 'రాజాబాబు'గా రీమేక్ అయ్యి సూపర్ హిట్ అయ్యింది.

మొత్తంగా చూస్తే భాగ్యరాజ్ పితృస్వామ్య సంస్కృతిలో సగటు పురుషుడు స్త్రీని ఎలా చూస్తాడో చూడాలనుకుంటాడో అలా చూపడానికే ఎక్కువ ఇష్టపడ్డాడని అనిపిస్తుంది. అదే భావజాలం స్త్రీలకూ నూరిపోయబడ్డది కాబట్టి అతని సినిమాలన్నీ హిట్ అయ్యాయి.

చెట్టు నీడ

సముద్రపు ఒడ్డు

సముద్ర తీరాన ఓ కుర్రాడు ఆడుకుంటుండగా ఓ చెప్పు కనిపించకుండా పోయింది. అతను వెంటనే ఒడ్డున ఇసుకలో 'ఈ సముద్రం మహా దొంగ' అని రాశాడు.

కాస్తంత దూరంలో ఒక వ్యక్తి అదే సముద్రంలో వల వేసి బోలెడు చేపలు పట్టాడు. అతను ఆ రోజు తాననుకున్న దానికన్నా ఎక్కువ చేపలు దొరకడంతో.. 'ఈ సముద్రం గొప్ప దాత' అని రాశాడు.

అదే సముద్రంలో ఇంకొక వ్యక్తి ఈదుకుంటూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. దాంతో అతని తల్లి సముద్ర తీరాన 'ఈ సముద్రం తన కొడుకులాంటి ఎందరో అమాయకులను పొట్టన పెట్టుకున్న మహమ్మారి' అని రాసింది.

ఓ పెద్దతను సముద్రంలోకి వెళ్లి ముత్యాలు సేకరించి విజయవంతంగా ఒడ్డుకు చేరాడు. అతను సముద్ర తీరాన 'ఈ సముద్రం ఒక్కటి చాలు, నేను జీవితాంతం హాయిగా సుఖసంతోషాలతో బతికేస్తాను' అని రాశాడు.

అనంతరం ఓ పెద్ద అల వచ్చింది. వీరందరూ రాసిన మాటలను తుడిచిపెట్టేసింది.

మనమూ అంతే, ఇతరులు ఏవేవో చెప్పిన మాటలన్నింటినీ విని ఓ నిర్ణయానికి రాకూడదు. ఈ ప్రపంచాన్ని ఒక్కొక్కరూ ఒక్కో కోణంలో చూస్తారు. చేదు అనుభవం ఎదురైనప్పుడు ఎందుకు ఎలా జరిగిందోనని ఆలోచించి అడుగేయాలి.

- జగద్రేణు

బ్యూటిప్స్

నిగనిగలాడే చర్మానికి... నైట్ టైమ్ లోషన్

పగటి పూట కంటే రాత్రివేళలో తీసుకునే జాగ్రత్తలే చర్మాన్ని మరింత ఆరోగ్యవంతం చేస్తాయి. ఇందుకు ఇంట్లోనే నైట్‌క్రీమ్‌ను తయారుచేసుకుని ఉపయోగించవచ్చు.

- ఒక గిన్నెలో బాదం నూనె, తేనెమైనం(బీస్ వ్యాక్స్), కొద్దిగా రోజ్ వాటర్ వేసి బాగా కలపాలి. సువాసన రావడానికి ఒక చుక్క రోజ్ ఎసెన్స్ కూడా వేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని బాటిల్‌లో పోసుకుని, ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.
- రాత్రిపూట, మేకప్ తీసేసిన తర్వాత ఈ లోషన్‌ని కొద్దిగా వేళ్లతో తీసుకుని ముఖానికి సున్నితంగా మసాజ్ చేసినట్టుగా రాసుకోవాలి. తర్వాత టిష్యూ పేపర్‌తో లోషన్‌ను పూర్తిగా తుడిచేయాలి. అలాగే చేతులకూ, పాదాలకూ రాసుకుని వెచ్చని నీటితో కడుక్కోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల చర్మం పొడిబారదు. నిగనిగలాడుతూ కనిపిస్తుంది.

ప్రేమ.. పిచ్చి అలానే ఉన్నాయి!

అల్లు అర్జున్, సుకుమార్ స్నేహం 'ఆర్య' సినిమాతో మొదలైంది. 'ఆర్య'తో దర్శకుడిగా పరిచయం అయ్యారు సుకుమార్. ఆ సినిమా సూపర్ హిట్. ఆ తర్వాత వీళ్ల కాంబినేషన్‌లో 'ఆర్య 2' వచ్చింది. 'ఆర్య 2' సినిమా రిలీజ్ అయి బుధవారానికి పదేళ్లు అయింది. ఈ సందర్భంగా 'ఆర్య 2' జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు అల్లు అర్జున్. 'ఆర్య 2' సమయంలో దిగిన ఫొటో ఒకటి, ఇటీవల దిగిన సెల్ఫీ ఒకటి పోస్ట్ చేసి – ''సుక్కూ (సుకుమార్ నిక్‌నేమ్) జుట్టు రంగు మారింది. నా స్కిన్ మారింది. కానీ మా మధ్య ఉన్న ప్రేమ మారలేదు. మేమిద్దరం కలిసినప్పుడు ఉండే పిచ్చి మారలేదు. దాన్ని మళ్లీ త్వరలోనే చూడబోతున్నారు (వీళ్ల కాంబినేషన్‌లో తెరకెక్కబోతున్న మూడో చిత్రాన్ని ఉద్దేశించి)'' అని పేర్కొన్నారు అల్లు అర్జున్.

రజనీ 169 ఫిక్స్?

ఈ మధ్య కాలంలో రజనీ సినిమాలు చేస్తున్న స్పీడ్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారుతోంది. ఒక సినిమా రిలీజ్ అయిన వెంటనే మరో సినిమా సెట్స్ మీదకు తీసుకెళ్లడం, అది పూర్తయ్యేలోపే నెక్స్ట్ సినిమాకు ముహూర్తం పెట్టడం చేస్తున్నారాయన. మురుగదాస్ దర్శకత్వంలో రజనీ చేసిన 'దర్బార్' సంక్రాంతికి విడుదల కానుంది. ఈలోపు దర్శకుడు శివతో ఓ సినిమా కమిట్ అయ్యారు రజనీ. అది ఆయన కెరీర్‌లో 168వ సినిమా. ఈ సినిమా డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఇక రజనీ 169వ సినిమాను గౌతమ్ మీనన్ డైరెక్ట్ చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల గౌతమ్ మీనన్ చెప్పిన కథకు రజనీ ఇంప్రెస్ అయ్యారట. వేల్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై గణేశ్ ఈ సినిమాను నిర్మిస్తారట. పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వెళ్లేలోగా వీలైనన్ని సినిమాలు చేస్తాను అని ఓ సందర్భంలో చెప్పారు రజనీ. అందుకే ఈ స్పీడ్ అయ్యుండాలి.



తమన్నా

కొత్త ప్రయాణం

నటిగా 15 ఏళ్లుగా కొనసాగుతున్నారు తమన్నా. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో రకరకాల పాత్రలు చేశారు. కొన్నిసార్లు స్పెషల్ సాంగ్స్ చేశారు. ఇప్పుడు నటిగా ఓ కొత్త జర్నీ ఆరంభించారని తెలిసింది. ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తూ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తమన్నా ఎంట్రీ ఇస్తున్నారని సమాచారం. వికడన్ టెలీవిస్తాస్ నిర్మిస్తున్న ఓ వెబ్ సిరీస్‌లో లీడ్ రోల్ చేస్తున్నారు తమన్నా. ఈ వెబ్ సిరీస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది. ఈ సిరీస్ ఏ జానర్‌లో ఉండబోతోంది? ఎవరు దర్శకత్వం వహిస్తున్నారనే సమాచారం బయటకు రాలేదు. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ షూటింగ్ స్టేజ్‌లో ఉంది. ఇది కాకుండా హిందీలో 'బోల్ చుడియా' చిత్రీకరణలో పాల్గొంటున్నారు తమన్నా. తమిళంలో ఓ సినిమా కూడా కమిట్ అయ్యారు.

తిట్టించుకోకపోతే నాకు నిద్ర పట్టదు!

''బయట, సోషల్ మీడియాలో నాపై భిన్నమైన వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిజానికి నాకు బాగా తిట్టించుకోకపోతే నిద్రపట్టదు. నాలో అలాంటి బుద్ధి ఒకటి డెవలప్ అయ్యింది. ఎవరైనా పొగిడితే నాకు నిద్ర వస్తుంది'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. టైగర్ కంపెనీ ప్రొడక్షన్, అజయ్ మైసూర్ ప్రొడక్షన్ పతాకాలపై రామ్‌గోపాల్ వర్మ అందిస్తున్న చిత్రం 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు'. ఈ సినిమా రేపు విడుదల కానున్న సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ చెప్పిన విశేషాలు.

- నా కెరీర్‌లో నేను తీసిన తొలి సందేశాత్మక చిత్రం 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు'. ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిగారు ప్రమాణ స్వీకారం చేసినప్పటి పరిస్థితుల నుంచి ఈ సినిమా ఆలోచన వచ్చింది. 2019 మే 22 నుంచి సెప్టెంబరు 2020 కాలపరిమితిలో సినిమా ఉంటుంది. అంటే జరిగినవి, జరుగుతున్నవి తీయడంతో పాటు జరగబోయేవి కూడా ఊహించి తీసిన చిత్రం. రాజకీయ వ్యంగ్యంగా ఈ సినిమా ఉంటుంది. మారుతున్న రాజకీయ పరిస్థితుల ఆధారంగా ఈ సిరీస్‌ను కంటిన్యూ చేయవచ్చేమో!
- ఈ సినిమాలో మాజీ ముఖ్యమంత్రి పాత్ర వేయడానికి ఒకరు అవసరం అయ్యారు. ఆ పాత్ర కోసం ఆర్టిస్టును వెతుకుతున్నప్పుడు ఓ వ్యక్తిని నేను సోషల్ మీడియాలో చూశాను. నాసిక్‌లో వెయిటర్‌గా చేస్తున్నాడని తెలిసింది. అతన్ని పిలిపించి నటనలో శిక్షణ ఇప్పించాం.
- ఈ సినిమాలో ఏ వర్గం వారినీ హైలైట్ చేయలేదు. టార్గెట్ చేయలేదు. కొన్ని రియల్ లైఫ్ క్యారెక్టర్స్‌ను పోలి ఉన్న ఆర్టిస్టులను సినిమాలో తీసుకోవడం జరిగింది. దీంతో ఆడియన్స్ వారి ఆలోచనకు తగ్గట్లు ఊహించుకుంటున్నారు. అంతే కానీ నేను ఎవర్నీ టార్గెట్ చేయలేదు.
- 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రాన్ని ఎన్టీఆర్‌కు అంకితం ఇచ్చాం. 'కమ్మ రాజ్యంలో...'ని ప్రఖ్యాతిగాంచిన ఇద్దరు తండ్రీకొడుకులకు అంకితమివ్వాలనుకుంటున్నాను. ఈ సినిమా ఐడియా మాత్రమే నాది. టీమ్ అంతా కలిసి తీశాం. సెన్సార్ నుంచి టైటిల్‌పై అభ్యంతరం ఎదురైతే 'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు' అనే టైటిల్ అనుకుంటున్నాం.
- ఇప్పుడు గ్యాంగ్‌స్టర్, క్రిమినల్ కథల కన్నా పొలిటికల్ క్రిమినల్ స్టోరీసే ఆసక్తికరంగా ఉంటున్నాయి. మా కంపెనీ నుంచి రానున్న మరో చిత్రం 'బ్యూటీఫుల్' వచ్చే నెల 6న విడుదలవుతుంది. ఓ చైనీస్ కో-ప్రొడక్షన్ కంపెనీతో ఢలేడీ బ్రూస్‌లీ' సినిమా తీస్తున్నాం. నేను భక్తి సినిమాలు తీస్తే ప్రేక్షకులు ఒప్పుకోరేమో!.

ట్రైలర్‌లో పప్పు వడ్డించే సీన్ ఉంది? అభ్యంతరం తెలుపుతూ కాల్స్ వచ్చాయా?

నేను విన్నది ఏంటంటే ఈ సీన్ తెలుగు దేశంవారికి బాగా నచ్చిందట. అంటే తెలుగు దేశం వారు బయటకు చెప్పలేని విషయాన్ని నేను చెప్పినందుకు వారికి నచ్చిందేమో. ఆ సీన్ నచ్చిందని కొన్ని ఫోన్లు వచ్చాయి. అయినా ఓ తండ్రి తన కొడుక్కి ప్రేమగా పప్పు వడ్డిస్తాడు. ఈ సీన్‌ను ఏదోలా భావిస్తే నా తప్పు కాదు.

ఈ టీజర్‌లో 'బుడ్డోడు' అనే డైలాగ్ ఉంది? ఇది ఒక యాక్టర్ గురించి అంటారా?

అది మీరు సినిమాలో చూడండి.

కళ్లు పెద్దవి చేసి చూస్తే ఎవరూ భయపడరు? అని అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న వ్యాఖ్యలను అలాగే పెట్టారు..?

మనుషులు అన్నప్పుడు చూశారు. మరి ఇప్పుడు సినిమాలోని యాక్టర్ అంటే ప్రాబ్లమ్ ఏంటి? అల్రెడీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నదే కదా!

ఈ సినిమా జగన్‌మోహన్‌రెడ్డిగారికి ఫేవరబుల్‌గా ఉంటుందని కొందరి అభిప్రాయం?

అది కరెక్ట్ కాదు. జరగనిది ఊహించి ఒక భవిష్యత్‌ను తెరకెక్కించినప్పుడు ఎవరికీ ఫేవర్‌గా చూపించలేం. జరిగిన సంఘటనలు అయితే ఎవరు కరెక్ట్? ఎవరు కాదు? అని ఓ అంచనాతో ఉండొచ్చు. మరి జరగని దాని గురించి ఎలా ఫేవర్‌గా తీస్తారు?

జనసేన ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది?

సినిమాలో పవన్‌కల్యాణ్‌ను పోలి ఉన్న ఓ వ్యక్తి మనసేన అనే పార్టీ పెడతారు. ఈ 'మనసేన' పార్టీకి, జనసేనకు ఏ సంబంధం లేదు.

ప్రస్తుత మహారాష్ట్ర రాజకీయ పరిస్థితుల ఆధారంగా సినిమా తీసే ఆలోచన ఏమైనా ఉందా?

మరో 'సర్కార్' తీయాలని ఉంది.

ట్రైలర్‌లో స్నీకర్ నిద్రపోతున్నట్లు చూపించారు

నిజంగా జరిగి, పబ్లిక్ డొమైన్‌లో ఉన్న దాని గురించి కామెంట్ చేయడానికి ఎవరికైనా హక్కు ఉంటుందని నా అభిప్రాయం. అందరికీ తెలిసిన దాన్నే నేను సినిమాలో చూపించాను.

ఇది తాగుబోతుల సినిమా కాదు

''కొందరు ప్రేక్షకులకు కుటుంబ కథా చిత్రాలు నచ్చుతాయి. మరికొందరికి యాక్షన్, ఇంకొందరికి థ్రిల్లర్.. ఇలా డిఫరెంట్ జానర్ ఆడియన్స్ ఉంటారు. అన్ని రకాల ప్రేక్షకులను సంతృప్తి పరచేలా సినిమా తీయడం చాలా కష్టం. కానీ ఈ విషయంలో నా ప్రయత్న లోపం లేకుండా చూసుకుంటాను'' అన్నారు శేఖర్‌రెడ్డి. కార్తికేయ, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం '90 ఎంఎల్'. శేఖర్ రెడ్డి ఎర్ర దర్శకత్వంలో అశోక్‌రెడ్డి గుమ్మకొండ నిర్మించిన ఈ చిత్రం వచ్చే నెల 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శేఖర్ చెప్పిన విశేషాలు.

- నేను నల్గొండ జిల్లా లింగరాజుపల్లిలో పుట్టాను.. హైదరాబాద్‌లో పెరిగాను. ఆసక్తితో సినిమా రంగంవైపు వచ్చాను. చంద్రమహేశ్ గారి దగ్గర అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశాను. కొన్ని సినిమాలకు రచయితగా కూడా ఉన్నాను. నాలో డైరెక్షన్, రైటింగ్ ఇలా రెండు స్కిల్స్ ఉన్నాయి.
- '90ఎంఎల్' దర్శకుడినిగా నా తొలి సినిమా. టైటిల్ వినగానే ఇది లిక్కర్ నేపథ్యంలో సాగే చిత్రం అని కొందరు ఊహించుకుంటారు. కానే కాదు. ఇది తాగుబోతుల సినిమా కాదు. భావోద్వేగ అంశాలకు వాణిజ్యపరమైన అంశాలు జోడించి ఈ సినిమాను తెరకెక్కించాం. మంచి వినోదాత్మకంగా ఉంటుంది.
- తన పిల్లాడికి పాలు ఇవ్వాల్సిన తల్లికి.. లిక్కర్ ఇవ్వాల్సి వస్తే ఆ తల్లి మనసు ఎంత బాధపడుతుందో సినిమాలో చూపించాం. అంతేకానీ మందు సీన్లు పెట్టలేదు. మందు తాగమని ప్రోత్సహించే సన్నివేశాలను తెరకెక్కించలేదు.
- మందు తాగకపోతే బతకలేని ఓ డిజార్డర్ ఉన్న వ్యక్తి దేవదాసు పాత్రలో కార్తికేయ నటించారు. అసలు లిక్కర్ వాసన అంటేనే పడని ఓ కుటుంబంలోని అమ్మాయితో దేవదాసు ప్రేమలో పడతాడు. అప్పుడు ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకున్నాయన్న అంశాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి.
- తమిళంలో మా సినిమా టైటిల్‌తోనే ఓ సినిమా వచ్చింది. ఆ సినిమాకు, మా సినిమాకు ఏ సంబంధం లేదు. అలాగే మా '90 ఎంఎల్' చిత్రంపై 'ఆర్ఎక్స్ 100' సినిమా ప్రభావం పడదు. టైటిల్ వల్ల మా సినిమాకు ప్రేక్షకులు దూరంగా ఉంటారు అంటే నేను కాదనే అంటాను. ఎందుకంటే ఇప్పుడు మార్నింగ్ షో పడగానే కథ, సినిమా టాక్ బయటకు వచ్చేస్తుంది. మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది.
- నిర్మాత అశోక్‌రెడ్డిగారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. నా నెక్స్ట్ సినిమా గురించి ఇంకా ఏమీ అనుకోలేదు.

నన్ను స్టార్ అనొద్దు!

హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విలక్షణమైన పాత్రలు చేస్తూ మంచి నటుడిగా పేరు సంపాదించుకున్నారు నవాజుద్దీన్ సిద్ధిఖీ. అయితే తనను 'స్టార్' అని మాత్రం పిలవొద్దంటున్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ– ''నన్ను స్టార్ యాక్టర్ అని పిలవడం ఇష్టం లేదు. నా దృష్టిలో 'స్టార్, సూపర్‌స్టార్, మెగాస్టార్' అనే ట్యాగ్స్ మార్కెటింగ్ స్ట్రాటజీకి సంబంధించినవి. ఒక వేళ నన్ను నేను ఒక స్టార్‌గా భావించి గర్వపడితే నాకు తెలియకుండానే నాలోని నటుడి ఎదుగుదలకు నేను అడ్డుకట్ట వేసినవాణ్ణి అవుతాను. నా నటనా నైపుణ్యం కూడా మెల్లిగా తగ్గిపోతుంది. మూసధోరణి పాత్రలకు అలవాటు పడిపోతాను. ఒక్కసారి స్టార్ అనే ఛట్రంలో ఇరుక్కుపోతే విభిన్నమైన పాత్రలు చేయలేం. నటులు అన్ని రకాల పాత్రలు చేయాలనుకుంటారు. అందుకే నన్ను స్టార్ అని పిలవొద్దు'' అని పేర్కొన్నారు.

ఏడ ఉన్నావే...

శ్రీ మానస్, సమ్మోహన జంటగా తెరకెక్కిన చిత్రం 'పటారుపాళెం ప్రేమ కథ'. జె.ఎస్ ఫిలిమ్స్ పతాకంపై దొరైరాజు వూపాటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. బాలు ధాకే స్వరపరచిన ఈ సినిమాలోని 'ఏడ ఉన్నావే ఏడ ఉన్నావే..' అనే తొలి పాటను హీరో శ్రీవిష్ణు విడుదల చేసి, మాట్లాడుతూ– ''నన్ను సినిమా ఇండస్ట్రీకి పరిచయం చేసింది దొరైరాజుగారే. ఆయన దర్శకత్వంలో

వస్తున్న ఈ సినిమా పాటను విడుదల చేయడం సంతోషంగా ఉంది. పాట చాలా బాగుంది'' అన్నారు. దొరైరాజు మాట్లాడుతూ– ''పరువు హత్యల నేపథ్యంలో, కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాను'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: బాలు ధాకే, సమర్పణ: జిఎస్ రెడ్డి, నిర్మాతలు: వి.లతా రెడ్డి, వి. సౌజన్యా దొరైరాజు, బి.ఆర్. బాలు, కె. రామకృష్ణ ప్రసాద్.

మ్యాన్.. మ్యాడ్.. మనీ



సూర్య శ్రీనివాస్, అమృతా ఆచార్య హీరోహీరోయిన్లుగా రామకృష్ణ తోట స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఎం 3'. 'మ్యాన్ మ్యాడ్ మనీ' అనేది ఉపశీర్షిక. దర్శక-నిర్మాత రామకృష్ణ తోట మాట్లాడుతూ– ''కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా 'ఎం 3' చిత్రం కూడా ఆ కోవలోకే వస్తుంది. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. స్క్రీన్‌ప్లే ఉత్కంఠగా ఉంటుంది. సూర్య, అమృత బాగా నటించారు. సునీల్ కశ్యప్ మంచి సంగీతం అందించారు. ప్రేక్షకులకు నచ్చే అన్ని కమర్షియల్ అంశాలు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ఈ సినిమాకు శరత్ కొండూరు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
28-11-2019

కీళ్లకు వింటర్ తంటా

చలికాలం వస్తుందంటేనే పెద్ద వయసు వారికి ఒకింత వణుకు. ఈ వణుకు చలి వల్ల వచ్చేది కాదు. ఈ సీజన్‌లో వాళ్లలో కీళ్లనొప్పులు మరీ ఎక్కువవుతాయి. అంతేకాదు... గౌట్, ఆర్థరైటిస్ వచ్చే నొప్పులు వింటర్‌లో మరింతగా పెరుగుతాయి. దీనికి చాలా కారణాలే ఉంటాయి. ఉదాహరణకు ఎండాకాలంలోలా చలికాలంలో సూర్యరశ్మి తగ్గుతుంది. దాంతో ఎముకలకు కావాల్సిన విటమిన్-డి కూడా తగ్గడం లాంటి కారణాలూ ఇందుకు దోహదపడతాయి. ఈ సీజన్‌లో పెరిగే కీళ్లనొప్పులు, కారణాలు, వాటిని ఎలా అధిగమించాలో తెలుసుకొని జాగ్రత్త పడటం కోసమే ఈ కథనం.

చలికాలంలో కీళ్ల నొప్పులు రావడానికి ఎన్నో కారణాలు ఉంటాయి. వాటిలో కొన్ని ఇవి...

- బయటి వాతావరణం చల్లగా ఉండటంతో దేహంలోని చర్మానికి ప్రసరించే రక్తం తన వేడిని వెంటనే కోల్పోతుంది. పైగా వాతావరణంలో చల్లదనం కంటిన్యువస్‌గా ఉండటం వల్ల చర్మం ఉపరితల భాగాల్లో ఉండే రక్తనాళాలు మామూలు కంటే కాస్త ఎక్కువగా కుంచించుకుపోయినట్లవుతుంది. ఈ కండిషన్‌ను వాసో కన్‌స్ట్రిక్షన్ అంటారు. వాసో కన్‌స్ట్రిక్షన్ కారణంగా కాళ్లూ చేతులు, దేహ ఉపరితల భాగాలకు రక్త ప్రసరణ కాస్తంత తగ్గుతుంది. ఈ కారణంగా ఈ సీజన్‌లో ఏదైనా భాగంలో నొప్పి, వాపు, మంట (ఇన్‌ఫ్లమేషన్) వచ్చినా లేదా ఆర్థరైటిస్ వంటి జబ్బుల్లో వచ్చే నొప్పులైనా... అవి తగ్గడానికి కూడా కాస్తంత ఎక్కువ సమయమే పడుతుంది.
- ఇక శరీరంలోని ఉపరితల భాగాలకు సైతం రక్త సరఫరా (చాలా స్వల్పంగానైనా) ఒకింత తగ్గడం కారణంగా మామూలు నొప్పులతోపాటు కీళ్ల నొప్పులు సైతం మిగతా సమయాల్లో కంటే ఎక్కువగా ఉంటాయి.
- సాధారణంగా మన శరీరం ఎప్పుడూ 98.4 డిగ్రీల ఫారన్‌హీట్ ఉండేలా నిర్వహితమవుతుంటుంది. బయట చలి పెరిగిన కారణంగా ఒక్కో సారిగా ఇది 70 ప్లస్ లేదా 80 ప్లస్ డిగ్రీల ఫారెన్‌హీట్‌కు పడిపోతుంది. ఇలా ఉష్ణోగ్రత పడిపోవడంతో మన దేహ రక్షణవ్యవస్థలో భాగంగా చర్మంలోని నొప్పిని గ్రహించి మెదడుకు చేరవేసే భాగాలు (పెయిన్ సెన్సర్స్) మరింత తీవ్రంగానూ, ఎక్కువగానూ పనిచేయాల్సి వస్తుంది. ఇలా మన పెయిన్ సెన్సర్స్ మరింతగా చురుగ్గా ఎక్కువగా పనిచేస్తుండటంతో చిన్నదెబ్బ తగిలినా కూడా మనకు చాలా నొప్పిగా అనిపిస్తుంది.
- ఈ సీజన్‌లో మనకు తెలియకుండానే ఆర్థరైటిస్‌ను అదుపు చేసేందుకు అనువైన జీవనశైలిని మనం అనుసరిస్తుంటాం. ఉదాహరణకు మనం ఈ సీజన్‌లో చురుకుదనం తగ్గుతుంది. కాస్త మందకొడిగా ఉంటాం. దాంతో ఆర్థరైటిస్ వంటి జబ్బులకు మనకు తెలియకుండానే అవకాశం ఇచ్చేలా మన జీవనశైలి ఉంటుంది.
- ఈ సీజన్‌లో చలికి కీళ్లు బిగుసుకుపోవడం అన్నది చాలా సాధారణం. దాంతో వాటిల్లో కదలికలు బాగా తగ్గుతాయి. కదలికలు తగ్గిపోవడంతో ఎముకలకు రోజూ లభ్యమయ్యే వ్యాయామమూ దొరకదు. కీళ్లకు రక్తప్రసరణ వ్యవస్థ వల్ల గాక... మన వ్యాయామం, శరీర కదలికల వల్లనే పోషకాలు అందుతుంటాయి. దాంతో వాటికి అవసరమైన పోషకాలు సరిగా అందవు. కీళ్ల నొప్పులు పెరగడానికి ఇదీ ఒక కారణం.
- ఈ సీజన్‌లో ఉండే వాతావరణ పీడనం (బ్యారోమెట్రిక్ ప్రెషర్) పెరుగుతుంది. అంటే గాలి మందంగా మారి ఒత్తిడిని పెంచుతుంది. ఈ ఒత్తిడి కారణంగా కీళ్లు లేదా గాయం లేదా ఆర్థరైటిస్ చుట్టూ ఉండే ఇన్‌ఫ్లమేషన్ మరింత సెన్సిటివ్‌గా మారిపోతాయి. దాంతో ఈ వాతావరణ పీడనం కారణంగా కీళ్లు మరింత ఒత్తిడికి గురై నొప్పులు పెరుగుతాయి.
- చాలామందిలో చలికాలంలో నొప్పిని భరించే శక్తి (పెయిన్ టాలరెన్స్) తగ్గుతుంది. పెద్ద వయసు వారిలో ఇది మరింత ఎక్కువ. అందుకే వృద్ధుల్లో ఎప్పుడూ ఉండే మామూలు నొప్పులు సైతం ఈ కాలంలో మరింత పెరిగినట్లు అనిపిస్తాయి.
- ఈ కాలంలో సూర్యకాంతి, సూర్యరశ్మి తక్కువగా ఉంటాయి. దాంతో ఎముకల ఆరోగ్య నిర్వహణకు అవసరమైన విటమిన్-డి కూడా తగ్గుతుంది. అందుకే ఈ సీజన్‌లో ఫ్రాక్చర్లు అయితే అవి తగ్గడానికి మిగతా కాలాలతో పోలిస్తే ఒకింత ఎక్కువ సమయమే తీసుకుంటుంది.

నొప్పిని తగ్గేందుకు కొన్ని సూచనలివి...

- ఈ సీజన్‌లో చాలామంది నీళ్లు తక్కువగా తాగడం వల్ల తేలిగ్గా డిహైడ్రేషన్‌కు గురవుతాయి. కాబట్టి వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగండి. ఇక ఒంటిని వెచ్చబరచుకోడానికి దోహదం కాఫీ, టీ వంటివి ఎక్కువగా తాగేస్తారు. పైగా దళసరిగా ఉండే మందపాటి దుస్తులు, స్వెటర్లు ధరిస్తారు. దాంతో మనకు తెలియకుండానే చెమట రూపంలో నీరు బయటకు వెళ్తుంది. ఈ అన్ని కారణాలతో శరీరంలో నీళ్లు, లవణాల పాళ్లు తగ్గుతాయి. అందుకే నీళ్లు ఎక్కువగా తాగాలి.
- మోకాళ్లపై ఎలాంటి భారం పడకుండానే మంచి వ్యాయామాన్ని చేకూర్చే ఈదడం వంటి ప్రక్రియలు ఈ సీజన్‌లో చాలా మంచిది.
- మీకు సాధ్యమైనంత వరకు నేల మీద బాసిపట్లు (సక్లముక్లం) వేసి కూర్చోకుండా కుర్చీ మీదనే కూర్చునేలా జాగ్రత్తలు తీసుకోవడం, వెస్ట్రన్ టాయ్‌లెట్‌ను వాడటం, కుదిరినంతవరకు టేబుల్‌పైనే భోజనం చేయడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే నొప్పులను తేలిగ్గానే నివారించుకోవచ్చు.
- డాక్టర్ సలహా మేరకు విటమిన్-డి సప్లిమెంట్స్ వాడండి. ఒకవేళ మీరు ఆస్టియో ఆర్థరైటిస్ రోగులైతే చలి మీ జీవితాన్ని మరింత దుర్భరం చేస్తుంది కాబట్టి డాక్టర్ సలహా మేరకు విటమిన్-డి సప్లిమెంట్లు వాడండి. అలాగే ఆహారంలో అది ఎక్కువగా ఉండే వెన్న, పాలు వంటి పదార్థాలు ఈ సీజన్‌లో ఎక్కువగా తీసుకోండి.
- ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే ఒమెగా-3, ఒమెగా-6, ఒమెగా-9 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే ఫిష్ ఆయిల్ సప్లిమెంట్స్‌ను ఆహారంలో తీసుకోవడం వల్ల కీళ్లనొప్పులు తగ్గుతాయి.
- తరచూ ఒంటిని బాగా సాగదీస్తున్నట్లుగా చేసే స్ట్రెచింగ్ వ్యాయామాలతో నొప్పులు బాగా తగ్గుతాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే ఇంట్లోనే స్టేషనరీ సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయండి.
- కండరాలు రిలాక్స్ కావాలంటే గోరువెచ్చటి నువ్వుల నూనెతో తేలిగ్గా మసాజ్ చేసుకోవచ్చు. అయితే మసాజ్ బాగా తీవ్రంగా కాకుండా తేలిగ్గా చేసుకోవాలి.
- నొప్పిగా ఉన్న కీళ్లను ఉప్పు వేసిన గోరు వెచ్చటి నీళ్లలో కాసేపు మునిగి ఉండేలా చూడటం మంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి. ఐస్ కాపడంతోనూ నొప్పితగ్గుతుంది. అయితే చలికాలంలో అప్పటికే బాగా బయట బాగా చలిగా ఉన్న కారణంగా ఐస్ పెట్టడం మరింత బాధాకరంగా అనిపించవచ్చు.
- ఈ సీజన్‌లో మీకు దెబ్బలు తగలకుండా చూసుకోండి. బయటకు వెళ్తున్నప్పుడు మంచి షూస్ ధరించడం, వ్యాయామం చేస్తున్నప్పుడు మోకాళ్లకు ధరించే నీ-ప్యాడ్స్ వంటివి ధరించండి.
- ఈ సూచనలు పాటిస్తున్నా మీ కీళ్లనొప్పులు ఎంతకూ తగ్గకపోతే తప్పనిసరిగా డాక్టర్‌ను కలిసి తగిన మందులు వాడాలి.

పైన పేర్కొన్న అన్ని జాగ్రత్తలు తీసుకొని, ఆ సూచనలన్నీ పాటించాక కూడా కీళ్లనొప్పులు వస్తుంటే మాత్రం తప్పక డాక్టర్‌ను సంప్రదించాలి.

డాక్టర్ కె. సుధీర్‌రెడ్డి,
చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్,
ల్యాండ్‌మార్క్ హాస్పిటల్స్, హైదరాబాద్

నొప్పులను తగ్గించుకోవడం ఎలా?

ఈ సీజన్‌లో నొప్పి అనేది వస్తే దాన్ని పూర్తిగా నివారించలేకపోయినా తగ్గించుకోడానికి కొన్ని ఉపశమన మార్గాలున్నాయి. అవి...

- బయట చలిగా ఉన్నప్పుడు శరీరానికి తగినంత ఉష్ణోగ్రత ఇచ్చే దుస్తులను ధరించాలి. చేతులకు గ్లోవ్స్ వేసుకోవడం, కాళ్లకు సాక్స్ వేసుకోవడం మంచిది. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారు మోకాళ్లు, మోచేతుల వద్ద మరింత మందంగా ఉండే దుస్తులు వేసుకోవడం శ్రేయస్కరం.
- ఈ సీజన్‌లో ఆరుబయట కాకుండా వీలైతే ఇన్‌డోర్ వ్యాయామాలు చేయండి. శీతకాలం కీళ్ల నొప్పులు తగ్గాలంటే శ్రమ కలిగించని విధంగా తేలికపాటి వ్యాయామాలు, తగినంత శారీరక శ్రమ మంచి మార్గం. మన కీళ్లలో ఎప్పుడూ కదలికలు ఉండేలా చేసుకోవడం వల్ల కీళ్ల ఆరోగ్య నిర్వహణ మెరుగ్గా ఉంటుంది.
- ఈ సీజన్‌లో వ్యాయామాలు తప్పనిసరి. వ్యాయామం సమయంలో మనం ఆహ్లాదంగా ఉండటానికి దోహదపడేదీ, మన ఒత్తిడిని గణనీయంగా తగ్గించేది అయిన ఎండార్ఫిన్ అనే స్రావం శరీరంలోకి విడుదల అవుతుంది. 'ఎండార్ఫిన్'లో నొప్పిని తగ్గించే గుణం చాలా ఎక్కువ. అందుకే ఈ సీజన్‌లో వ్యాయామం తప్పనిసరి. పైగా వ్యాయామం కారణంగా ఈ సీజన్‌లో సహజంగా మందగించే రక్త సరఫరా బాగా మెరుగవుతుంది. దాంతో నొప్పి సెన్సర్స్ కూడా మామూలుగా పనిచేస్తాయి. ఫలితంగా నొప్పి తగ్గుతుంది.

కీళ్ల ఆరోగ్యానికి తక్కువ శ్రమతో ఎక్కువ వ్యాయామం ఎలా?



శరీరానికి శ్రమ కలిగించకుండానే తేలికపాటి కదలికలతో మనకు మంచి వ్యాయామం కలిగించే యాక్టివిటీస్ ఈ కింద ఉన్నాయి. మీకు వీలైన వాటిని ఎంచుకోండి.

- ఇండోర్స్‌లో ఎక్కువగా నడవడం. ఇందుకు తేలిక మార్గం ఏమిటంటే ఏదైనా షాపింగ్ మాల్‌ను ఎంచుకొని లోపల చాలాసేపు తిరగడం. అన్ని వస్తువులను పరిశీలిస్తూ అక్కడ వీలైనంత ఎక్కువగా నడుస్తుండండి.
- ఇంట్లో పనులు చేయడం... అంటే ఇల్లు శుభ్రం చేయడం, వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించడం వంటివి.
- పిల్లలతో ఆడటం... ఇందులో కూర్చుని ఆడే ఆటలను మినహాయించాలి. ఇన్‌డోర్ స్విమ్మింగ్
- ఇంట్లోనే తేలికపాటి మ్యూజిక్‌కు డాన్స్ చేయడం.
- ఆఫీసులో లేదా మీరు వెళ్లినచోట లిఫ్ట్‌కు బదులు మెట్లనే ఉపయోగించడం.
- టీవీ చూస్తున్నప్పుడు కూర్చునే స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడం.

మైగ్రేన్ బాధితులకు శుభవార్త!

మైగ్రేన్ తలనొప్పి ఎంతగా బాధపెడుతుందో అనుభవించేవారికి మాత్రమే తెలుసు. ప్రాణాంతకం కాకపోయినా... అది వచ్చిందంటే మాత్రం విద్యార్థులైతే చదువునూ, పని చేసేవారైతే వాళ్ల పనినీ తీవ్రంగా ఆటంకపరుస్తుంది. అలాంటి మైగ్రేన్ బాధితులందరికీ ఇది ఒక శుభవార్తే. వాళ్ల కోసం లాస్మిడిటాన్ అనే మందు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీయే) ఆమోదం పొందింది. కాకపోతే లాస్మిడిటాన్ మందు వాడాక కనీసం 8 గంటల పాటు డ్రైవ్ చేయకూడదు. అదొక్కటే ఈ మందుతో ఉన్న ఇబ్బంది. ఇక త్వరలోనే

మరో కొత్త ఔషధం కూడా అందుబాటులోకి రాబోతోంది. ట్రయల్స్ ముగించుకొని త్వరలో అందుబాటులోకి రానున్న ఈ కొత్త మందు పేరే 'ఉబ్రోజపాంట్'.

ప్రస్తుతం మైగ్రేన్‌కు వాడుతున్న మందులు... రక్తనాళాలను కాస్తంత సన్నబరిచేలా చేసి, బాధ ఉన్న చోట రక్తం ఒకింత తక్కువ అందేలా చేయడం ద్వారా పనిచేస్తాయి. కానీ ఇలాంటి చికిత్స గుండెజబ్బులు / రక్తనాళాలకు సంబంధించిన వాస్కులార్ జబ్బులు ఉన్నవారికి అంత మంచిది కాదు. అలాంటివారిలో అది గుండెపోటు లేదా పక్షవాతానికి కారణం కావచ్చు. కానీ లాస్మిడిటన్, ఉబ్రోజపాంట్ అలా కాదు. తలనొప్పికి కారణమవుతుందని భావిస్తున్న ప్రోటీన్‌ను టార్గెట్ చేస్తాయి. నొప్పి కలిగించే ఆ ప్రోటీన్‌పై దాడి చేయడం ద్వారా వారి తలనొప్పిని, ఇతర ఇబ్బందులను అరికడతాయి.

న్యూయార్క్‌లోని మోంటెఫోయిర్ హెడేక్ సెంటర్‌లో ఆధ్వర్యంలో ట్రయల్స్‌లో ఉన్న ఉబ్రోజపాంట్ మందు గురించిన వివరాలు ప్రముఖ మెడికల్ జర్నల్ 'జామా'లో ప్రచురితమయ్యాయి. ఇది కూడా అందుబాటులోకి మైగ్రేన్ రోగులకు ఎంతగానో వెలుసుబాటు కలుగుతుంది.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించండిలా...

ఇటీవల సెల్‌ఫోన్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. సెల్‌ఫోన్ కారణంగా మెదడుపై, శరీరభాగాలపై చెడు ప్రభావం ఉంటుందన్న అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దాంతో ఇది నిత్యం చర్చల్లో ఉండే ఒక (డిబేటబుల్) అంశం. ఇక సెల్‌ఫోన్ కారణంగా మన దేహంపై పడే దుష్ప్రభావాలపై ఇంకా చాలా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఆ దుష్ప్రభావాలు ఎక్కువ అన్న విషయం స్పష్టంగా ఇంకా తేలకపోయినా... దీనినుంచి రేడియేషన్ వెలువడుతుందన్నది నిర్వివాదాంశం. ఇక రేడియేషన్‌తో మనకు ప్రమాదమే అన్న విషయం కూడా తెలిసిందే. అందుకే సెల్‌ఫోన్ వాడటం తప్పనిసరిగా చేటు చేస్తుందా లేదా అన్న విషయాన్ని పక్కన పెడితే... కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మాత్రం అవసరమని వైద్యనిపుణులు, పరిశోధకులు/అధ్యయనవేత్తలు చెబుతుంటారు. ఆ జాగ్రత్తలివి...

- మీ మొబైల్‌ఫోన్ మీ శరీరానికి వీలైనంత దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోండి. వీలైతే స్పీకర్ ఆన్ చేసి మాట్లాడండి.
- సెల్‌ఫోన్‌ను షర్ట్ జేబులో గుండె దగ్గర, మన ప్రైవేట్ పార్ట్స్‌కు దగ్గరగా ఉండేలా ప్యాంట్ పాకెట్స్‌లో ఉంచడం అంత మంచిది కాదు. పాచ్‌లో ఉంచడమే మంచిది. వీలైతే బ్రీఫ్ కేసులు, హ్యాండ్‌బ్యాగులలో ఉంచడం ఇంకా బెటర్.
- సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్‌ను ఉపయోగించకుండానే పనులు జరిగేలా చూసుకోండి. మీటింగులు, కాన్ఫరెన్స్‌హాల్స్, దేవాలయాలు, ఆసుపత్రుల్లో తప్పనిసరిగా స్విచ్ ఆఫ్ చేయండి.
- పన్నెండేళ్ల లోపు పిల్లలను దీని నుంచి తప్పనిసరిగా దూరంగా ఉంచండి. అదనపు ఫీచర్లు ఉన్న సెల్‌ఫోన్‌లను పిల్లలు విపరీతంగా ఉపయోగిస్తుంటారు. పిల్లలకు గేమ్స్ ఆడటానికి కూడా సెల్‌ఫోన్ ఇవ్వకండి.
- ఎక్కువసేపు సంభాషణను కొనసాగించాల్సి వస్తే.. తప్పనిసరిగా ల్యాండ్‌లైన్‌నే ఉపయోగించాలి. ఇక సెల్‌ఫోన్‌లోనే ఎక్కువ సేపు కాల్ చేయాల్సి వస్తే తరచు ఫోన్‌ని కుడి చెవికి, ఎడమ చెవికి ఇలా మారుస్తుండాలి.
- సెల్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉన్నపుడు మాట్లాడడం ప్రమాదకరం.
- సెల్‌ఫోన్స్‌తో పోలిస్తే హెడ్ సెట్స్ నుంచి రేడియేషన్ వెలువడటం తక్కువ. అందుకే ఎక్కువసేపు మాట్లాడాల్సి వస్తే హెడ్‌ఫోన్స్ కూడా వాడటం మంచిదే.
- వినేటప్పుడు కంటే మాట్లాడేటప్పుడు మన ఫోన్ ఎక్కువ రేడియేషన్‌ను విడుదల చేస్తున్నట్టు గుర్తించారు. కాబట్టి ఎక్కువ వినడం, తక్కువ మాట్లాడడం కొంత మేలు.
- దేహంలోని మృదువైన కండరాలపై రేడియేషన్ ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కాబట్టి హృదయానికి ఎదురుగానో, ఒళ్ళో పెట్టుకునో మాట్లాడడం వద్దు.
- ఏంటెన్నా క్యాప్స్, కీపాడ్ కవర్స్ వంటివి కనెక్షన్ నాణ్యతను తగ్గిస్తాయి. ఇది ఫోన్‌ను మరింత శక్తిమంతంగా పని చేసేందుకు ప్రేరేపిస్తుంది. తద్వారా రేడియేషన్ మరింత ఎక్కువగా విడుదలవుతుంది.

సెల్‌ఫోన్‌ను ఉపయోగించండిలా...

- సెల్‌ఫోన్‌ను అత్యవసర వినియోగానికి మాత్రమే పరిమితం చేయండి. మాట్లాడటం కంటే వాట్సాప్, మెసేజెస్ రూపంలోనే వీలైనంతవరకు ఎక్కువ సమాచారం పంపండి.
- సెల్‌ఫోన్ నెంబరును బాగా సన్నిహితులకు మాత్రమే ఇవ్వండి. ఇలా చేయడం ద్వారా అనవసరమైన కాల్స్‌ను చాలావరకు తగ్గించుకోవచ్చు.
- పొద్దున్న లేవడానికి అలారంతో మొదలు పెట్టి రిమైండర్లు, ఆటలు, పాటలు, కాలిక్యులేటర్... ఇలా ప్రతిదానికీ సెల్‌ఫోన్ మీదే అతిగా ఆధారపడిపోవడం అడిక్షన్‌కు దారితీస్తుంది. కాబట్టి ఫోన్‌ను కేవలం సంభాషణలకు మాత్రమే పరిమితం చేయండి.
- ఎక్కువగా ఫోన్ వాడే అవసరం ఉన్నవాళ్ళు ఇంట్లో ల్యాండ్‌లైన్ కనెక్షన్ తీసుకోవడం మేలు. కనీసం ఇంట్లో ఉన్నపుడైనా సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించవచ్చు.
- డ్రైవింగ్ చేస్తూ ఇయర్‌ఫోన్స్‌తో గాని మరే రకంగానూ సెల్‌ఫోన్ మాట్లాడకూడదని వ్యక్తిగతంగా దృఢమైన నిర్ణయం తీసుకోండి. అది ప్రాణానికి ప్రమాదం. అది చట్టరీత్యా నేరం కూడా. కాబట్టి వీలైనంత తక్కువగా మాట్లాడటం అన్నది మీ సెల్‌ఫోన్ వినియోగాన్ని పరిమితం చేస్తుంది.

ఈ సూచనలు పాటించడం అన్నది మీ ఆరోగ్యమూ ఇటు మెడికల్‌గానూ, అటు సామాజికంగానూ చాలాకాలం బాగుండేలా చేస్తుంది.

డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి,
చీఫ్ న్యూరాలజిస్ట్, సిటీ న్యూరో సెంటర్,
రోడ్ నెం. 12, బంజారాహిల్స్, హైదరాబాద్

ఈ క్యాన్సర్లు పురుషుల్లో ఎందుకు ఎక్కువంటే...

చాలా మంది చిన్నపిల్లలు అలా టెన్త్ లేదా ఇంటర్ పూర్తి కాగానే పై చదవులకని పక్క ఊళ్లకు వెళ్లడం మామూలే. ఒక్కసారిగా దొరికిన ఆ స్వేచ్ఛతో సిగరెట్లకు అలవాటు కావడం కూడా చాలా సాధారణమే. అలాగే బాగా ఒత్తిడితో ఉండే ఉద్యోగాలూ, కాన్ఫరెన్స్‌లు, మీటింగుల తర్వాత రిలాక్స్ కావడం కోసం పొగతాగడం చాలా మందిలో అలా మెల్లగా అలవాటవుతుంది. ఇలాంటి వ్యవహారాలు అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు కాస్తంత ఎక్కువ. ఇలా మొదట సరదాగా, టైమ్‌పాస్ కోసం మొదలయ్యే స్మోకింగ్, గుట్కా, ఆల్కహాల్ వంటి దురలవాట్లతోపాటు బయటి తిండి ఎక్కువగా తింటూ ఉంటారు. ఈ బయటి ఆహారం రుచికరంగా, ఆకర్షణీయంగా కనిపించడం కోసం నూనెలు, ఉప్పుకారాలూ ఎక్కువగా వాడటంతోపాటు దేహానికి, ఆరోగ్యానికి హాని చేసే కొన్ని కృత్రిమరంగులు, రసాయనాలు వాడతారు. వాడిన నూనెలే మళ్లీ మళ్లీ వాడటమూ జరుగుతుంది. ఇవన్నీ క్యాన్సర్‌కు కారణాలయ్యే అవకాశాలు చాలా ఎక్కువ.

దురలవాట్లు, బయటితిండి ఎక్కువగా తీసుకోవడం, వృత్తిపరమైన కారణాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురికావడం, వాతావరణ కాలుష్యం, నైట్‌డ్యూటీలు, రాత్రంతా నిద్ర లేకుండా పనిచేయడం, శారీరక శ్రమ చాలా తక్కువగా ఉండటం... ఈ అన్నిరకాల కారణాలతో మహిళలతో పోలిస్తే పురుషులు మరింత ఎక్కువగా క్యాన్సర్‌కు గురవుతున్నారు.

పునరుత్పత్తి అవయవాలకు సంబంధించిన క్యాన్సర్లు తప్పితే... మరే క్యాన్సర్లు తీసుకున్నా అవి మహిళల్లో కంటే పురుషుల్లోనే ఎక్కువ. ఇటీవల పురుషులు కూడా రొమ్ముక్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం పెరిగిపోయింది.

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌కు గురయ్యే వారి సంఖ్య పెరుగుతున్న ధోరణులను చూస్తే 2007 నుంచి 2030 నాటికి ఈ సంఖ్య ఇప్పటికంటే 45% ఎక్కువయ్యే అవకాశం ఉంది. అవగాహన పెంచే కార్యక్రమాలు, జాగ్రత్తలు, ముందుగానే పసిగట్టే స్క్రీనింగ్ పరీక్షలు ఎన్ని వచ్చినా క్యాన్సర్ రాకుండా నివారించగలగడం ఎవరి చేతుల్లోనూ లేదనేది సత్యం. ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అధ్యయనాల ప్రకారం 2030 నాటికి ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాల సంఖ్య... అన్ని మరణాల సంఖ్య కంటే ఎక్కువగా ఉండవచ్చని అంచనా. సిగరెట్, బీడీలు, పాన్, గుట్కా, ఆల్కహాల్, పొగాకు నమలడం మొదలైనవి నోటి క్యాన్సర్‌కు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే నోటి క్యాన్సర్స్ విషయంలో మన దేశమే మొదటి స్థానంలో ఉంది. ప్రతి ఏడాదీ దాదాపు 80,000 మంది వరకు ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఉప్పు, కారాలు, పచ్చళ్లు, మసాలాలు ఎక్కువగా తీసుకోవడం ఇంకా దురలవాట్లు కూడా చాలా ఎక్కువగా ఉండటం పొట్టకు సంబంధించిన క్యాన్సర్‌కు గురిచేస్తాయి. అందుకే భారతదేశంలోని పురుషులు ఈ క్యాన్సర్‌బారిన ఎక్కువగా పడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. మన దేశంలోని పురుషులు నోరు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, పొట్ట, కోలన్ క్యాన్సర్లకు గురవ్వడం చాలా ఎక్కువగానే గమనిస్తున్నాం. అలవాట్లు, జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం వంటివి క్యాన్సర్‌కు ముఖ్య కారణాలవడటంతోపాటు కొన్ని వృత్తిపరమైన కారణాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఆస్‌బెస్టాస్, అల్యూమినియం ఉత్పాదన కంపెనీల్లో, ఆల్కహాలిక్ బెవరేజెస్, పొగాకు ఉత్పత్తుల కంపెనీలు, రేడియమ్ ఉత్పత్తులు, రేడియో న్యూక్లియిడ్స్, చెక్కపొడి, గామా రేడియేషన్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పనిచేసేవారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు తల, మెడ భాగాల్లో (హెడ్ అండ్ నెక్) క్యాన్సర్స్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అస్సలు ఎండ తగలకుండా ఏసీ రూముల్లో అలా గంటల తరబడి పని చేయడంతోపాటు నైట్‌డ్యూటీలు, పెస్టిసైడ్స్, కెమికల్స్ వంటి వాటికి పురుషులే ఎక్కువగా ఎక్స్‌పోజ్ అవుతుంటారు. ఇక వారు పనుల కోసం బయటికి వెళ్లినప్పుడు తేలిగ్గా దొరికే జంక్‌ఫుడ్‌ను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. దాంతో ఊబకాయం, క్యాన్సర్ ముప్పులు పొంచి ఉంటాయి.

Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

యాభైఏళ్లు పైబడ్డాక కనిపించే ప్రోస్టేట్‌క్యాన్సర్‌ను తెలుసుకునేందుకు పీఎస్ఏ (ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజన్) అనే రక్తపరీక్ష చేయించుకోవడం మంచిది. ఎందుకంటే వీర్యంలో, మూత్రంలో రక్తం కనిపించడం, నడుము, తుంటి, పక్కటి ముకల నొప్పులు, మూత్ర సంబంధమైన సమస్యల వంటి ప్రోస్టేట్ క్యాన్సర్ లక్షణాలు కనిపించేసరికి అది ముదిరిపోయి పక్కన ఉండే ఎముకలకూ పాకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పీఎస్ఏ పరీక్షలో యాంటిజన్ పెరగడాన్ని గమనిస్తే ఇతర పరీలైన డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్ (డీఆర్ఈ), ప్రోస్టేట్ బయాప్సీతో పాటు అవసరమైతే అల్ట్రాసౌండ్, బోన్ స్కాన్, సీటీ స్కాన్, ఎమ్మారై, బయాప్సీ వంటి పరీక్షలు చేస్తారు.

యాభై ఏళ్ల పైబడిన పురుషుల్లో లక్షణాలు ఉన్నా లేకున్నా పీఎస్ఏ, డీఆర్ఈ పరీక్షలు చేయించుకుని డాక్టర్ సలహా మేరకు మళ్లీ ఎంతకాలం తర్వాత చేయించుకుంటే మంచిది అన్న విషయాన్ని తెలుసుకోవాలి. అలాగే పీఎస్ఏ పరీక్షలో మార్పులు ఎలా ఉన్నాయి, ఇంకా ఎతర పరీక్షలను ఎలాంటి లక్షణాలు కనిపించనప్పుడు చేయించుకోవాలి వంటి విషయాలపై అవగాహన పెంచుకోవడం తప్పనిసరి.

ఈ కింద లక్షణాలు కనిపిస్తే పురుషులు నిర్లక్ష్యం చేయడం తగదు. అవి...

- తగ్గని దగ్గు, దగ్గుతో పాటు రక్తం తగ్గడం
- నొప్పితో పాటు జ్వరం రావడం, రక్తం కనిపించడం
- స్రావం
- తీవ్రమైన అజీర్తి
- పదార్థాలు తీసుకోలేకపోవడం
- ఆకలి, బరువు
- మూత్రం ఆగి ఆగి మలవిసర్జనలో రక్తం
- గొంతునొప్పి, ఘన నోటిలో మానని పుండ్లు
- ఎముకల్లో నొప్పులు

పై లక్షణాలు కనిపించినప్పుడు ఏదో ఇన్ఫెక్షన్ అనో, పైల్స్ అనో, రోగనిరోధక శక్తి తగ్గిందనో, స్మోకింగ్ వల్ల కొద్దిగా దగ్గు వస్తుందనో నిర్లక్ష్యం చేయడం తగదు. ఇక వయసు పైబడ్డ తర్వాత ఈ లక్షణాలు కనిపిస్తే మరింత జాగ్రత్తగా ఉండాలి. పురుషుల్లో ఎక్కువగా కనిపించే నోరు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, పొట్ట, కోలన్, ప్రోస్టేట్ క్యాన్సర్లకు సంబంధించిన హెచ్చరికలు కావచ్చు. కాబట్టి మంచి జీవనశైలిపై అవగాహన పెంపొందించుకొని, ఆరోగ్యంగా జీవించడం చాలా ముఖ్యం.

epaper.sakshi.com

సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
28-11-2019

కామన్ ఎంట్రన్స్ టెస్ట్(క్యాట్).. మేనేజ్‌మెంట్ విద్యార్థుల హాట్ ఫేవరెట్ ఎగ్జామ్..! సంవత్సరం ఏదైనా క్యాట్‌పై జరిగే చర్చ అంతా ఇంతా కాదు..! ఏటా తనదైన శైలిలో విద్యార్థులను ఆశ్చర్యానికి గురిచేయడం క్యాట్ పరీక్ష ప్రత్యేకత! ఈ నెల (నవంబర్) 24న దేశవ్యాప్తంగా రెండు స్లాట్‌ల్లో క్యాట్-2019 జరిగింది. దాదాపు రెండు లక్షల మంది అభ్యర్థులు ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో... పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఉపయోగపడేలా క్యాట్ రివ్యూతోపాటు ఐఐఎంల ఎంపిక ప్రక్రియలో తదుపరి దశలైన రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ), గ్రూప్ డిస్కషన్(జీడీ)లకు సంబంధించిన గైడెన్స్..

» నవంబర్ 24న ముగిసిన క్యాట్ 2019.
» పరీక్ష తీరు ఆశ్చర్యానికి గురిచేసిందంటున్న అభ్యర్థులు.
» మలిదశలో కీలకంగా రిటెన్ ఎబిలిటీ టెస్ట్, జీడీ, పీఐ.

వాట్ ఆఫ్టర్ క్యాట్

మలిదశలో.. మెరిసేలా..!

సిద్ధంకండిలా...!

'క్యాట్‌ను బాగా రాశాం.. ఇక రిలాక్స్ అవుదాం' అని భావిస్తే.. భవిష్యత్ అంచనాలు తల్లకిందులయ్యే ప్రమాదం ఉంది. అభ్యర్థులు మరికొన్ని రోజుల్లో మరో కీలక దశను ఎదుర్కోవలసి ఉంటుంది. కాబట్టి క్యాట్‌లో మంచి ప్రదర్శన ఇచ్చినప్పటికీ.. పూర్తిగా రిలాక్స్ అవడానికి వీల్లేదు. ఓ నాలుగైదు రోజులు పుస్తకాలను పక్కనబెట్టొచ్చు. ఆ తర్వాత ఐఐఎం మలిదశ ఎంపిక ప్రక్రియకు సన్నద్ధతను ప్రారంభించాలి.

క్యాట్ స్కోర్... షార్ట్‌లిస్ట్

ఐఐఎంలు క్యాట్ స్కోరు ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తాయి. జాబితాలోని అభ్యర్థులకు రిటెన్ ఎబిలిటీ టెస్ట్ (డబ్ల్యూఏటీ), పర్సనల్ ఇంటర్వ్యూ (పీఐ), గ్రూప్ డిస్కషన్(జీడీ) నిర్వహిస్తాయి. గతేడాది కేవలం రెండు ఐఐఎంలు మాత్రమే గ్రూప్ డిస్కషన్ జరిపాయి. అత్యధిక ఐఐఎంలు క్యాట్ స్కోరు, రిటెన్ టెస్టు, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేశాయి. కొత్త ఐఐఎంలు షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు కామన్ అడ్మిషన్ ప్రాసెస్(క్యాప్) పేరుతో ఎంపిక ప్రక్రియను చేపడుతున్నాయి. ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు సంబంధించిన ఎంపిక ప్రక్రియను తెలుసుకొనేందుకు సదరు ఐఐఎం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

- ఇందులో అభ్యర్థులు సాధారణంగా ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాలతో సమాధానం రాయాల్సి ఉంటుంది. రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో పేర్కొనే అంశాలు సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి. అభ్యర్థి తన అభిప్రాయాలను రాతపూర్వకంగా వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ఇందులో వినియోగించిన పదాలు, పదజాలం, వాక్య నిర్మాణం, స్థూల వ్యక్తీకరణల ఆధారంగా మార్కులు లభిస్తాయి.

జీడీలో సమకాలీనం

గ్రూప్ డిస్కషన్(జీడీ)లో అభ్యర్థులను బృందాలుగా విభజించి.. ఏదైనా అంశంపై చర్చించమంటారు. నిర్దిష్టంగా ఏ ఒక్క రంగానికీ పరిమితం కాకుండా.. అన్ని రంగాలకు సంబంధించిన అంశాలను అడిగే వీలుంది. బిజినెస్‌కు, మేనేజ్‌మెంట్‌కు ఏ మాత్రం సంబంధం లేని అంశాలను కూడా అడుగుతారు. సామాజిక, సమకాలీన అంశాలకు ఒకింత ప్రాధాన్యం దక్కుతుంది. కాబట్టి ఔత్సాహిక అభ్యర్థులు అన్ని రంగాల్లోని చర్చనీ యాంశాలపై అవగాహన పెంచుకోవాలి. జీడీ సందర్భంగా ఒకే విషయంపై పది లేదా ఇరవై మంది ఉన్న బృందంలో చర్చించాల్సి ఉంటుంది. ఆ సమయంలో స్వీయ అభిప్రాయాలను అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో చెప్పాలి. వెల్లడించిన అభిప్రాయాలు, వ్యక్తీకరించిన తీరుకు ప్రత్యేక మార్కులు ఉంటాయి.

పర్సనల్ ఇంటర్వ్యూ

పర్సనల్ ఇంటర్వ్యూలో అభ్యర్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలు, వాటిని సాధించేందుకు ఎంచుకున్న మార్గాలపై ప్రశ్నలు ఎదురవుతాయి. ఇంజనీరింగ్ నేపథ్యం కలిగిన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఐఎంలు ఆయా అభ్యర్థులకు బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న ఆసక్తిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. అదేవిధంగా దినపత్రికల్లో వచ్చే వార్తలు, వివిధ ప్రభుత్వ పథకాలు-అమలు తీరుపై ప్రశ్నలు అడిగే అవకాశముంది.

ఇవీ కీలకమే

- ప్రత్యేక ప్రామాణిక అంశాల్లో 'వైవిధ్యం' ముందు వరుసలో ఉంటుంది. ఐఐఎంలు, ఐఐటీలు కొందరికే పరిమితమవుతున్నాయనే విమర్శల నేపథ్యంలో.. ఈ ఇన్‌స్టిట్యూట్‌లు అభ్యర్థుల ఎంపికలో వైవిధ్యం చూపుతున్నాయి. ఈ వైవిధ్యత రెండు రకాలుగా ఉంటుంది. అవి.. జెండర్ డైవర్సిటీ, అకడెమిక్ డైవర్సిటీ.
- **జెండర్ డైవర్సిటీ:** మహిళా అభ్యర్థుల సంఖ్యను పెంచేందుకు ఐఐఎంలు జెండర్ డైవర్సిటీని అనుసరిస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళలకు మూడు నుంచి ఐదు శాతం మేర ప్రత్యేక వెయిటేజీ ఇస్తున్నాయి.
- **అకడెమిక్ డైవర్సిటీ:** భిన్న అకడమిక్ నేపథ్యాలు కలిగిన విద్యార్థులకు ఐఐఎంల్లో చోటు కల్పించే ఉద్దేశంతో అకడెమిక్ డైవర్సిటీని అమలు చేస్తున్నారు. దీనికి మూడు నుంచి ఐదు శాతం వెయిటేజీ ఉంటుంది.

కోర్సులకు వెయిటేజీ

పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో సాధించిన మార్కులకు ప్రత్యేక వెయిటేజీలు ఇస్తున్నారు. ఆయా కోర్సుల్లో పొందిన జీపీఏ/ఉత్తీర్ణత శాతం ఆధారంగా వెయిటేజీ గణిస్తారు.

వృత్తిపరమైన అర్హత

క్యాట్‌కు అర్హత బ్యాచిలర్ డిగ్రీ. అయితే ఐఐఎంలు తుది దశలో ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ వెయిటేజీ పేరుతో బ్యాచిలర్ డిగ్రీకి అదనంగా చేసిన కోర్సులకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ రెండు నుంచి మూడు శాతంగా ఉంటోంది.

పని అనుభవం

తుది దశలో వెయిటేజీ పరంగా అధిక ప్రాధాన్యం ఉన్న అంశం.. పని అనుభవం. వర్క్ ఎక్స్‌పీరియన్స్‌కు తుది జాబితా రూపకల్పనలో ఐదు నుంచి పది శాతం వెయిటేజీ లభిస్తుంది. ఇది అభ్యర్థులు పని చేస్తున్న రంగం, అనుభవంపై ఆధారపడి ఉంటుంది.

ప్రొఫైల్ వెయిటేజీ

కొత్త ఐఐఎంలు రాంచీ, రాయ్‌పూర్, రోహతక్, త్రిచీ, ఉదయ్‌పూర్, కాశీపూర్ ఐఐఎంల ఎంపిక ప్రక్రియను ఐఐఎం-ఉదయ్‌పూర్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఐఐఎం ఉదయ్‌పూర్ ఎంపికకు సంబంధించి ప్రొఫైల్ వెయిటేజీ పేరుతో ప్రత్యేక విధానాన్ని అమలుచేస్తోంది. 24 శాతం వెయిటేజీ ఉన్న ప్రొఫైల్‌లో అకడమిక్ క్వాలిఫికేషన్స్, వర్క్ ఎక్స్‌పీరియన్స్, డైవర్సిటీ అంశాలను పొందుపరిచారు.

ఎన్‌లో ఈ విభాగం అంచనాల మేరకే ఉంది. ప్యాట్రన్ పరంగా ఎలాంటి మార్పు లేదు. గత మూడ్నెల్లతో పోల్చితే క్లిష్టత స్థాయి పెరిగింది. రీడింగ్ కాంప్రహెన్షన్ ప్రశ్నలు లాంగ్వేజ్‌పై పట్టున్న వారిని సైతం ఇబ్బంది పెట్టేలా ఉన్నాయి. మధ్యాహ్నం సెషన్‌లో రీడింగ్ కాంప్రహెన్షన్(ఆర్‌సీ)లు పెద్దగా ఉన్నాయి. గతేడాదితో పోల్చితే క్లిష్టంగా ఉన్నాయి. ఉదయం సెషన్‌లో వీఏ సులభంగా ఉన్నప్పటికీ.. మధ్యాహ్నం సెషన్‌లో కఠినంగా ఉంది.

డీఐఎల్‌ఆర్

డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ (డీఐఎల్‌ఆర్) నుంచి 32 ప్రశ్నలు వచ్చాయి. 8 సెట్‌లు.. ఒక్కో సెట్ నుంచి నాలుగు ప్రశ్నలు అడిగారు. ఈ విభాగంలో 8 నాన్ ఎంసీక్యూ ప్రశ్నలు అడిగారు. ఈ విభాగం అంచనాలకు పూర్తి విరుద్ధంగా ఉంది. గత మూడ్నెల్లతో పోల్చితే సులభంగా ఉండటం విశేషం. కొన్ని సెట్లు నేరుగా ఉంటే.. మరి కొన్ని అప్లికేషన్ ఆధారితంగా ఉన్నాయి. నేరుగా అడిగిన సెట్లు స్కోరింగ్ పరంగా విద్యార్థులకు ఉపయోగపడనున్నాయి. మధ్యాహ్నం సెషన్‌లోనూ ఈ విభాగం సులభంగా ఉంది. అన్ని సెట్లు అభ్యర్థులు అటెంప్ట్ చేసే విధంగా ఉన్నాయి.

క్యూఏ

క్వాంటిటేటివ్ ఎబిలిటీ (క్యూఏ) నుంచి 34 ప్రశ్నలు వచ్చాయి. ఈ విభాగంలో 11 నాన్ ఎంసీక్యూ ప్రశ్నలు అడిగారు. క్యూఏ విభాగంలో విద్యార్థులను విస్మయపరిచే అంశాలేమీ లేవు. గతేడాదితో పోల్చితే సులభంగా ఉంది. సులభమైన ప్రశ్నలను ముందుగా సాధనచేసి.. ఆన్‌స్క్రీన్ కాలిక్యులేటర్‌ను ఉపయోగించి.. మిగిలిన ప్రశ్నల సాధనకు ప్రయత్నించిన వారికి స్కోరింగ్ పరంగా ప్రయోజనం ఉంటుంది. మధ్యాహ్నం సెషన్‌లో ప్రశ్నల సరళి, క్లిష్టత ఉదయం సెషన్ తరహాలోనే ఉంది. పదాలతో కూడిన ప్రశ్నలను తక్కువగా అడిగారు. ప్రశ్నలు ఫార్ములాలను ఉపయోగించి తక్కువ సమయంలో సాధించేలా ఉన్నాయి. మొత్తంగా ఈ విభాగం పర్వాలేదనే స్థాయిలో ఉంది.

వొకాబ్యులరీ పెంచుకోవాలి

ఐఐఎంల తుది దశ ప్రవేశ ప్రక్రియకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు లక్ష్యంపై స్పష్టతతో అడుగేయాలి. క్రేజ్ కారణంగా మేనేజ్‌మెంట్ కోర్సును ఎంపిక చేసుకున్నామనో లేదా ఐఐఎంలకున్న ప్రాధాన్యం మేరకు క్యాట్‌కు హాజరయ్యామనే రీతిలో సాదాసీదాగా వ్యవహరించకూడదు. ఐఐఎంలో చేరాలనుకునే అభ్యర్థులు భవిష్యత్తుకు సంబంధించి ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ప్రిపరేషన్‌లో సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో మంచి భావవ్యక్తీకరణ ప్రదర్శించేందుకు వీలుగా వొకాబ్యులరీని పెంచుకోవాలి. దీనికోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవాలి. ఐఐఎంల తుది దశ ఎంపిక ప్రక్రియలో నైతిక విలువలు, సామాజిక దృక్పథాలపై ప్రశ్నలు ఎదురవుతాయి.

– రామ్‌నాథ్ కే,
నేషనల్ క్యాట్ కోర్సు డైరెక్టర్, టి.ఐ.ఎం.ఇ

ఉద్యోగ సమాచారం

ఏఎఫ్‌క్యాట్-2020

భారత వైమానిక దళం పర్మనెంట్, షార్ట్ సర్వీస్ కమిషన్‌ల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాల భర్తీకి నిర్వహించే ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ ఆన్‌లైన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్)-2020 ప్రకటన వెలువడింది. ఏటా మే/జూన్, డిసెంబర్ నెలల్లో ఈ ప్రకటన వెలువడుతుంది.

- **ఖాళీలు:** 249.
- **విభాగాలు:** ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (ఫ్లయింగ్).
- **అర్హత:** విభాగాలను బట్టి సాధారణ డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ, బీకాం డిగ్రీతో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత, ఎన్‌సీసీ సర్టిఫికెట్, నిర్దేశించిన శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** ఫ్లయింగ్ బ్రాంచ్ పోస్టులకు జనవరి 1, 2021 నాటికి 20-24 ఏళ్ల మధ్య, మిగిలిన వాటికి 20-26 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఉమ్మడి ప్రవేశ పరీక్ష, ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ), పైలట్ ఆప్టిట్యూడ్ బ్యాటరీ టెస్ట్ (పీఏబీటీ), మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఏఎఫ్ క్యాట్ ఎంట్రీ పోస్టులకు రూ.250; మిగిలిన విభాగాలకు ఫీజు లేదు.
- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 1, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 30, 2019.
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in

పవర్‌గ్రిడ్-35

న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ 35 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-30; సివిల్-5.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత.
- **వయసు:** డిసెంబర్ 16, 2019 నాటికి 27 ఏళ్ల మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 16, 2019.
- **వెబ్‌సైట్:** http://powergridindia.com

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

- డైలీ,వీక్లీ,మంత్లీ కరెంట్ అఫైర్స్
- టీఎస్, ఏపీ ఇంటర్ స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్, గైడెన్స్
- ఏపీ టెట్ /డీఎస్సీ స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం

WWW.SAKSHIEDUCATION.COM

SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

అవుతారా.. ఫార్మసిస్ట్!

- జీప్యాట్ 2020కు నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు చివరి తేది: నవంబర్ 30, 2019

800కు పైగా కాలేజీలు

జీప్యాట్-2020లో 800కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు పాల్గొంటున్నాయి. ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు ఎంఫార్మసీ ప్రవేశాలకు సంబంధించి జీప్యాట్ స్కోరును పరిగణలోకి తీసుకుంటాయి. అభ్యర్థులు ముందుగా జీప్యాట్ స్కోరు ఆధారంగా ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఇన్‌స్టిట్యూట్ జీప్యాట్ స్కోరుకు సంబంధించి కటాఫ్ మార్కులను ప్రకటిస్తుంది. సదరు వివరాల కోసం ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

అర్హత

జీప్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఫార్మసీలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే. బీటెక్ ఫార్మాస్యుటికల్‌అండ్ ఫైన్ కెమికల్ టెక్నాలజీ/తత్సమాన కోర్సుల విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

వయసు

జీప్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి వయోపరిమితి నిబంధన లేదు.

ఫీజు

జనరల్, ఆర్థికంగా వెనుకబడిన జనరల్, ఓబీసీ (నాన్ క్రీమిలేయర్) కేటగిరీల పురుష అభ్యర్థులకు రూ.1600, మహిళలకు రూ.800, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు రూ.800.

పరీక్ష విధానం

- జీప్యాట్ గతేడాది మాదిరిగానే ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో మొత్తం 125 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది.
- ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు.
- ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు

గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్/రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్.

ప్రిపరేషన్

గతంలో ఐఐటీలు గేట్‌తోపాటు జీప్యాట్‌ను నిర్వహించినప్పుడు ప్రశ్నపత్రం ఒకింత సులభంగా ఉండేది. కొన్ని ప్రశ్నలు సైతం పునరావృతం అవుతుండేవి. కానీ, ప్రస్తుతం ప్రశ్న పత్రం అంచనాకు అందకుండా తయారైంది. కాబట్టి అభ్యర్థులు సిలబస్‌లోని అన్ని అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

సిలబస్ విభాగాలు

- **ఫార్మకోగ్నసీ:** ఇది పూర్తిగా థీయరీతో కూడిన విభాగం. అభ్యర్థులు పాఠ్యాంశాలను క్షుణ్నంగా చదివి షార్ట్ నోట్స్ రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల చివరి దశ ప్రిపరేషన్ పరంగా ప్రయోజనం ఉంటుంది. గత ప్రశ్నపత్రాల్లో సెన్న(సెన్నోసైడ్), మార్సిన్, వింకా డ్రగ్స్ గురించి అడిగారు. కాబట్టి ఆయా డ్రగ్స్‌కు సంబంధించిన భావనలు, విధానాలు, ప్రభావాలు, ఉపయోగాల గురించి అధ్యయనం చేయాలి. **ఇందులో కీ టాపిక్స్:** గ్లైకోసైడ్స్, ఆల్కలాయిడ్స్, వాలటైల్ ఆయిల్స్, రెసిన్స్, టానిన్స్, కార్బొహైడ్రేట్స్, టిష్యూ కల్చర్, హెర్బల్ డ్రగ్స్. **చదవాల్సిన బుక్స్:** సీకే కొకటే ఫార్మకోగ్నసీ బుక్, ట్రీస్ అండ్ ఇవాన్స్ కంప్లీట్ గైడ్ ఫర్ ఫార్మకోగ్నసీ.
- **ఫార్మకాలజీ:** అభ్యర్థుల్లో ఎక్కువ మందికి ఈ విభాగంపై ఆసక్తి ఉంటుంది. జీప్యాట్-2019లో దీనికి అధిక వెయిటేజీ దక్కింది. ఇందులో డ్రగ్ ఇంటరాక్షన్, మెకానిజమ్స్, డ్రగ్స్-సైడ్ ఎఫెక్ట్స్ (బాడీపెయిన్స్ వంటి సాధారణ సైడ్ ఎఫెక్ట్స్ కాకుండా)ను అధ్యయనం చేయాలి. డ్రగ్స్‌ను సంక్షిప్త నామాల్లో గుర్తుంచుకొనేందుకు డ్రగ్స్ వర్గీకరణ పాఠ్యాంశం ఉపయోగపడుతుంది. **ఇందులో ముఖ్యమైన టాపిక్స్:** అంకాలజీ (కీమోథెరపీ డ్రగ్స్, నూతన టెక్నాలజీలు తదితరం), న్యూరోఫార్మకాలజీ, అరుదైన వ్యాధులు, కార్డియోవస్కులర్ అండ్ బ్లడ్ ప్రొడక్ట్స్. **చదవాల్సిన పుస్తకాలు:** కె.డి.త్రిపాఠీ ఎస్సెన్షియల్ ఆఫ్ మెడికల్ ఫార్మకాలజీ.
- **ఫార్మాస్యూటికల్ అనాలసిస్:** ఇది ఇతర విభాగాలతో పోల్చితే సులభంగా ఉంటుంది. దీనికి సంబంధించి భావనలను అర్థం చేసుకోవాలి. అదేవిధంగా వీలైనన్ని ఎక్కువ సమస్యలు సాధించాలి. ఫార్ములాలను నోట్ చేసుకోవాలి. **ముఖ్యమైన టాపిక్స్:** యూవీ, ఐఆర్, ఎన్‌ఎంఆర్, మాస్ స్పెక్ట్రోస్కోపీ, క్రొమాటోగ్రఫీ, పోలరోగ్రఫీ అండ్ పొలారిమెట్రీ, ఫ్లేమ్ ఫోటోమీటర్, కండక్టోమెట్రీ, ఆంపెరోమెట్రీ, పొటెన్షియోమెట్రీ. **చదవాల్సిన బుక్స్:** చత్వాల్ స్పెక్ట్రోస్కోపీ అండ్ టైట్రేషన్, రెమింగ్టన్ క్రొమాటోగ్రఫీ.
- **ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ:** ఈ విభాగంలో ప్రశ్నలు ప్రాథమికంగా ఉంటాయి. కాన్సెప్టులపై అవగాహనతో సదరు ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు. ముఖ్యంగా ఈ విభాగంలో కర్బన రసాయన శాస్త్రంపై దృష్టిపెట్టాలి. ఎలక్ట్రోఫిలిక్, న్యూక్లోఫిలిక్ రియాక్షన్స్, ఇంటర్మీడియెట్ రియాక్షన్స్‌ను అధ్యయనం చేయాలి. **ప్రధానమైన టాపిక్స్:** ఎస్ఏఆర్ ఆఫ్ స్టెరాయిడ్స్, నామ్‌నిక్లేచర్ అండ్ కెమికల్ మొయిటీ ఆఫ్ ది మెడికల్ డ్రగ్స్. **చదవాల్సిన బుక్స్:** మారిస్ బోయిడ్ బేసిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎస్.ఎన్.పాండే మెడికల్ కెమిస్ట్రీ.
- **ఫార్మాస్యూటిక్స్:** జీప్యాట్‌కు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఈ విభాగం అత్యంత కీలకం. దీని అధ్యయనాన్ని రసాయనాలు, టాబ్లెట్ల సూత్రీకరణతో మొదలుపెట్టాలి. సూక్ష్మజీవులను హతమార్చే(స్టెరిలైజేషన్) నైపుణ్యాలు, న్యూమరికల్ ప్రాబ్లమ్స్‌పై ప్రధానంగా దృష్టిపెట్టాలి. **ముఖ్యమైన టాపిక్స్:** ఫార్మాస్యూటికల్ న్యాయ మీమాంస-విలువలు, సర్వేస్ అండ్ ఇంటర్ ఫేషియల్ ఫినామినా, రియాలజీ, కైనటిక్స్ అండ్ డ్రగ్స్ స్టెబిలిటీ, బయోఫార్మాటిక్స్ అండ్ ఫార్మకోకైనటిక్స్. **చదవాల్సిన బుక్స్:** లీబర్‌మ్యాన్ అండ్ లచ్‌మ్యాన్ ది థియరీ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫార్మసీ

నోటిఫికేషన్

మాస్టర్ ఆఫ్ ఫార్మసీ (ఎంఫార్మసీ) కోర్సులో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్టు (జీప్యాట్). ఈ పరీక్షలో ప్రతిభ చూపడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఫార్మసీ కళాశాలల్లో ఎంఫార్మసీ కోర్సులో చేరే అవకాశం లభిస్తుంది. నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ).. జీప్యాట్-2020కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో... జీప్యాట్ నోటిఫికేషన్ వివరాలు, ప్రిపరేషన్ ప్రణాళిక...

ఎగ్జామ్ టిప్స్



- ఏటా స్పెక్ట్రోస్కోపీ-మాస్ స్పెక్ట్రోస్కోపీ, యూవీ, ఐఆర్, ఎన్‌ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీ నుంచి 6-8 ప్రశ్నలు వస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు ఆయా చాప్టర్లను క్షుణ్నంగా చదవాలి.
- క్లాసిఫికేషన్ ఆఫ్ డ్రగ్స్, షెడ్యూల్స్ ఆఫ్ డ్రగ్స్ చాప్టర్లకు ప్రత్యేకంగా నోట్స్ అవసరం. హెర్బల్ డ్రగ్స్‌పై ఏటా మూడు నుంచి నాలుగు ప్రశ్నలు వస్తున్నాయి.
- ఏటా జీప్యాట్‌లో న్యూమరికల్ ప్రాబ్లమ్స్ సంఖ్య పెరుగుతోంది. కాబట్టి అభ్యర్థులు ప్రాబ్లమ్స్‌ను తేలిగ్గా తీసుకోరాదు.
- బయోఫార్మాస్యూటిక్స్, డిప్రెషన్ ఇన్ ఫ్రీజింగ్ పాయింట్, అలిగేషన్ మెథడ్, డోస్ ఆన్ ది బేసిస్ ఆఫ్ బాడీ వెయిట్ అండ్ ఏజ్ టాపిక్స్‌పై ప్రాబ్లమ్స్ ఎక్కువగా అడుగుతున్నారు.
- గత ప్రశ్నపత్రాలు, మాక్ టెస్టులకు హాజరవ్వడం ద్వారా జీప్యాట్ ప్యాట్రన్‌పై అవగాహన ఏర్పడుతుంది.
- పాత ప్రశ్నపత్రాల పరిశీలన ద్వారా ఏయే టాపిక్స్‌కు ఎక్కువ వెయిటేజీ లభిస్తుందనే విషయంపై అంచనాకు రావొచ్చు.

ముఖ్యతేదీలు

» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: నవంబర్ 30
» ఫీజు చెల్లించేందుకు చివరితేదీ: డిసెంబర్ 1
» పరీక్ష తేదీ: జనవరి 28, 2020
» ఫలితాలు వెల్లడి: ఫిబ్రవరి 7
» వెబ్‌సైట్: gpat.nta.nic.in

సిలబస్‌ను అనుసరించాలి

జీప్యాట్ అనగానే చాలా మంది విద్యార్థులు బీఫార్మసీ సిలబస్‌ను మొత్తం బట్టీ పడుతుంటారు. అలా కాకుండా ఎన్‌టీఏ పేర్కొన్న సిలబస్‌ను అనుసరిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. 130-140 స్కోరు సాధిస్తే... తెలుగు రాష్ట్రాల్లోని మంచి కాలేజీల్లో సీటు లభించే అవకాశముంది. దీంతోపాటు నెలకు రూ.12,000 స్కాలర్‌షిప్ అందుతుంది.

– సత్యనారాయణ,
హైదరాబాద్ అకాడమీ

సాక్షి
స్పోర్ట్స
గురువారం
28-11-2019

గవర్నర్‌గా ముత్తయ్య మురళీధరన్!

శ్రీలంక క్రికెట్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ త్వరలో కొత్త పాత్రలోకి ప్రవేశించబోతున్నాడు. తమిళుల ప్రాబల్యం అధికంగా ఉన్న నార్తర్న్ ప్రావిన్స్‌కు మురళీధరన్‌ను గవర్నర్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గవర్నర్ పదవిని స్వీకరించాలంటూ లంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్స స్వయంగా ఆహ్వానించినట్లు సమాచారం. శ్రీలంక తరఫున 133 టెస్టులు ఆడి 800 వికెట్లు తీసిన 47 ఏళ్ల మురళీధరన్ 2011 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌తో రిటైర్మెంట్ ప్రకటించాడు.

స్వర్ణ సురేఖ

- మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ విభాగంలో బంగారు పతకం
- మహిళల టీమ్ విభాగంలో రజతం
- ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్



బ్యాంకాక్ (థాయ్‌లాండ్): అంతర్జాతీయస్థాయిలో ఈ ఏడాది ఆద్యంతం నిలకడగా రాణించిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ తన ఖాతాలో మరో గొప్ప ఘనత జమ చేసుకుంది. ప్రతిష్టాత్మక ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ విభాగం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అభిషేక్ వర్మతో కలిసి జ్యోతి సురేఖ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-అభిషేక్ వర్మ (భారత్) జంట 158-151 పాయింట్ల తేడాతో యి సువాన్ చెన్-చియె లున్ చెన్ (చైనీస్ తైపీ) ద్వయంపై విజయం సాధించింది. ఫైనల్లో ఒక్కో జోడీకి లక్ష్యంవైపు 16 బాణాల చొప్పున అవకాశం ఇచ్చారు. విజయవాడకు చెందిన 23 ఏళ్ల జ్యోతి సురేఖ తాను సంధించిన ఎనిమిది బాణాలకు గరిష్టంగా లభించే 80 పాయింట్లను సాధించడం విశేషం. ఆమె సంధించిన ఎనిమిది బాణాలూ 10 పాయింట్ల వృత్తంలోకి వెళ్లాయి. అభిషేక్ వర్మ 80 పాయింట్లకుగాను 78 పాయింట్లు స్కోరు చేశాడు. 'ఆసియా చాంపియన్‌షిప్‌లో ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నాను. గాలి బాగా వీస్తున్నా స్వర్ణం నెగ్గే ఆఖరి అవకాశాన్ని వదులుకోలేదు' అని సురేఖ వ్యాఖ్యానించింది.

అంతకుముందు జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ, ముస్కాన్ కిరార్, ప్రియా గుర్జర్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని గెల్చుకుంది. ఫైనల్లో భారత జట్టు 215-231తో చెవన్ సో, యున్ సూ సాంగ్, డేయోంగ్ సియోల్‌లతో కూడిన దక్షిణ కొరియా జట్టు చేతిలో ఓడిపోయింది. పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మ, రజత్ చౌహాన్, మోహన్ భరద్వాజ్‌లతో కూడిన భారత జట్టుకు కూడా రజతం లభించింది. ఫైనల్లో భారత జట్టు 232-233తో కేవలం పాయింట్ తేడాతో జేవన్ యాంగ్, యోంగ్‌హి చోయ్, యున్ క్యు చోయ్‌లతో కూడిన దక్షిణ కొరియా జట్టు చేతిలో పరాజయం పాలైంది. బుధ వారం ముగిసిన ఈ చాంపియన్‌షిప్‌లో రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో కలిపి భారత్‌కు ఒక స్వర్ణం, రెండు రజతాలు, నాలుగు కాంస్యాలు లభించాయి. గురువారం ఇదే వేదికపై టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయి.

2 కాంపౌండ్ విభాగంలో ఇప్పటివరకు పది ఆసియా చాంపియన్‌షిప్‌లు జరిగాయి. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ జంట స్వర్ణం నెగ్గడం ఇది రెండోసారి. 2013లో అభిషేక్ వర్మ-లిల్లీ చాను ద్వయం తొలి పసిడి పతకం గెలిచింది.

3 ఆసియా చాంపియన్‌షిప్ చరిత్రలో జ్యోతి సురేఖ నెగ్గిన స్వర్ణాల సంఖ్య. సురేఖ 2015లో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో, 2017లో మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో పసిడి పతకాలు సాధించింది.

30 తన ఎనిమిదేళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో జ్యోతి సురేఖ సాధించిన పతకాలు. ఇందులో 4 స్వర్ణాలు, 12 రజతాలు, 14 కాంస్యాలు ఉన్నాయి.

శిఖర్ ధావన్ స్థానంలో సామ్సన్

ముంబై: బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌కు ఎంపికైనా మ్యాచ్ ఆడే అవకాశం దక్కని కేరళ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ సంజు సామ్సన్‌కు మరో అవకాశం లభించింది. గాయంతో విండీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు దూరమైన శిఖర్ ధావన్ స్థానంలో సామ్సన్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడుతున్న సమయంలో ధావన్ ఎడమ మోకాలికి గాయమైంది. 'బీసీసీఐ వైద్య బృందం ధావన్ గాయాన్ని పరీక్షించింది. అది మానేందుకు, కుట్లు తొలగించేందుకు కొంత సమయం పడుతుందని అభిప్రాయ పడింది. దాంతో ధావన్ స్థానంలో సామ్సన్‌ను ఎంపిక చేశాం' అని బోర్డు ప్రకటించింది.

విండీస్‌తో టి20 సిరీస్‌కు ఎంపిక

సాహా చేతివేలికి సర్జరీ

కోల్‌కతా: భారత టెస్టు వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా కుడి చేతి ఉంగరం వేలికి మంగళవారం శస్త్రచికిత్స జరిగింది. బంగ్లాదేశ్‌తో కోల్‌కతాలో జరిగిన డేనైట్ టెస్టు మ్యాచ్‌లో అతని చేతి వేలికి గాయమైంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వైద్య బృందం అతని గాయంపై మణికట్టు వైద్య నిపుణుడిని సంప్రదించింది. ఆయన సర్జరీకి సూచించడంతో ముంబైలోని హాస్పిటల్‌లో శస్త్రచికిత్స జరిగిందని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. సాహా మాట్లాడుతూ 'ఇది మామూలు గాయమే. కాస్త ఫ్రాక్చర్ అయింది. కోలుకునేందుకు పెద్దగా సమయం పట్టదు. ఐదు వారాలు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాస శిబిరంలో పాల్గొని ఫిట్‌నెస్ సంతరించుకుంటాను' అని అన్నాడు. న్యూజిలాండ్‌తో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే సిరీస్‌కల్లా అతను అందుబాటులో ఉంటాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

కార్న్‌వాల్‌కు 7 వికెట్లు

- అఫ్గానిస్తాన్ 187 ఆలౌట్
- వెస్టిండీస్‌తో ఏకైక టెస్టు

లక్నో: ఆరున్నర అడుగుల ఆజానుబాహుడు, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ రాకిమ్ కార్న్‌వాల్ తన ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. అఫ్గానిస్తాన్‌తో బుధవారం ఇక్కడ ప్రారంభమైన ఏకైక టెస్టులో కార్న్‌వాల్ 75 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా అఫ్గాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకే ఆలౌటైంది. జావేద్ అహ్మదీ (39), అమీర్ హమ్జా (34), అఫ్సర్ జజాయ్ (32) ఫర్వాలేదనిపించారు. హోల్డర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం విండీస్ ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. క్రెయిగ్ బ్రాత్‌వైట్ (11), షై హోప్ (7) విఫలం కాగా... క్యాంప్‌బెల్ (30 బ్యాటింగ్), బ్రూక్స్ (19 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ప్రస్తుతం విండీస్ మరో 119 పరుగులు వెనుకబడి ఉంది. భద్ర తాకారణాలరీత్యా అఫ్గానిస్తాన్ తమ దేశంలో కాకుండా అంతర్జాతీయ మ్యాచ్‌లను భారత్ కేంద్రంగా ఆడుతోంది.

జనవరి వరకు అడగొద్దు

భవిష్యత్తుపై ధోని సమాధానం

ముంబై: వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్ తర్వాత భారత జట్టుకు దూరంగా ఉంటున్న మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని కెరీర్‌పై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అతని రిటైర్మెంట్ లేదా ఆటలో కొనసాగడంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. దీనిపై ధోని మొదటిసారి స్వయంగా స్పందించాడు. అదీ ఏక వాక్యంలో! పునరాగమనం గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ...'జనవరి వరకు నన్నేమీ అడగొద్దు' అని తేల్చేశాడు. బుధవారం 'పనెరై' అనే వాచీ కంపెనీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ధోని తన కెరీర్‌కు సంబంధించిన రెండు అత్యుత్తమ క్షణాలను పంచుకున్నాడు. 'సుదీర్ఘ కెరీర్‌లో రెండు సంఘటనలు నా మనసుకు అత్యంత చేరువగా నిలిచాయి. అలాంటివి మళ్లీ రావు. 2007 టి20 ప్రపంచ కప్ గెలిచి స్వదేశం తిరిగొచ్చిన తర్వాత ముంబైలో ఓపెన్ టాప్ బస్సులో ఊరేగింపు జరిగింది. ఆ సమయంలో ప్రఖ్యాత మెరైన్ డ్రైవ్ ఈ మూల నుంచి ఆ మూల వరకు పూర్తిగా నిండిపోయింది. తమ పనులన్నీ వదిలేసుకొని వారంతా మా కోసం వచ్చారు. వారి కళ్లలో ఎంతో ఆనందం కనిపించింది. ఇక 2011 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో విజయానికి 15-20 పరుగుల దూరంలో ఉన్నప్పుడు స్టేడియంలో ప్రేక్షకులు వందేమాతరం నినాదంతో హోరెత్తించారు' అని ధోని గుర్తు చేసుకున్నాడు.

భార్య సంతోషమే నా సంతోషం!

కెప్టెన్‌గా తాను ఎన్ని విజయాలు సాధించినా ఇంట్లో మాత్రం భార్య సాక్షి మాటే చెల్లుబాటు అవుతుందని ధోని సరదాగా వ్యాఖ్యానించాడు. వయసుతో పాటు భార్యాభర్తల మధ్య అనుబంధం మరింత దృఢమవుతుందని అతను అభిప్రాయపడ్డాడు. 'పెళ్లయ్యేంత వరకు అందరు మగాళ్లు సింహాల్లాగే ఉంటారు. నేను ఆదర్శవంతమైన భర్తను. ఎందుకంటే నా భార్య ఏం చేయాలనుకున్నా నేను అడ్డు చెప్పను. నా భార్య సంతోషంగా ఉంటేనే నేను సంతోషంగా ఉంటాను. అది జరగాలంటే ఆమె ఏం చెప్పినా నేను తలూపాల్సిందే. నా దృష్టిలో 50 ఏళ్ల వయసు దాటిన తర్వాతే వివాహ బంధం అసలు ఆనందం ఏమిటో తెలుస్తుంది. బాధ్యతలకు దూరంగా ఒకరినొకరు ప్రేమించుకునేందుకు అది సరైన వయసని భావిస్తున్నా' అని కెప్టెన్ కూల్ అన్నాడు.

మళ్లీ ఒడిశాలోనే 2023 ప్రపంచ కప్ హాకీ

భువనేశ్వర్: ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌కు మళ్లీ తామే ఆతిథ్యమిస్తామని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. 2023లో జరిగే పురుషుల ప్రపంచకప్ పోటీలను భువనేశ్వర్, రూర్కేలా నగరాల్లో నిర్వహిస్తామని బుధవారం ఆయన వెల్లడించారు. గతేడాది కూడా హాకీ మెగా ఈవెంట్‌కు భువనేశ్వరే ఆతిథ్యమిచ్చింది. ఇటీవల అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) వరుసగా రెండోసారి కూడా భారత్‌కే నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. 2023లో జనవరి 13 నుంచి 29 వరకు హాకీ పోటీలు జరుగుతాయి. బుధవారం కళింగ స్టేడియంలో జరిగిన మీడియా సమావేశంలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ 'మేం 2018 ప్రపంచకప్ హాకీని నిర్వహించాం. అలాగే వచ్చే మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తాం' అని ప్రకటించారు. ఈ సమావేశంలో ఎఫ్‌ఐహెచ్, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడు నరీందర్ బాత్రా, హాకీ ఇండియా (హెచ్ఐ) అధ్యక్షుడు మహ్మద్ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.



ఎమ్మెస్కే ప్రసాద్ ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌లు ఎన్ని...? అతని అనుభవం ఎంత? ఏడాది పాటు సెలక్టర్‌గా, ఆ తర్వాత చీఫ్ సెలక్టర్‌గా పని చేసిన మూడేళ్ల కాలంలో అభిమానులు, విశ్లేషకులు, మాజీ క్రికెటర్ల నుంచి లెక్క లేనన్ని సందర్భాల్లో ఈ ప్రశ్న ఎదురవుతూ వచ్చింది. ముఖ్యంగా కీలక, అనూహ్య నిర్ణయాలు తీసుకున్నప్పుడైతే వీరంతా ప్రసాద్‌ను విమర్శించడంలో ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. కానీ సెలక్టర్‌గా తన బాధ్యతలు నిర్వర్తించడం తప్ప విమర్శలను ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెస్కే వ్యాఖ్యానించారు.

అనుభవం కాదు... అంకితభావం ముఖ్యం!

- సెలక్టర్‌గా తన పనితీరుపై ఎమ్మెస్కే ప్రసాద్ వ్యాఖ్య
- తమ హయాంలో జట్టు అద్భుతాలు చేసిందన్న ఆంధ్ర మాజీ క్రికెటర్

ముంబై: భారత జట్టు సాధిస్తున్న విజయాలే తమ సెలక్షన్ కమిటీ పని తీరుకు సూచిక అని చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వ్యాఖ్యానించారు. 'మేం ఎన్ని మ్యాచ్‌లు ఆడామన్నది ముఖ్యం కాదు. ఎంత బాగా, ఎంత అంకితభావంతో పని చేశామన్నదే ముఖ్యం. మాకంటే ఎక్కువ క్రికెట్ ఆడినవాళ్లు కూడా సెలక్టర్లుగా విఫలమయ్యేవారేమో. ఏదేమైనా విజయాలే మన గురించి చెబుతాయి. ప్రస్తుతం భారత జట్టు అన్ని ఫార్మాట్‌లలో ఎలా ఆడుతుందో చూస్తే చాలు. గతంలో ఏ సెలక్షన్ కమిటీకి కూడా మా అంత మెరుగైన రికార్డు లేదు. అనుభవం లేనివాళ్లమే అయినా విజయవంతమైన జట్లను ఎంపిక చేశాం. సీనియర్ టీమ్ ఫలితాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇండియా 'ఎ' జట్లయితే విశేషంగా రాణించాయి. 13 సిరీస్‌లు ఆడితే అన్నీ గెలిచాయి. సీనియర్ టీమ్‌లో ఇప్పుడు మ్యాచ్ ఫలితాలను శాసించగల ఎనిమిది మంది ఫాస్ట్ బౌలర్లు, ప్రధాన స్పిన్నర్లతో పాటు మరో ఆరుగురు స్పిన్నర్లు, ఆరుగురు సమర్థులైన ఓపెనర్లు అందుబాటులో ఉన్నారు. ఇంకా మా నుంచి ఏం ఆశిస్తున్నారు' అని ఎమ్మెస్కే వివరించారు. ప్రపంచకప్ సెమీస్‌లో పరాజయానికి 'నాలుగో స్థానం' కారణం కాదని, సెమీఫైనల్ మ్యాచ్ వరకు కూడా నాలుగో నంబర్ బ్యాట్స్‌మన్ ఇబ్బంది పడటం జరగనే లేదని ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఒకరిద్దరు మినహా తాము అవకాశం ఇచ్చిన కొత్త ఆటగాళ్లంతా సత్తా చాటారన్న మాజీ వికెట్ కీపర్... బుమ్రాను టెస్టుల్లోకి ఎంపిక చేయడం తమ అత్యుత్తమ నిర్ణయమన్నారు. సెలక్టర్‌గా పని చేసేటప్పుడు విమర్శలు రావడం సహజమేనన్న ఎమ్మెస్కే.... ధోని, కోహ్లిలతో తనకు మంచి సంబంధాలే ఉన్నాయని స్పష్టం చేశారు. 'మేనేజ్‌మెంట్ విద్యార్థినైన నేను ఆంధ్ర క్రికెట్ డైరెక్టర్‌గా ఇంతకంటే ఎక్కువ సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. సెలక్టర్‌గా ఉన్న సమయంలో నేను దిగ్గజ క్రికెటర్ల సలహాలు తీసుకుంటూ వచ్చాను. ధోని, కోహ్లిలతో నా సంబంధాలు ఏమాత్రం దెబ్బ తినలేదు. జనం ఏమైనా అనుకోవచ్చు గానీ వారిద్దరు నన్ను ఎంతగా గౌరవిస్తారో నాకు తెలుసు' అని ప్రసాద్ అన్నారు.

నార్త్ ఈస్ట్ యునైటెడ్, ముంబై మ్యాచ్ 'డ్రా'

గువాహటి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా బుధవారం నార్త్ ఈస్ట్ యునైటెడ్, ముంబై సిటీ ఎఫ్‌సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2-2 వద్ద 'డ్రా'గా ముగిసింది. నార్త్ ఈస్ట్ తరఫున ట్రయాడిస్ (9వ నిమిషంలో), అసమో గ్యాన్ (42వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... ముంబై జట్టుకు అమిన్ చెర్మిటి (23వ, 32వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించాడు.

ముంబై దంచేసినా...

సూరత్: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ సూపర్ లీగ్ గ్రూప్ 'బి' చివరి మ్యాచ్‌లో ముంబై 22 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలిచినా... మెరుగైన రన్‌రేట్ లేని కారణంగా సెమీస్ చేరలేకపోయింది. గ్రూప్ 'బి'లో తమిళనాడు, కర్ణాటక, ముంబై జట్లు 12 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా తమిళనాడు (0.869), కర్ణాటక (0.762) సెమీస్ చేరగా... ముంబై (-0.194) ఇంటిదారి పట్టింది. పంజాబ్‌తో బుధవారం జరిగిన పోరులో ముందుగా ముంబై 20 ఓవర్లలో 3 వికెట్లకు 243 పరుగుల భారీస్కోరు చేసింది. శ్రేయస్ అయ్యర్ (40 బంతుల్లో 80 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 80; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), పృథ్వీ షా (27 బంతుల్లో 53; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగారు. పంజాబ్ 6 వికెట్లకు 221 పరుగులు చేసి ఓడింది. శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 78; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరోచిత పోరాటం చేశాడు. మరోవైపు గ్రూప్ 'ఎ' నుంచి హరియాణా, రాజస్తాన్ సెమీస్ చేరాయి.

సాయిప్రణీత్ శుభారంభం

- ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్, ప్రణయ్, సౌరభ్ వర్మ, సిరిల్ వర్మ
- సయ్యద్ మోదీ ఓపెన్ టోర్నీ

లక్నో: బ్యాడ్మింటన్ సీజన్‌లోని చివరి వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నమెంట్ సయ్యద్ మోదీ ఓపెన్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ భమిడిపాటి సాయిప్రణీత్‌తోపాటు ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్, జాతీయ చాంపియన్ సౌరభ్ వర్మ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సాయిప్రణీత్ 21-16, 22-20తో ఇస్కందర్ జుల్కర్‌నైన్ (మలేసియా)పై... శ్రీకాంత్ 21-12, 21-11తో మల్కోవ్ (రష్యా)పై... ప్రణయ్ 18-21, 22-20, 21-13తో లి షి ఫెంగ్ (చైనా)పై... సౌరభ్ వర్మ 21-11, 21-16తో జియో డాంగ్ షెంగ్ (కెనడా)పై గెలుపొందారు. హైదరాబాద్ కుర్రాడు సిరిల్ వర్మ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. సిరిల్ వర్మ 12-21, 21-15, 21-3తో హువాంగ్ పింగ్ సెయిన్ (చైనీస్ తైపీ)ను ఓడించాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో ఆడిన హైదరాబాద్ ఆటగాడు చిట్టబోయిన రాహుల్ యాదవ్ 16-21, 8-21తో కున్లావుత్ వితిత్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు.

వృశాలి, ఉత్తేజిత ఓటమి

మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో తెలుగమ్మాయిలు గుమ్మడి వృశాలి 16-21, 16-21తో అష్మిత చాలిహా (భారత్) చేతిలో... సాయి ఉత్తేజిత 10-21, 21-19, 15-21తో చోల్ బిర్చ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడారు.

సాత్విక్-చిరాగ్ జంటకు షాక్

పురుషుల డబుల్స్‌లో టైటిల్ ఫేవరెట్ జోడీ, రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. డి జి జియాన్-వాంగ్ చాంగ్ (చైనా) ద్వయం 21-12, 23-21తో సాత్విక్-చిరాగ్ జంటను ఓడించింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప (భారత్) జోడీ 21-13, 16-21, 21-19తో ఎన్జీ సాజ్ యావు-యు వెన్ సిన్ యింగ్ (హాంకాంగ్) జంటపై నెగ్గింది.

సాక్షి **బిజినెస్**
గురువారం
28-11-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
199 ▲	63 ▲
41,021	12,101

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	8,693	▲ 46
డోజోన్స్	28,121	▼ 1
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,430	▲ 27
డాక్స్	13,287	▲ 50
షాంఘై	2,903	▼ 4
నికాయ్	23,438	▲ 64

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.70	72.34
బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.35	93.54
యూరో	ఎస్‌బీఐ	77.35	80.26
జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	64.35	66.77
ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.55	49.70
సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.49	53.29
సౌదీ రియాల్	థామస్‌కుక్	18.24	19.84
యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.96	19.97
చైనా యువాన్	థామస్‌కుక్	9.54	10.94

ఐపీవోలకు అచ్ఛేదిన్!

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ల ర్యాలీ (సెకండరీ మార్కెట్)తో ప్రైమరీ మార్కెట్‌లో ఐపీవో ఇష్యూల సందడి మళ్లీ మొదలవుతోంది. ఈ ఏడాది ఈక్విటీ మార్కెట్లు ఎంతో అనిశ్చితులను చవిచూశాయి. ఫలితంగా మొదటి పది నెలల కాలంలో వచ్చిన పేరున్న ఐపీవో ఇష్యూలు 20లోపునకే పరిమితమయ్యాయి. ప్రతికూల పరిస్థితుల్లో ఇష్యూలు పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అవుతాయన్న నమ్మకం ఉన్న కంపెనీలే వాటిని చేపట్టాయి. చాలా కంపెనీలు ఐపీవో ఇష్యూ చేపట్టాలని అనుకుంటున్నా, సానుకూల వాతావరణం కోసం వేచి చూస్తున్నాయి. కొన్ని ఆఫర్ పత్రాలను దాఖలు చేసినా ముందుకు వెళ్లలేకపోయాయి. సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్ను భారీ తగ్గింపు నిర్ణయం తర్వాత ఈక్విటీ మార్కెట్లు ర్యాలీ బాటలో పడ్డాయి. దీంతో ఐపీవో ఇష్యూలతో కంపెనీలు ముందుకు వస్తున్నాయి. గత రెండు నెలల్లో రూట్ మొబైల్, మాంటే కార్లో, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్, ఇండియన్ రెన్యువబుల్ డెవలప్‌మెంట్ ఎనర్జీ, ముంబైకి చెందిన పురానిక్ బిల్డర్స్ సంస్థలు సెబీ వద్ద ఐపీవో ఆఫర్ పత్రాలను మరోసారి దాఖలు చేశాయి. తాజాగా ఎస్‌బీఐకి చెందిన ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ (క్రెడిట్‌కార్డు కంపెనీ) కూడా ఆఫర్ పత్రాలను దాఖలు చేసింది. వచ్చే కొన్ని నెలల్లో ఐపీవో కోసం యూటీఐ మ్యూచువల్ ఫండ్, పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఐపీవో పత్రాలను సెబీ ముందు దాఖలు చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

ప్రైమరీ మార్కెట్లో మళ్లీ సందడి...

- పబ్లిక్ ఇష్యూలకు క్యూ కడుతున్న కంపెనీలు
- గత రెండు నెలల్లో ఇష్యూలకు మంచి ఆదరణ
- కొత్తగా ఐపీవో కోసం కంపెనీల దరఖాస్తులు
- మద్దతుగా నిలుస్తున్న మార్కెట్ల ర్యాలీ...

27 కంపెనీలకు గ్రీన్ సిగ్నల్...

ఇప్పటి వరకు సెబీ నుంచి ఐపీవో కోసం 27 కంపెనీలు అనుమతి పొందాయి. ఇవి ఐపీవో ఇష్యూల ద్వారా రూ.18,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, బజాజ్ ఎనర్జీ, శ్రీరామ్ ప్రాపర్టీస్, పెన్నా సిమెంట్ తదితర కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. మరో ఏడు సంస్థల వరకు ఆఫర్ పత్రాలను దాఖలు చేసి, అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఈ ఏడాది 14 కంపెనీలు కలసి సుమారు రూ.15,000 కోట్ల వరకు నిధులను ఐపీవో ద్వారా సమీకరించాయి. వీటిల్లో ఒక్కటి మినహా (స్టెర్లింగ్ అండ్ విల్సన్) అన్నీ ఇష్యూ ధర కంటే ఎక్కువలోనే ట్రేడ్ అవుతున్నాయి. వీటిల్లో ఐఆర్‌సీటీసీ, యాఫిల్ ఇండియా, ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ మాత్రం ఇష్యూ ధర కంటే నూరు శాతం మించి పెరిగాయి. 2016–17, 2017–18 ఆర్థిక సంవత్సరాల్లో ఐపీవో మార్కెట్లో రూ.లక్ష కోట్లకు పైగా నిధుల సమీకరణ జరిగింది.

స్థిరమైన ర్యాలీ ఉంటేనే...

సెకండరీ మార్కెట్లో మంచి ర్యాలీ ఉంటే తప్ప, ప్రైమరీ మార్కెట్లో (ఐపీవోలు) వాతావరణం మారకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ ఇంకా రికవరీ సంకేతాలు ఇవ్వలేదని, కేంద్రం కార్పొరేట్ పన్ను తగ్గింపుతో లిక్విడిటీ (నిధుల రాక) ఆధారంగా జరుగుతున్న ప్రస్తుత మార్కెట్ల ర్యాలీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నది బ్రోకరేజీల అభిప్రాయం. బీఎస్‌ఈ సెన్సెక్స్ ఈ ఏడాది ఇప్పటి వరకు 12 శాతం మేర పెరిగింది. ''ఈ ఏడాది పలు ఐపీవోలకు అనుమతుల గడువు కూడా తీరిపోయింది. తాము ఆశిస్తున్న ధరకు తగినంత డిమాండ్ లేని పరిస్థితుల్లో ఇదే వాతావరణం కొనసాగొచ్చు'' అని ప్రైమ్ డేటా బేస్ ఎండీ ప్రణవ్ హల్దియా పేర్కొన్నారు. ''మార్కెట్‌లో ఇప్పటికీ ఎంతో అనిశ్చితి ఉంది. తిరిగి ఆఫర్ పత్రాలను దాఖలు చేయడం వల్ల ఈ వాతావరణం మెరుగుపడిన వెంటనే ఐపీవోలకు వచ్చేందుకు కంపెనీలకు వీలు కలుగుతుంది'' అని పీఎల్ మార్కెట్స్ వైస్ ప్రెసిడెంట్ దారా కల్యాణి వాలా చెప్పారు.

మంచి ఇష్యూలకు భారీ డిమాండ్

ఈ ఏడాది మార్కెట్లో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ.. మంచి వ్యాపార నమూనాలు కలిగిన కంపెనీలు, ఆకర్షణీయమైన ధరలతో వచ్చిన ఐపీవోలకు ఇన్వెస్టర్ల నుంచి మంచి ఆదరణే దక్కింది. ముఖ్యంగా ఐఆర్‌సీటీసీ, యాఫిల్ ఇండియా, ఇండియామార్ట్, పాలీక్యాబ్, నియోజన్ కెమికల్స్, సీఎస్‌బీ బ్యాంకు ఇష్యూలకు భారీ స్పందనే లభించింది. లిస్టింగ్‌లోనూ లాభాలు కురిపించాయి. ఐఆర్‌సీటీసీ షేరు ఇష్యూ ధర రూ.320 కాగా, లిస్టింగ్‌లోనే వాటాదారులకు 100% లాభాలిచ్చింది. యాఫ్లే ఇండియా కూడా ఇష్యూ ధర నుంచి చూస్తే ఇప్పటికే 119% ర్యాలీ చేసింది. కేరళకు చెందిన సీఎస్‌బీ బ్యాంకు ఇష్యూ ఈ నెల 27న ముగియగా 87 రెట్లు అధికంగా బిడ్లు రావడం గమనార్హం. వచ్చే వారం మొదలయ్యే ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఐపీవోకు, త్వరలో రానున్న ఎస్‌బీఐ కార్డ్స్ ఇష్యూకు సైతం మంచి స్పందన ఉంటుందనేది మార్కెట్ వర్గాల అంచనా.

ఈ ఏడాది లిస్టింగ్ తర్వాత మెరిసిన షేర్లు

కంపెనీ	ఇష్యూ ధర (రూ.లలో)	ప్రస్తుత ధర (రూ.లలో)	పెరుగుదల (శాతంలో)
ఐఆర్‌సీటీసీ	320	883	176
యాఫిల్ ఇండియా	745	1589	113
ఇండియామార్ట్	973	2160	122
పాలీక్యాబ్ ఇండియా	538	931	73
నియోజెన్ కెమికల్స్	215	355	65
మెట్రోపోలిస్ హెల్త్‌కేర్	880	1401	59
ఆర్‌వీఎన్‌ఎల్	19	24.5	29

త్వరలో ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీవో...

- ఇష్యూ సైజు రూ.9,500 కోట్ల రేంజ్‌లో...

ముంబై: ఎస్‌బీఐకు చెందిన దేశంలోనే రెండో అతి పెద్ద క్రెడిట్ కార్డ్ కంపెనీ... ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీవో పత్రాలను సెబీకి బుధవారం సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ.500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. వీటితో పాటు ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్)లో ఎస్‌బీఐ, కార్లైల్ గ్రూప్‌నకు చెందిన సీఏ రోవర్ హోల్డింగ్స్ సంస్థలు 13.05 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తాయి. మొత్తం మీద ఈ ఐపీవో సైజు రూ.8,000–9,500 కోట్ల రేంజ్‌లో ఉంటుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఈ కంపెనీ విలువ రూ.65,000 కోట్ల మేర ఉండగలదని అంచనా. సెబీ ఆమోదం లభిస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే అతి పెద్ద ఐపీవో అవుతుంది. వచ్చే ఏడాది మార్చిలోనే మార్కెట్లో లిస్టింగ్ చేయాలని కంపెనీ భావిస్తోంది.

ప్రైవేటీకరణ కాకపోతే ఎయిర్‌ఇండియా మూత

విమానయాన మంత్రి హర్‌దీప్‌సింగ్‌పురి

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించకపోతే, మూసేయాల్సి ఉంటుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి బుధవారం రాజ్యసభకు తెలిపారు. సంస్థ ఉద్యోగులు అందరికీ సానుకూల ఒప్పందానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎయిర్ ఇండియా తన ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షిస్తుందని, ప్రైవేటీకరించేంత వరకు ఏ ఒక్కరినీ ఉద్యోగాల నుంచి తీసివేయడం జరగదని వివరించారు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అంతర్జాతీయంగా విమానాల రద్దీ తగ్గుముఖం పట్టినా, మన దేశంలో అంత ప్రతికూల పరిస్థితి లేదన్నారు.

శాంసంగ్‌లో 1,200 నియామకాలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాదిలో 1200 మంది ఇంజినీరింగ్ పట్టభద్రులను ఉద్యోగాల్లోకి తీసుకోనున్నట్లు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ శాంసంగ్ బుధవారం ప్రకటించింది. పరిశోధన, అభివృద్ధి కేంద్రాల్లో పనిచేయడం కోసం వీరిని ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్‌సీల నుంచి ఎంపికచేయనున్నట్లు వెల్లడించింది. బెంగళూరు, నోయిడా, ఢిల్లీ కేంద్రాల్లో నియామకాలు ఉంటాయని వివరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, క్లౌడ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, రికగ్నిషన్ సిస్టమ్స్, డేటా అనాలిసిస్, ఆన్‌డివైస్ ఏఐ, మొబైల్ కమ్యూనికేషన్స్, నెట్‌వర్క్స్, యూజర్ ఇంటర్‌ఫేస్ వంటి విభాగాల్లో వీరు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొంది.

బెంగళూరులో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ: గ్లోబల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అండ్ ఆటోమేషన్ కంపెనీ ష్నైడర్ ఎలక్ట్రిక్.. తాజాగా బెంగళూరులో స్మార్ట్ ఫ్యాక్టరీని ప్రారంభించింది. పరిశ్రమలకు అవసరమైన యూపీఎస్ సిస్టమ్స్, విద్యుత్ మోటారు భ్రమణ వేగాన్ని నియంత్రించే వేరియబుల్ స్పీడ్ వంటి వాటిని ఇక్కడ ఉత్పత్తి చేయనుంది. నూతన ప్లాంట్ కోసం 700 మందిని నియమించుకున్నట్లు బుధవారం ప్రకటించింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలోనే హైదరాబాద్‌లో ఈ సంస్థ ఫ్యాక్టరీని ప్రారంభించింది. 2020 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా 100 స్మార్ట్ ఫ్యాక్టరీలను ప్రారంభించాలని లక్ష్యంగా ప్రకటించింది.

మొబైల్ టారిఫ్‌లలో మరింత పారదర్శకత

- యూజర్ల వినియోగానికి తగ్గ ప్లాన్ సూచించేలా టారిఫ్ కాల్క్యులేటర్
- కొత్త, పాత ప్లాన్ల వివరాలన్నీ టెల్కోలు అందుబాటులో ఉంచాలి
- ట్రాయ్ ప్రతిపాదనలు; అభిప్రాయ సేకరణ

న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ సర్వీస్ రేట్ల విషయంలో మరింత పారదర్శకత తెచ్చే దిశగా టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కస్టమర్లకు అనువైన ప్లాన్ సూచించేలా టారిఫ్ కాల్క్యులేటర్ ప్రవేశపెట్టడం తదితర ప్రతిపాదనలు చేసింది. టెలికం ఆపరేటర్లు కొత్త ప్లాన్లు ప్రవేశపెట్టినప్పుడు.. పాత పథకాల వివరాలు కూడా అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించింది. దీనివల్ల రెండింటిని పోల్చి చూసుకుని తగిన ప్లాన్ ఎంపిక చేసుకోవడం సులువవుతుంది. ప్రస్తుతం టెల్కోలు కొత్త ప్లాన్లు ప్రవేశపెట్టాక.. పాత ప్లాన్ల వివరాలను తొలగించేస్తున్నాయి. ఫలితంగా సరైన సమాచారం లేకపోవడం లేదా వివరాలు తప్పుదోవ పట్టించేవిగా ఉండటం లేదా అస్పష్టంగా ఉండటం వంటి వివిధ కారణాలతో యూజర్లు గందరగోళ పరిస్థితి ఎదుర్కొంటున్నారని ట్రాయ్ అభిప్రాయపడింది.

ఇక యూజరు తను ఎంత డేటా, ఎన్ని నిమిషాల అవుట్‌గోయింగ్ వాయిస్ కాల్స్ చేయొచ్చు, ఎన్నాళ్ల వేలిడిటీ కోరుకుంటున్నారు తదితర వివరాలిస్తే.. వారికి అత్యంత అనువైన ప్లాన్స్‌ను సూచించేలా టారిఫ్ కాల్క్యులేటర్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని ట్రాయ్ పేర్కొంది. మరోవైపు, ఫెయిర్ యూసేజీ పాలసీ (ఎఫ్‌యూపీ), ఫస్ట్ రీచార్జ్ కండీషన్ (ఎఫ్ఆర్‌సీ) వంటి విధానాలు అమలు చేసేటప్పుడు షరతులు, నిబంధనలను సవివరంగా తెలపకపోవడం లేదా తెలిపినా స్పష్టత లేకపోవడం వంటి అంశాల వల్ల యూజర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని ట్రాయ్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సర్వీసులు మెరుగుపర్చడానికి టెల్కోలు ఇంకా ఏం చర్యలు తీసుకోవచ్చన్న దానిపై అభిప్రాయాలు తెలపాలంటూ టెలికం యూజర్లకు ట్రాయ్ సూచించింది. అభిప్రాయాలు పంపేందుకు తుది గడువు డిసెంబర్ 26 కాగా.. పరిశ్రమ వర్గాలు కౌంటర్ కామెంట్స్ సమర్పించేందుకు జనవరి 9 ఆఖరు తేదీగా ట్రాయ్ నిర్ణయించింది. కాగా, చార్జీలు పెంచాలని టెల్కోలు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రస్తుతం దీనిపై జోక్యం చేసుకోరాదని ట్రాయ్ భావిస్తున్నట్లు సమాచారం.

టెల్కోల చీఫ్‌లతో ట్రాయ్ చైర్మన్ భేటీ..

వచ్చే ఏడాది (2020) దేశీ టెలికం రంగానికి సంబంధించిన అజెండా రూపకల్పనలో భాగంగా వొడాఫోన్–ఐడియా సీఈవో రవీందర్ టక్కర్ సహా వివిధ టెల్కోల చీఫ్‌లతో ట్రాయ్ చైర్మన్ ఆర్ ఎస్ శర్మ సమావేశమయ్యారు. 2020లో ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

వాహనదారులకు యాక్సిస్ ఉచిత ఫాస్టాగ్స్

ముంబై: జాతీయ రహదారులపై ప్రయాణించాలంటే డిసెంబర్ ఒకటి నుంచి అన్ని వాహనాలకూ ఫాస్టాగ్ ఉండాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో కొన్ని నెలలపాటు ట్యాగ్స్‌ను ఉచితంగా అందిస్తామని యాక్సిస్ బ్యాంక్ బుధవారం ప్రకటించింది. ట్రాఫిక్ సమస్యలను అధిగమించడంలో భాగంగా టోల్‌ప్లాజాలు, పార్కింగ్ ప్రాంతాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా, ఫాస్టాగ్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తుండగా.. ఈ టెక్నాలజీకి సేవలందించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకోవడం కోసం ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. దీంతో పాటు ఇందుకోసం ప్రతి ఒక్క ట్యాగ్‌కు రూ. 100 వరకు ఖర్చు పెట్టనున్నట్లు వెల్లడించింది. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్ ట్యాగ్స్‌ను ఉచితంగా అందిస్తుండగా, ప్రాసెసింగ్ ఛార్జీలను ఎత్తివేసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈనెల చివరివరకే ఈ సేవలు అందిస్తామని ఇరు బ్యాంకులు ప్రకటించాయి.

70 లక్షల ఫాస్టాగ్‌ల జారీ

దేశవ్యాప్తంగా 70 లక్షల ఫాస్టాగ్‌లను (బుధవారం నాటికి) జారీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ 26 (మంగళవారం) నాడు అత్యధికంగా 1,35,583 ట్యాగ్‌లు అమ్ముడుకాగా, అంతకుముందు రోజు 1.03 లక్షల విక్రయాలు నమోదైనట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ వెల్లడించింది.

చేయకూడనివన్నీ చేసింది..

- కార్వీపై సెబీ చీఫ్ త్యాగి వ్యాఖ్యలు
- సంస్థపై ఈవై ఫోరెన్సిక్ ఆడిట్
- సెబీ, ఎన్ఎస్ఈతో బ్యాంకర్ల చర్చలు

ముంబై/హైదరాబాద్ బిజినెస్ బ్యూరో: క్లయింట్ల షేర్లను తనఖా పెట్టి ఆ సొమ్మును సొంత అవసరాలకు వాడుకుందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ అజయ్ త్యాగి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నియంత్రణ సంస్థ ఎన్నడూ అనుమతించని కార్యకలాపాలన్నింటినీ కార్వీ సాగించిందని వ్యాఖ్యానించారు. 'ఇలాంటి లావాదేవీలు జరపరాదంటూ విస్పష్టమైన సర్క్యులర్ జూన్‌లోనే ఇచ్చాం. అయితే గతంలో కూడా వీటికి అనుమతి లేదు. కార్వీ మాత్రం ప్రాథమికంగా అనుమతించని పనులన్నీ చేసింది. నిబంధనల్లో ప్రత్యేకంగా లేదు కాబట్టి క్లయింట్ల షేర్లను సొంతానికి వాడేసుకుంటామంటే కుదరదు' అని త్యాగి స్పష్టం చేశారు. కార్పొరేట్ గవర్నెన్స్‌పై ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) నిర్వహించిన ఆసియా రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కార్వీ గతంలోనూ ఇలాంటివి చేసిందని చెప్పిన త్యాగి... గతంలో తమ ఆడిట్లలో వీటిని ఎందుకు బయటపెట్టలేకపోయామన్నది మాత్రం చెప్పలేదు.

ఎన్ఎస్ఈ, సెబీతో బ్యాంకర్ల చర్చలు..

కార్వీ స్టాక్ బ్రోకింగ్ ఖాతాల్ని ఫోరెన్సిక్ ఆడిట్ చేసేందుకు ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) సంస్థను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) నియమించినట్లు సమాచారం. మరోవైపు, కార్వీకి రుణాలు ఇచ్చిన బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థల్లో ఆందోళన పెరుగుతోంది. సెబీ ఉత్తర్వుల్లో రియల్ ఎస్టేట్ లావాదేవీల ప్రస్తావన కూడా ఉండటంతో దీనిపై అవి మరింతగా దృష్టి పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రత, కార్వీకి చెందిన కంపెనీలేమైనా డిఫాల్ట్ అయ్యే అవకాశాలున్నాయా అన్న విషయాల గురించి తెలుసుకునేందుకు ఎన్ఎస్ఈ, సెబీతో అవి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను తనఖా పెట్టి బ్యాంకుల నుంచి కార్వీ సుమారు రూ. 600 కోట్ల మేర నిధులు తీసుకున్నట్లు తెలియవచ్చింది.

అంతా సర్దుకుంటుంది

కీలక ఉద్యోగులకు కార్వీ చీఫ్ లేఖ

ఈ సమస్య నుంచి సత్వరమే బయటపడగలమని కార్వీ గ్రూప్ చైర్మన్ సి.పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. తనఖాలో ఉన్న షేర్లను త్వరలోనే విడిపిస్తామని, క్లయింట్లకు కూడా చెల్లింపులు జరిపేస్తామని పేర్కొంటూ సంస్థ కీలక ఉద్యోగులకు బుధవారం ఆయనో లేఖ రాసినట్లు తెలిసింది. గరిష్ఠంగా రెండు వారాల్లో చెల్లింపులు పూర్తిచేస్తామని కొద్దిరోజులుగా చెబుతున్న ఆయన... ఈ లేఖలో కూడా అదే విషయాన్ని పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

భారత్‌లో మాంద్యం లేదు

- ఆర్థికమంత్రి సీతారామన్ స్పష్టీకరణ
- బడ్జెట్‌లో తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం లేదని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థ నెమ్మదించి వుండవచ్చుకానీ మాంద్యంలోకి మాత్రం జారిపోదని ఆమె స్పష్టం చేశారు. రాజ్యసభలో ఆర్థిక వ్యవస్థపై జరిగిన చర్చకు ఆమె ఈ సమాధానం ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి తన మొదటి బడ్జెట్‌లో పలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా అంశాలు సత్ఫలితాలను ఇవ్వడం ప్రారంభించాయని వివరించారు. ఆటోమొబైల్ వంటి కొన్ని రంగాలు రికవరీ బాటన నడుస్తున్న సంకేతాలు వస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదాయ పరిస్థితులపై ఆందోళనలు అక్కర్లేదని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలలనూ (2019 ఏప్రిల్–అక్టోబర్) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే, అటు ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఇటూ వస్తు, సేవల పన్ను వసూళ్లు పెరిగాయని ఆర్థికమంత్రి తెలిపారు. అయితే కాంగ్రెస్, టీఎంసీ, వామపక్ష పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగాన్ని వల్లెవేస్తున్నారు తప్ప, ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని ఆయా పార్టీలు విమర్శించాయి. వరుసగా రెండు త్రైమాసికాలు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరక్కపోగా, మైనస్‌లోకి జారితే దానిని మాంద్యంగా పరిగణిస్తారు. ఆర్థిక మంత్రి సమాధానంలో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి చర్యనూ తీసుకోవడం జరుగుతోంది.
- యూపీఏ–2 ఐదేళ్ల కాలంతో పోల్చిచూస్తే, 2014 నుంచీ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా మెరుగుపడింది. ద్రవ్యోల్బణం అదుపులో నిర్దేశిత శ్రేణి (2 శాతం ప్లస్ లేదా మైనస్ 2తో)లో ఉంది. ఆర్థిక వృద్ధి తీరు బాగుంది. ఇతర ఆర్థిక అంశాలు కూడా బాగున్నాయి.
- గడచిన రెండేళ్లలో స్థూల దేశీయోత్పత్తి మందగించిన మాట వాస్తవం. అయితే ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. అందులో ఒకటి బ్యాంకింగ్ మొండిబకాయిల భారం. రెండవది కార్పొరేట్ భారీ రుణ భారం. ఈ రెండు అంశాలూ యూపీఏ పాలనా కాలంలో ఇచ్చిన విచక్షణా రహిత రుణ విపరిణామాలే.
- జూలై 5 బడ్జెట్ తరువాత బ్యాంకింగ్‌కు రూ.70,000 కోట్ల అదనపు మూలధన మంజూరు జరిగింది. దీనితో బ్యాంకింగ్ రుణ సామర్థ్యం గణనీయంగా పెరిగింది.
- బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ (ద్రవ్యలభ్యత) సమస్య లేదు.
- దివాలా కోడ్ వంటి సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ వరకూ సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.3.26 లక్షల కోట్లు. బడ్జెట్ అంచనాలు రూ.6,63,343 కోట్లలో అక్టోబర్ ముగిసే నాటికి దాదాపు సగం వసూళ్లు జరిగాయి. కాగా ప్రత్యక్ష పన్నుల వసూళ్ల బడ్జెట్ లక్ష్యం రూ.13,35,000 కోట్లయితే, అక్టోబర్ ముగిసే నాటికి నికర వసూళ్లు రూ.5,18,084 కోట్లుగా ఉన్నాయి.
- 2014–15లో జీడీపీలో ప్రత్యక్ష పన్నుల నిష్పత్తి 5.5 శాతం ఉంటే, 2018–19లో ఈ నిష్పత్తి 5.98 శాతానికి పెరిగింది.
- 2009–14 మధ్య విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం 189.5 బిలియన్ డాలర్లయితే, తరువాతి ఐదేళ్లలో ఈ మొత్తం 283.9 బిలియన్ డాలర్లుగా ఉంది.
- 2020 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కాలుష్య ప్రమాణాలు ప్రస్తుత బీఎస్ 4 నుంచి బీఎస్ 6కు మారాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో వాహన రంగంలో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. అయితే, ప్రభుత్వ చర్యలతో క్రమంగా ఈ రంగం రికవరీ బాట పడుతోంది.

విమానయాన సంస్థలతో తల్వార్ లింకులపై దర్యాప్తు

న్యూఢిల్లీ: కార్పొరేట్ లాబీయిస్ట్ (వ్యవహారాల నేర్పరి) దీపక్ తల్వార్‌కు దేశ, విదేశాలకు చెందిన 50 సంస్థలతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు ఏజెన్సీలు దృష్టి సారించాయి. తన విదేశీ క్లయింట్లకు అనుకూలంగా ఎయిర్ ట్రాఫిక్ హక్కులను సంపాదించేందుకుగాను ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయనేతలకు తల్వార్ లంచాలు ఇచ్చినట్టు.. తద్వారా విమానయాన సంస్థల నుంచి తల్వార్‌కు రూ.272 కోట్లు ముట్టినట్టు దర్యాప్తు నివేదిక స్పష్టం చేస్తోంది. యూపీఏ హయాంలో తల్వార్ లాబీయింగ్ వ్యవహారాలు, ముఖ్యంగా విమానయాన రంగానికి సంబంధించిన వాటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ దర్యాప్తు చేస్తున్నాయి. ప్రస్తుతం తల్వార్ జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నాడు. ఈ ఆరోపణలను ఆయన ఖండించడం గమనార్హం. ఎయిర్‌ఇండియా ప్రయోజనాలకు గండికొట్టి.. 2008–09లో మూడు విదేశీ విమానయాన కంపెనీలకు అనుకూలంగా ట్రాఫిక్ హక్కులను తల్వార్ సంపాదించిపెట్టినట్టు దర్యాప్తు ఏజెన్సీలు అభియోగాలు మోపాయి.

డేటా విస్తృతం.. కానీ వినియోగమే కష్టం

- డేటాను నూతన ఇంధనంగా నేడు ప్రపంచం పరిగణిస్తుండగా, దేశీయంగా మాత్రం ఆర్థిక సేవల కంపెనీలు దీన్ని వినియోగించుకునే విషయంలో సమస్యలను ఎదుర్కొంటున్నట్టు ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తరఫున ఏఐటీఈ సంస్థ నిర్వహించి సర్వే ద్వారా తెలిసింది. తమకు అందుబాటులో ఉన్న విస్తృతమైన డేటా నవాలు వంటిదిని బీమా, ఫైనాన్స్ రంగానికి చెందిన 86 శాతం ఎగ్జిక్యూటివ్‌లు చెప్పడం గమనార్హం.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (24 క్యారెట్లు)	39,060		0
బంగారం (22 క్యారెట్లు)	37,200		0
వెండి (కిలో)	47,900	▲	200
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	37,930	▼	60
బంగారం (22 క్యారెట్లు)	36,120	▼	60
వెండి (కిలో)	47,900	▲	200
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	37,930	▼	60
బంగారం (22 క్యారెట్లు)	36,120	▼	60
వెండి (కిలో)	47,900	▲	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	38,750	▲	50
బంగారం (22 క్యారెట్లు)	35,910	▲	70
వెండి (కిలో)	45,700	▲	100
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	39,060	▼	60
బంగారం (22 క్యారెట్లు)	36,120	▼	60
వెండి (కిలో)	47,900	▲	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	57.68 (రాత్రి 11.30కు)	$58.41 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	62.60 (రాత్రి 11.30కు)	$63.21 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 28-11-2019

విశాఖ	455-00
చిత్తూరు	461-00
వరంగల్	438-00
27-11-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	435-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.95
విజయవాడ	451-00
నమక్కల్	423-00
గోదావరి	451-00

కొత్త శిఖరాలకు సూచీలు

- తుది దశలో అమెరికా–చైనాల వాణిజ్య ఒప్పందం
- లాభాల్లో ప్రపంచ మార్కెట్లు
- పుంజుకున్న రూపాయి
- కొనసాగుతున్న విదేశీ కొనుగోళ్లు
- రికార్డ్ స్థాయిల్లో సూచీల ముగింపు
- 199 పాయింట్లతో 41,021కు సెన్సెక్స్
- 63 పాయింట్లు పెరిగి 12,101కు నిఫ్టీ

స్టాక్ మార్కెట్లో రికార్డ్‌ల పరంపర కొన సాగుతోంది. మంగళవారం ఇంట్రాడేలో కొత్త రికార్డ్‌లను సృష్టించిన సెన్సెక్స్, నిఫ్టీలు బుధవారం ముగింపులో కొత్త శిఖరాలకు చేరాయి. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడంతో ప్రపంచ మార్కెట్లు లాభపడటం సానుకూల ప్రభావం చూపించింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగుతుండటం, నవంబర్ సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు మరో రోజులో ముగియనుండటంతో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ పుంజుకోవడం కలసివచ్చాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 199 పాయింట్లు పెరిగి 41,021 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 63 పాయింట్లు ఎగసి 12,101 పాయింట్ల వద్ద ముగిశాయి. ఈ రెండు సూచీలకు ఇవి జీవిత కాల గరిష్ట స్థాయి ముగింపులు. వీటితో పాటు బ్యాంక్ నిఫ్టీ కూడా 31,876 పాయింట్ల వద్ద జీవిత కాల గరిష్ట స్థాయిలో ముగిసింది. బ్యాంక్, ఆయిల్, గ్యాస్, వాహన, ప్రభుత్వ రంగ షేర్లు లాభపడ్డాయి. రియల్టీ, టెలికం, క్యాపిటల్ గూడ్స్ షేర్లు లాభాల స్వీకరణ కారణంగా నష్టపోయాయి.

వాహన షేర్లకు 'స్క్రాప్ పాలసీ' లాభాలు

ఆర్‌బీఐ కీలక రేట్లను తగ్గించగలదన్న అంచనాలతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. వాహన తుక్కు విధానాన్ని (స్క్రాపేజ్ పాలసీ) ప్రభుత్వం తీసుకు రానున్నదన్న వార్తల కారణంగా వాహన, వాహన విడిభాగాల షేర్లు పెరిగాయి. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, అశోక్ లేలాండ్, మారుతీ సుజుకీ, ఐషర్ మోటార్స్, హీరో మోటొకార్ప్, టీవీఎస్ మోటార్ కంపెనీ, బజాజ్ ఆటోలు 1–3 శాతం రేంజ్‌లో పెరిగాయి. లాభాల్లో ఆరంభమైన సెన్సెక్స్, నిఫ్టీలు రోజంతా ఇదే జోరు చూపించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 254 పాయింట్ల లాభంతో 41,076 పాయింట్లకు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 77 పాయింట్లు ఎగసి 12,115 పాయింట్లకు చేరాయి. షాంఘై సూచీ మినహా మిగిలిన అన్ని ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీలు ఆల్‌టైమ్ హైల వద్ద ముగిసినప్పటికీ, వందకు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. అలహాబాద్ బ్యాంక్, చెన్నై పెట్రో, జైన్ ఇరిగేషన్, ఎంఫసిస్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. పలు షేర్లు ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయిలకు చేరాయి. దివీస్ ల్యాబ్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ గ్రీన్, పీఐ ఇండస్ట్రీస్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

- యస్ బ్యాంక్ 8 శాతం లాభంతో రూ. 68 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. నిధుల సమీకరణ నిమిత్తం ఈ నెల 29న బోర్డ్ సమావేశం జరగనున్నదన్న వార్తలు దీనికి కారణం.
- ఎస్‌బీఐకు చెందిన క్రెడిట్ కార్డ్‌ల విభాగం, ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) పత్రాలను మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీకి సమర్పించిన నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్ 2.4 శాతం లాభంతో రూ.344 వద్ద ముగిసింది.ఈ బ్యాంక్ మార్కెట్ క్యాప్ మళ్లీ రూ.3 లక్షల కోట్లకు ఎగబాకింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడ్డ రెండో షేర్ ఇదే.
- ఎల్ అండ్ టీ షేర్ 2 శాతం నష్టంతో రూ.1,335 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.

సూచీల రికార్డ్ స్థాయి ముగింపులు

సూచీ	పాయింట్లు
సెన్సెక్స్	41,021
నిఫ్టీ	12,101

రూ.8 పెరిగితే.. పది లక్షల కోట్లకు!

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 0.7 శాతం లాభంతో రూ.1,570 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాప్ రూ.9.96 లక్షల కోట్లకు పెరిగింది. ఈ షేర్ రూ.8 పెరిగితే కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.10 లక్షల కోట్లకు పెరుగుతుంది. భారత్‌లో అత్యధిక మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీ ఇదే.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,207
ఎన్‌ఎస్‌ఈ	35,175
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	12,08,610
ఎఫ్‌ఐఐ	43
డీఐఐ	439

హెచ్‌డీఐఎల్‌కు చెందిన విమానాల విక్రయానికి అనుమతి

ముంబై: పీఎంసీ బ్యాంకు స్కామ్‌లో హెచ్‌డీఐఎల్ గ్రూపునకు చెందిన రెండు విమానాలు, ఒక యాచ్ విక్రయానికి కోర్టు అనుమతించింది. హెచ్‌డీఐఎల్ గ్రూపు పీఎంసీ బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని ఎగవేసిన విషయం విదితమే. ఈ కేసులో దర్యాప్తు ఏజెన్సీలు జప్తు చేసిన చరాస్తుల విక్రయానికి అనుమతించాలని కోరుతూ ఆర్‌బీఐ నియమిత అడ్మినిస్ట్రేటర్ ముంబై చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. వీటి విక్రయం ద్వారా వచ్చే డబ్బులు పీఎంసీ బ్యాంకు డిపాజిటర్లకు చెల్లింపులు చేయడానికి సాయపడతాయని వివరించారు. దీంతో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి సానుకూల ఆదేశాలు వెలువడ్డాయి.

హైదరాబాద్‌లో హరిరామ్ ఇంజనీరింగ్ షోరూం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పేపర్ ప్లేట్స్ మెషీన్ల తయారీలో ఉన్న సూరత్ కంపెనీ హరిరామ్ ఇంజనీరింగ్ తెలంగాణలో ప్రవేశించింది. హైదరాబాద్‌లో దూలపల్లి ఎక్స్ రోడ్ సమీపంలో తొలి షోరూంను ఏర్పాటు చేసింది. పేపర్ ప్లేట్లు, కప్పుల తయారీ మెషీన్ల అమ్మకం, విక్రయానంతర సేవలు ఇక్కడ లభిస్తాయని కంపెనీ ఎండీ గౌతమ్ చందు బుధవారమిక్కడ తెలిపారు. ప్లేట్లు, కప్పుల తయారీకి కావాల్సిన పేపర్ సైతం ఈ షోరూంలో దొరుకుతుంది.

సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల్లో భారత్ వాటా అంతంతమాత్రమే..

బెంగళూరు: ప్రపంచ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల మార్కెట్లో భారత్ వాటా నామమాత్రంగానే ఉందని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ రాజీవ్ కుమార్ ఇక్కడ ఒక కార్యక్రమంలో అన్నారు. ఎగుమతుల కంటే..దిగుమతులే అధికమన్నారు. గ్లోబల్ మార్కెట్ విలువ 438 బిలియన్ అమెరికా డాలర్లుగా ఉంటే, భారత్ మొత్తం సాఫ్ట్‌వేర్ వ్యాపారం కేవలం 8.2 బిలియన్ డాలర్లని, ఇందులో ఎగుమతుల వాటా 2 బిలియన్ డాలర్లు మాత్రమేనని తెలిపారు.

రెండవరోజూ రూపాయికి 15 పైసలు లాభం

71.35 వద్ద ముగింపు

ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ బుధవారం మరో 15 పైసలు బలపడింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో 71.35 వద్ద ముగిసింది. ఇది రెండు వారాల గరిష్టస్థాయి. మంగళవారం ముగింపు 71.50. దేశీయ ఈక్విటీలకు లాభాలు, కొనసాగుతున్న విదేశీ పెట్టుబడుల ప్రవాహం రూపాయి సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇదే కారణాలతో మంగళవారం కూడా రూపాయి బలపడింది. బుధవారం ట్రేడింగ్ మొదట్లో 71.43 వద్ద పటిష్టంగా రూపాయి ప్రారంభమైంది. ఒక దశలో 71.30 గరిష్టాన్నీ చూసింది. మొత్తంగా 71.30–71.48 శ్రేణిలో తిరిగింది. గత ఏడాది అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది.

వీడియోకాన్ నష్టాలు రూ.6,761 కోట్లు

న్యూఢిల్లీ: దివాలా ప్రక్రియ నడుస్తున్న వీడియోకాన్ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరంలో భారీ నష్టాలను ప్రకటించింది. మార్చి, 2019తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.6,761 కోట్ల నికర నష్టాలు వచ్చాయని సంస్థ తెలిపింది. ఆదాయం భారీగా తగ్గడమే దీనికి కారణమని పేర్కొంది. అంతకు ముందటి ఆర్థిక సంవత్సరంలో నష్టాలు రూ.5,264 కోట్లని వెల్లడించింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూ.3,424 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,063 కోట్లకు తగ్గిందని కంపెనీ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం రూ.1,413 కోట్ల రుణాలను రద్దు చేశామని వివరించింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లకు వీడియోకాన్ గ్రూప్ బకాయిలు రూ.90,000 కోట్ల మేర ఉంటాయి.

కార్పొబ్రీఫ్స్...

సెయిల్: ఉక్కు ఉత్పత్తి కంపెనీ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. వ్యయ నియంత్రణపై దృష్టి సారించింది. 'కాస్ట్ కంట్రోల్ డ్రైవ్' పేరుతో కంపెనీని చక్కదిద్దే పనిలో పడినట్లు కంపెనీ చైర్మన్ చౌదరి తెలిపారు.

ఫస్ట్‌క్రై: బేబీ ప్రొడక్ట్స్ విక్రయంలో ఉన్న పుణే కంపెనీ ఫస్ట్‌క్రై.. ప్రీ ప్రైమరీ విభాగంలో ఉన్న పీపుల్ కంబైన్ గ్రూప్‌నకు చెందిన ఓయి ప్లేస్కూల్‌ను కొనుగోలు చేసింది. 2010లో ప్రారంభమైన ఓయి ప్లేస్కూల్ హైదరాబాద్, బెంగళూరులో కార్యకలాపాలు సాగిస్తోంది. రెండు నగరాల్లో కలిపి 55 కేంద్రాలున్నాయి.

కైనెటిక్ గ్రీన్: పుణేకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ కైనెటిక్ గ్రీన్.. ఆటో విడిభాగాల ఉత్పత్తి కంపెనీ ఆటోలైన్ ఇండస్ట్రీస్‌తో జట్టుకట్టింది. ఈ–సైకిల్స్ తయారీ, అభివృద్ధి నిమిత్తం ఇరు సంస్థల మధ్య ఒప్పందం పూర్తయినట్లు కైనెటిక్ గ్రూప్ చైర్మన్ ఫిరోడియా చెప్పారు. వచ్చే నెల్లో ఈ–స్పీడ్ పేరుతో రూ. 24,999కే ద్విచక్ర వాహనాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. ఇక తాజా ఒప్పందం ద్వారా దాదాపు పూర్తి స్థాయిలో దేశీయంగానే అసెంబ్లింగ్ జరగనుందని వివరించారు.

క్లుప్తంగా...

ఎయిమ్స్‌లో దుబ్బాక డాక్టర్‌కు ఫస్ట్ ర్యాంక్

కూతురుతో డాక్టర్ సృజన

దుబ్బాకటౌన్: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఢిల్లీ (ఎయిమ్స్) నిర్వహించిన న్యూరాలజీ సూపర్ స్పెషాలిటీ విభాగం ప్రవేశపరీక్షలో సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన డాక్టర్ బిల్ల సృజన జాతీయస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. 2020 ప్రవేశాలకు సంబంధించి ఎయిమ్స్ మంగళవారం రాత్రి ఈ ఫలితాలను ప్రకటించింది. సృజన భర్త డాక్టర్ ప్రణీత్ ఢిల్లీ ఎయిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పనిచేస్తున్నారు. సృజన ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, గాంధీ ఆసుపత్రిలో ఎండీ పూర్తి చేశారు.

కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గజ్వేల్‌రూరల్: కోర్టు ఆవరణలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకుంది. సీఐ ప్రసాద్ కథనం ప్రకారం.. ఓ కేసు నిమిత్తం బుధవారం సోమేశ్ కోర్టుకు వచ్చాడు. తనను కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొంటూ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గమనించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సోమేశ్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సీఐ తెలిపారు.

నటుడు సంపూర్ణేశ్ కారును ఢీకొన్న బస్సు

సిద్దిపేటకమాన్: సినీ నటుడు సంపూర్ణేశ్ బాబు ప్రయాణిస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కారు స్వల్పంగా దెబ్బతింది. నటుడు సంపూర్ణేశ్ సురక్షితంగా బయట పడ్డాడు. సిద్దిపేట న్యూ బస్టాండ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సంపూర్ణేశ్ బాబు తన భార్యా పిల్లలతో కలసి కారులో శ్రీనగర్ కాలనీ నుంచి పాత బస్టాండ్ వైపు వెళుతుండగా కొత్త బస్టాండ్ వద్ద ఓ ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ తాత్కాలిక డ్రైవర్ సంపత్‌ను అదుపులోకి తీసుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కాటన్ ప్రెసింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

గద్వాల క్రైం: ఓ కాటన్ ప్రెసింగ్ మిల్లులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఐదు వేలకు పైగా పత్తి బేళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కొండపల్లి శివారులోని జయలక్ష్మీ కాటన్ ఇండస్ట్రీస్‌లో బుధవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అందులోని ఐదు వేలకు పైగా పత్తి బేళ్లకు మంటలు వ్యాపించాయి. రూ.2 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా.

20 మంది విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్

మెదక్ ఆస్పత్రిలో చికిత్స

మెదక్ రూరల్: పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తిమ్మానగర్‌లో చోటుచేసుకుంది. మెదక్ రూరల్ మండలం తిమ్మానగర్ ప్రాథమిక పాఠశాలలో 119 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బుధవారం మధ్యాహ్న భోజనం తిన్న కొద్దిసేపటికే ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు చేసుకోవడం మొదలుపెట్టారు. ఇలా దాదాపు 20 మంది వరకు వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన సిబ్బంది వైద్య చికిత్సల నిమిత్తం వారిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులను డీఈఓ రమేశ్‌బాబు పరామర్శించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

శివాలెత్తిన శునకాలు

అర్ధరాత్రి ఏడీఈని వెంబడించిన కుక్కలు

- భయంతో పరుగులు.. ఇంటి గేటు వద్ద గుండెపోటుతో మృత్యువాత
- మరో ఘటనలో ఫంక్షన్‌హాలు మేనేజర్ మృతి

గంగారాం మృతదేహం, ఆంజనేయులు(ఫైల్)

నిజామాబాద్ నాగారం: అర్ధరాత్రి కుక్కలు స్వైరవిహారం చేశాయి. రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. వివరాలు.. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఏడీఈని కుక్కలు వెంటాడగా, తప్పించుకునేందుకు పరుగెత్తిన ఆయన గుండెపోటుతో మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి చెందిన గంగారాం (55) కామారెడ్డిలో ఏడీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. నిజామాబాద్ మహాలక్ష్మీనగర్‌లో నివాసముంటున్న ఆయన.. రోజూ కామారెడ్డికి వెళ్లి వస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని నిజామాబాద్‌కు వచ్చిన గంగారాం.. నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా కుక్కలు ఒక్కసారిగా ఆయన వైపు దూసుకొచ్చాయి. దీంతో భయపడి పరుగులు పెట్టారు. వేగంగా పరుగెత్తిన గంగారాం.. ఇంటి గేటు ముందరకు రాగానే కుప్పకూలి పోయారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మరో ఘటనలో..

నిజామాబాద్ కోటగల్లి సమీపంలోని మైసమ్మ వీధికి చెందిన వేముల ఆంజనేయులు (49) బస్వాగార్డెన్ ఫంక్షన్ హాలు మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఫంక్షన్ హాలులోకి కుక్క రావడంతో వాచ్‌మన్‌తో పాటు ఆంజనేయులు దాన్ని తరిమేందుకు యత్నించారు. అయితే.. కుక్క ఒక్కసారిగా ఆంజనేయులుపై ఎదురుదాడి చేసి, వేలిని కొరికేసింది. ఈ క్రమంలో పట్టు తప్పి కింది పడిపోయిన ఆంజనేయులు తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన అతడ్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కోమాలోకి వెళ్లాడు. వైద్యులు శస్త్ర చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. బుధవారం తెల్లవారుజామున అతడు బ్రెయిన్‌డెడ్ అయి మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న పూజారులు

మేడారంలో పనులు ప్రారంభం

వనదేవతలకు పూజలు చేసిన అధికారులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తుండటంతో పనులు ప్రారంభించారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవార్లకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు అమ్మవార్లతోపాటు గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను అలికి ముగ్గులు వేసి కొత్త బట్టలు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టే అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా.. వాటితో గద్దెల ప్రాంగణంలో సెప్టిక్ ట్యాంకులు, కాల్వల నిర్మాణం, కాటేజీలకు కాంపౌండ్ వాల్, తాగునీటి సరఫరా, ఆలయాలు, గద్దెలకు రంగులు వేయడం, క్యూలైన్ల మరమ్మతులు, గ్రీన్‌షెడ్స్ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. కాంట్రాక్టర్లకు జాతర ఈఓ రాజేంద్రం, ఇంజనీరింగ్ అధికారులు చేపట్టనున్న పనుల ప్రాంతాలను చూపించి పూజారుల చేతుల మీదుగా ప్రారంభించారు.

మలేషియాలో శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం పలికిన మైట అధ్యక్షుడు తిరుపతి, తదితరులు

పెట్టుబడులు పెట్టండి

మలేషియా మైట సదస్సులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

సిరిసిల్ల: పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనువైందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం ఆయన మలేషియా వెళ్లారు. కౌలాలంపూర్‌లో మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైట) ఏర్పాటు చేసిన సదస్సులో బుధవారం మంత్రి మాట్లాడారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమల స్థాపించే వారికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 500 ఎకరాల్లో ఇండస్ట్రియల్ ఐటీ పార్కు., మల్టీ పర్పస్ పార్కులు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణలో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రవాసులు స్వరాష్ట్రంలో పరిశ్రమలు స్థాపిస్తే.. స్థానికులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది వివిధ కంపెనీల సీఈవోలు, డైరెక్టర్లు, మేనేజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో 'మైట'అధ్యక్షుడు సైదం తిరుపతి, డిప్యూటీ ప్రెసిడెంట్ సత్య, ఉపాధ్యక్షుడు బూరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, ఉపాధ్యక్షురాలు అశ్విత, ముఖ్యకార్యవర్గ సభ్యులు కిరణ్‌గౌడ్, ప్రతీక్, సత్య, సందీప్, సంతోష్, మలేషియా తెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు కాంత రావు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ ప్రభుత్వ బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

అర్ధరాత్రి బాహాబాహీ

బోధన్ ఎమ్మెల్యే సహా 11 మందిపై కేసు

బోధన్‌టౌన్: అర్ధరాత్రి బాహాబాహీకి దిగిన ఘటనలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ సహా 11 మందిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితుడైన ధర్మవరపు వేణుగోపాల్ మంగళవారం అర్ధరాత్రి ఆచన్‌పల్లి మలుపు వద్ద ఫోన్ మాట్లాడుతుండగా వరికుప్పల కృష్ణ, అతని కొడుకు మధు, మాజీ కౌన్సిలర్ గౌస్ అక్కడకు వచ్చారు. ఈ సమయంలో ఇక్కడేం చేస్తున్నావంటూ దుర్భాషలాడారు. ఇసుక రవాణాకు సంబంధించిన మామూళ్లు ఎమ్మెల్యే షకీల్‌కు ఇవ్వడం లేదంటూ దాడికి పాల్పడ్డారు. పక్కనే ఉన్న మురికి కాలువలోకి తోసేశారు. ఈ క్రమంలో రహీం, రఫీ ఖాన్, యాసీన్ ఖాన్ అడ్డుకునేందుకు యత్నించగా వారిపైనా దాడి చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే షకీల్, అతడి సోదరుడు సొహైల్, ఎమ్మెల్యే పీఏ ముజమ్మిల్, గన్‌మెన్ షఫీ, మహమూద్ రెంజల్ రఫీ.. యాసీన్‌ఖాన్, రఫీలను చితకబాదారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సహా 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అత్యాశతో అసలుకే ఎసరు!

- రూ.7 లక్షలకు 2 కిలోల బంగారం ఇస్తానని నమ్మబలికిన వైనం
- నకిలీ అని తేలడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

విశ్వంభరాచారి

జగిత్యాల క్రైం: అత్యాశకు పోతే అసలుకే ఎసరొచ్చింది. రూ.7 లక్షలకే రెండు కిలోల బంగారం ఇస్తామని నమ్మబలకడంతో మోసపోయాడు జగిత్యాలకు చెందిన విశ్వంభరాచారి. తీరా అది నకిలీ బంగారం అని తేలడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన కొత్తపల్లి విశ్వంభరాచారి మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇరవై రోజుల క్రితం విశ్వంభరాచారి ఫోన్‌కు అనంతపూర్‌కు చెందిన శంకర్ కాల్ చేశాడు. తమ పొలంలో తవ్వకాలు చేపడితే బంగారం దొరికిందని, తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలికాడు. ఈ నెల 14న శంకర్ జగిత్యాల మండలం ధరూర్‌కు వచ్చి నాలుగు బంగారు కాయిన్లను విశ్వంభరాచారికి ఇవ్వగా.. నాణ్యమైనవని తేలడంతో అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు చెల్లించాడు. మిగతా రూ.4 లక్షలు తీసుకొని అనంతపూర్‌కొస్తే రూ.2 కిలోల బంగారం అప్పగిస్తామని చెప్పి శంకర్ వెళ్లిపోయాడు. ఇది నమ్మిన విశ్వంభర్.. ఈ నెల 19న మిగతా సొమ్ముతో అనంతపూర్ వెళ్లాడు. అక్కడి నుంచి కల్యాణదుర్గం సమీపంలోని గొల్ల గ్రామానికి తీసుకెళ్లి రూ.4 లక్షలు తీసుకుని రెండు కిలోల బరువు గల బంగారం కాయిన్లను అప్పగించారు. జగిత్యాలకు వచ్చిన తర్వాత వాటిని పరిశీలించగా నకిలీవని తేలడంతో బుధవారం పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

500 గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద కేంద్రం నిధులు

సాక్షి, హైదరాబాద్: తొలిసారి గ్రామ పంచాయతీ భవనాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున విడుదల చేస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా 500 గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలో జరిగే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సమావేశంలో ఈ ప్రతిపాదనలు అందజేయనుంది. అయితే, గతంలోనే 500 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపగా తాజాగా మరోసారి ప్రతిపాదనలు కోరడంతో అదనంగా మరో 500 భవనాల జాబితాను పంపినట్లు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు తెలిపారు. కాగా, పంచాయతీ భవనాల వ్యయంలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. కొత్త భవనాల ప్రతిపాదనల్లో గతేడాది కొత్తగా ఏర్పడిన 4 వేల గ్రామపంచాయతీలను పరిగణనలోకి తీసుకోలేదు.

ఆదివారాల్లోనూ ఆధార్ అప్‌డేట్

యూఐడీఏఐ ఆధ్వర్యంలో మాదాపూర్‌లో ప్రత్యేక కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ఆధార్ కార్డులో పలు రకాల మార్పుల కోసం భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆఫ్‌లైన్‌లో నిరంతర సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే పోస్టాఫీలు, ప్రైవేటు కంప్యూటర్ సెంటర్లలో చేర్పులు మార్పులు చేస్తుండగా, తాజాగా యూఐడీఏఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ప్రత్యేక కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కేంద్రం ఆదివారం కూడా పనిచేస్తుంది. భారత ప్రభుత్వ అధీనంలోనే పనిచేసే ఈ కేంద్రాన్ని మాదాపూర్ విఠల్‌రావునగర్‌లోని రిలయన్స్ సైబర్‌విల్లే, ప్లాట్ నంబర్ 17-24లలో ప్రారంభించారు. ప్రతిరోజూ 16 వర్క్‌స్టేషన్లపై కార్డుల్లో మార్పులు చేర్పులు చేస్తారు. యూఐడీఏఐ వెబ్‌సైట్ ark.uidai.gov.in ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ తీసుకొని ఈ కేంద్రంలో తమకు కావాల్సిన సేవలను పొందవచ్చని ఆధార్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ గడ్డం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కేంద్రం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తుందని, ఇందులో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల నిండిన పిల్లలకు విధిగా వర్తించే బయోమెట్రిక్‌కు సంబంధించిన సేవలు ఉచితంగా అందిస్తామని ప్రతిరోజూ వెయ్యిమందికి అప్‌డేట్స్ (నవీకరణలు) చేస్తామని, దీనికోసం రూ.50 రుసుము చెల్లించాల్సి ఉంటుందని వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు.

మూడంచెల పద్ధతిలో స్టడీ సర్కిల్ అడ్మిషన్లు

ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని స్టడీ సర్కిళ్లలో మూడంచెల పద్ధతిలో అడ్మిషన్లు ఇస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసిన తర్వాత అధికారులతో సమావేశం నిర్వహించారు. స్టడీ సర్కిల్‌లో అడ్మిషన్ల విధానంలో పారదర్శకత కోసం మూడంచెల విధానాన్ని చేపట్టాలని, ఇందుకు సంబంధించి త్వరలో ఆదేశాలు జారీ చేస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టాలని సూచించారు. మంత్రి వెంట ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకుడు పి.కరుణాకర్ ఉన్నారు.

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో అంతర్జాతీయ పౌల్ట్రీ ఇండియా-2019 ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి కృషి

13వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను ప్రారంభించిన మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: కోడిగుడ్డుకు కనీస మద్దతు ధర విషయంలో త్వరలో ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో మూడు రోజుల పాటు జరిగే 13వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను మంత్రి బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల పరిశ్రమగా పౌల్ట్రీ ఇండస్ట్రీని తీర్చిదిద్దడంతో పాటు, దేశ పౌష్టికాహార అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో కోళ్ల పరిశ్రమను ఆదుకుంటామని, పౌల్ట్రీలకు ప్రభుత్వమే సబ్సిడీలు ఇస్తూ, పౌల్ట్రీ ఉత్పత్తులను రెసిడెన్షియల్ పాఠశాలలు, ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తుందన్నారు. కేజ్ బ్యాన్, అమెరికా నుంచి చికెన్ దిగుమతులు తదితర సమస్యలను పరిష్కరించని పక్షంలో పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) అధ్యక్షుడు చక్రధర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. భారత్.. ప్రపంచంలో గుడ్ల ఉత్పత్తిలో మూడు, చికెన్ ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉందన్నారు. అవరోధాలు ఎదురవుతున్నా దేశంలో బ్రాయిలర్ పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధి చెందుతోందన్నారు. మూడు రోజుల పాటు జరిగే పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోలో 375 అంతర్జాతీయ కంపెనీలు, వివిధ దేశాలకు చెందిన 1,550 మంది ప్రతినిధులు హాజరైనట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు..

చిన్న, మధ్య తరగతి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కొందరు రైతులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. కొంతకాలంగా బ్రాయిలర్, లేయర్ కోళ్లను పెంచుతున్న రైతులు ఆర్థిక నష్టాలతో పరిశ్రమకు దూరమయ్యారన్నారు. ఎగ్‌బోర్డు లేదా పౌల్ట్రీ రెగ్యులేటరీ బాడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

యాసంగిలో 40 లక్షల ఎకరాలకు నీరు

- అన్ని ప్రధాన ప్రాజెక్టుల కింద సాగునీటి విడుదలకు శివమ్ కమిటీ ఓకే
- భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల కింద 30 లక్షల ఎకరాలకు నీరు
- 'మైనర్' కింద 10 లక్షల ఎకరాలకు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, వాటిపై ఆధారపడ్డ ఎత్తిపోతల పథకాల కింద యాసంగిలో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరివ్వాలని రాష్ట్ర సాగునీటి సమీకృత, నీటి నిర్వహణ, ప్రణాళిక స్టాండింగ్ కమిటీ (శివమ్) నిర్ణయించింది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 30 లక్షల ఎకరాలు, చెరువులు, ఐడీసీ పథకాల కింద మరో 10 నుంచి 12 లక్షల ఎకరాలు కలిపి మొత్తంగా దాదాపు 40 లక్షల ఎకరాలకు నీరిచ్చే అవకాశముందని నిర్ణయించారు. ఒక్క సింగూరుపై ఆధార పడ్డ ఘన్‌పూర్ ఆనకట్ట మినహా ప్రధాన ప్రాజెక్టుల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నీటి లభ్యత ఉన్న దృష్ట్యా, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూనే సాగుకు నీరివ్వాలని నిర్ణయించారు.

సాగర్ కింద 6.40 లక్షల ఎకరాలకు..

రాష్ట్రంలో భారీ, మధ్య తరహా, చిన్న తరహా ప్రాజెక్టుల పరిధిలో నీటి లభ్యత, వినియోగం, తాగు, సాగునీటి అవసరాలపై చర్చించేందుకు బుధవారం నీటిపారుదల శాఖ శివమ్ కమిటీ హైదరాబాద్‌లోని జలసౌధలో భేటీ అయింది. ఈఎన్‌సీలు మురళీధర్, నాగేంద్రరావు, అనిల్‌కుమార్, కాడా కమిషనర్ మల్సూర్, అన్ని ప్రాజెక్టులు, జిల్లాల చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాలు, కనీస నీటిమట్టాలకు ఎగువన ఉండే లభ్యత జలాల లెక్కలపై భేటీలో చర్చించారు. ప్రభుత్వం మిషన్ భగీరథ కింద తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా, ఆ అవసరాల మేరకు ప్రాజెక్టుల పరిధిలో కనీస నీటిమట్టాలను నిర్వహిస్తూనే సాగుకు నీటి విడుదల అంశంపై చర్చించారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత 315 టీఎంసీల మేర ఉన్న దృష్ట్యా, అక్కడ పూర్తి స్థాయిలో 6.40 లక్షల ఎకరాలకు నీరివ్వాలని, ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ కింద మరో 2.80 లక్షల ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయించారు. దీనికోసం సాగర్ ఎడమ కాల్వ కింద 50 టీఎంసీలు, ఎస్ఎల్‌బీసీ అవసరాలకు మరో 20 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా బోర్డును కోరనున్నారు. ఎస్సారెస్పీ కింద 9.68 లక్షలు, ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద 2.50 లక్షలు ఎకరాలకు నీరు ఇవ్వనున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద 1.80 లక్షల ఎకరాలకు, నెట్టెంపాడు, భీమా, జూరాల కింద 30 వేల ఎకరాల చొప్పున నీరివ్వాలన్న ప్రతిపాదనకు కమిటీ ఓకే చెప్పింది. మొత్తంగా మేజర్ ప్రాజెక్టుల కిందే 25 లక్షల ఎకరాలకు నీరివ్వాలని కమిటీ సమావేశంలో నిర్ణయించారు. సింగూరులో నీటి లభ్యత లేని దృష్ట్యా అక్కడ 40 వేల ఎకరాలకు నీరిచ్చే పరిస్థితి లేదని నిర్ధారించింది. ఇక నిజాంసాగర్‌లో లభ్యతగా ఉన్న 4.06 టీఎంసీల్లో ఒకటిన్నర టీఎంసీని తాగు అవసరాలకు పక్కనపెట్టి మిగతా నీటితో కనీసంగా 30 వేల ఎకరాలకు సాగు నీరివ్వనున్నారు. మధ్యతరహా ప్రాజెక్టులైన కడెం, కొమరంభీం, గడ్డెన్నవాగు, సాత్నాల తదితర ప్రాజెక్టుల కింద 2 లక్షల ఎకరాలు.. దేవాదుల కింద 75 వేల ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయించారు.

మరో మూడు వారాలు ఉల్లి కొరత!

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అంచనా ● 500 టన్నులు ఇవ్వాలని కేంద్రానికి విన్నపం

సాక్షి, హైదరాబాద్: ఉల్లి కొరత మరో 3 వారాల వరకు ఉంటుందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వర్గాలు అంటున్నాయి. ఈజిప్ట్ నుంచి కేంద్ర ప్రభుత్వం 6,090 టన్నుల ఉల్లిని దిగుమతి చేసుకుంటోంది. అందులో 500 టన్నులు సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విన్నవించింది. ఈ మేరకు వారం రోజుల్లో రాష్ట్రానికి ఉల్లి వచ్చే అవకాశముందని అధికారులు అంటున్నారు. కాగా, రాష్ట్రంలో ఉల్లి ధరలను నియంత్రించేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, మెహదీపట్నం రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.40కే విక్రయించేలా ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. కొరతను వ్యాపారులు అవకాశంగా తీసుకొని ఇష్టారాజ్యంగా ధరలు పెంచకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణలో ఉల్లిపాయ ఫస్ట్ క్వాలిటీ ధర క్వింటాలుకు రూ.4 వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. కర్ణాటక, కర్నూలు నుంచి వచ్చే రెండో క్వాలిటీ ధర రూ.3,700 నుంచి రూ.6,000కు గరిష్టంగా పెరిగింది.

అధిక వర్షాల వల్లే..

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం వల్ల ఉల్లి విత్తనాలు వేయడంలో మూడు, నాలుగు వారాలు ఆలస్యమైంది. దీంతో ఖరీఫ్ ఉల్లిపాయ సాగు విస్తీర్ణం తగ్గింది. మన రాష్ట్రంలో ఖరీఫ్‌లో 10 వేల ఎకరాల్లోపే ఉల్లి సాగవుతుంది. ఉల్లి కోసం తెలంగాణ ఇతర రాష్ట్రాలపైనే ఆధారపడుతుంది. ప్రధానంగా కర్ణాటక, మహా రాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఆయా రాష్ట్రాల్లోనూ రుతుపవనాల ఆలస్యం వల్లే విస్తీర్ణం తగ్గింది. మరోవైపు కీలకమైన కోత సీజన్‌లో అకాల వర్షాలు ఉల్లి పంటను దెబ్బతీశాయి. దీంతో నాసిక్ జిల్లాలోని లాసల్‌గావ్ మార్కెట్‌లో 15 రోజుల్లో సగటు హోల్‌సేల్ ధరలు 120 శాతం పెంచారు.

రూత్ జార్జ్

పిలిస్తే పలకలేదన్న కోపంతో..

అమెరికాలో హైదరాబాద్ యువతిని హతమార్చిన దుండగుడు

డొనాల్డ్ తుర్మాన్

వాషింగ్టన్: అమెరికాలో దారుణ హత్యకు గురైన హైదరాబాద్‌కు చెందిన యువతి రూత్ జార్జ్ (19) తనతో మాట్లాడేందుకు నిరాకరించడం లేదా తాను పిలిస్తే స్పందించలేదనే కోపంతో నిందితుడు డొనాల్డ్ తుర్మాన్ చంపేసి ఉండొచ్చని ప్రాసిక్యూటర్ తెలిపారు. మాట్లాడలేదనే కోపంతోనే గొంతు నులిమి హత్య చేశాడని వివరించారు. మంగళవారం తుర్మాన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ సందర్భంగా కుక్ కౌంటీ ప్రాసిక్యూటర్ జేమ్స్ మర్ఫీ మాట్లాడుతూ.. నిందితుడు నేరం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం యూనివర్సిటీ క్యాంపస్ నుంచి జార్జ్ పార్కుకు నడుచుకుంటూ వెళ్తుండగా తుర్మన్ పిలవగా పలకలేదని.. కారు గ్యారేజీలోకి వెళ్తున్న జార్జ్‌ను వెంబడించాడని చెప్పారు. ఆమె చాలా అందంగా ఉందని, తనతో మాట్లాడాలని భావించాడని, అయితే ఆమె స్పందించలేదని వివరించారు. దీంతో కోపోద్రిక్తుడై గొంతు నులిమాడని, దీంతో అచేతనా స్థితిలోకి వెళ్లిందని చెప్పారు. ఆమెను తన కారు వెనుక సీటులోకి ఎక్కించి అత్యాచారం చేశాడని వివరించారు. తుర్మన్‌కు బెయిల్ ఇవ్వొద్దని, కస్టడీలోకి తీసుకోవాలని వాదనలు విన్న జడ్జి చార్లెస్ బీచ్-2 ఉత్తర్వులు ఇచ్చారు. ఆయుధాల దొంగతనం కేసులో ఆరేళ్ల జైలు శిక్ష పడ్డ తుర్మన్ రెండేళ్ల జైలులో ఉండి గతేడాది డిసెంబర్‌లో బెయిల్‌పై బయటికి వచ్చాడు. రూత్‌జార్జ్ షికాగోలోని యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లో ఆనర్స్ రెండో సంవత్సరం చదువుకుంటోంది. హైదరాబాద్‌కు చెందిన ఆమె కుటుంబం అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com